కరపత్రిక కథా కమామీషు

గొరక

ప్రశ్న అధ్యయన వేదిక
రాజమండ్రి
తూర్పు గోదావరి జిల్లా

కరపత్రాల కథా కమామీషు

గౌరవ్

నవనిర్మాణ యువజన సమాఖ్య సారధ్యంలో

@ సర్వహక్కులు సమాజానివి

సంకలిత కరపత్రాల కాలం : 2002 సం॥ నుండి....

ప్రచురణ కాలం : డిసెంబర్, 2013

ప్రతిపాదిత చందా : 40/- (ముప్పయి రూపాయలు)

* * *

గౌరవ్

ఇతర రచనలు

1. ప్రజాస్వామ్య పతనం	20/-
2. అరాజకత్వం అంటే ఏమిటి?	10/-
3. సాంఘిక తత్వం - వైప్లవ మార్గం	20/-
4. ఒక నాస్తికుడి నామా	15/-
5. ప్రజాస్వామ్య ప్రస్థానం	10/-
6. అస్తిత్వం - అరాజకత్వం	20/-
7. మద్యంపై యుద్ధం	10/-
8. మతానికి మరణశాసనం - మనిషికి పునరుజ్జీవనం	5/-

నా మాట

అకారణంగా నా అక్షర గమనమెప్పుడూ సాగలేదు. ఏ సకారణాన్ని విడిచిపెట్టనూ లేదు. అనుకున్న విషయాన్ని కరపత్రంగా ప్రచురించడం వల్ల ప్రజా బాహుళ్యంలోకి లోతుగా తీసుకెళ్ళొచ్చనే ఆలోచనే అందుక్కారణం. నాలుగ్గోడల్లో నగ్నంగా నడిచే అభ్యుదయం కన్నా, నలుగుర్లోనూ బట్టలేసుకు తిరిగే చైతన్యమే ప్రభావశీలమైందనే భావన నాది. అందుకే, పరిమితంగానయినా పవిత్రంగా ఉపయోగిస్తాను అక్షరాయుధాల్ని.

నా రాతలకెవరూ దాతల్లేరు. ఆరంభం నుండి ఒంటరిగానే రచనా వ్యాసంగాన్ని నా సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నాను. అప్పుడప్పుడు పొట్టకూటికోసం చేసే ఉద్యోగాలే ఇందుకు ఆధారం. ఈ కరపత్రాల్ని ప్రచురించినప్పుడు వీటిని భవిష్యత్తులో సంకలనంగా పుస్తక రూపంలో తేవాలన్న ఆలోచన నాకు లేదు సరికదా, కనీసం భద్రపరచుకోవాలనే జ్ఞానం కూడా లేకపోయింది. అనేకమంది మిత్రులు వీటికి అమూల్యమైన విలువనిచ్చి దాచుకోవడం వలనే నా పని తేలికయ్యింది.

2011 సంవత్సరంలో రాజస్థాన్ నుండి చేస్తున్న ఉద్యోగం వదిలొచ్చేసాక ఈ కరపత్రాల్ని ఒక దగ్గరికి చేర్చడానికి ప్రయత్నించాను. అయితే, ఒక క్రమాన్ని అనుసరించలేదు. ప్రజల్ని చైతన్యవంతం చేయడంలో ఇవి ఎంతో కొంత తమ పాత్ర సక్రమంగా నిర్వర్తించాయనడానికి నాకెదురయిన స్నేహాభిమానాలు - చేదు అనుభవాలు ప్రత్యక్ష సాక్ష్యాలు. ముఖ్యంగా కొన్ని ఈనాటికీ ప్రాధాన్యతను కోల్పోకుండా సమాజంలో ప్రచారమవుతూ ఉన్నాయి.

అయితే, వీటిలోని వాడిన భాషతోనూ, అభిప్రాయాలతోనూ ఈరోజు నేనేకీభవించట్లేదు. సంబంధిత వ్యక్తుల్ని తిట్టడం కంటే కూడా వారి ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చే ప్రయత్నాల్ని నిజాయితీగా చేయడమే ఏ భావ వికాసోద్యమానికైనా ప్రధానమని నేను భావించడమే అందుకు గల కారణం. నా మొత్తం కరపత్రాలు యాభై పై చిలుకే ఉంటాయి. ఇక మిత్ర సంస్థలకి రాసిన వాటికి లెక్కలేదు.

అన్నీ ప్రచురించడం శ్రమతో కూడింది. కావున తప్పనిసరై కొన్నింటిని మినహాయించాను. రాహుల్ సాంకృత్యాయన్, ఎమ్.ఎల్.ఎమ్. మార్క్సిటింగ్

విధానంపై, సోమసుందర్‌గారికి గ్రంథాలయ విషయంలో రాసిన తెలుగు ఆంగ్ల కరపత్రాలు (Letter of Liberty) గ్రంథాలయం నుంచి నా బహిష్కరణకు కారణమైన 'గ్రంథాలయంలో ఛండాలం', ఆ తర్వాత నేనే గ్రంథాలయాన్ని బహిష్కరిస్తూ శుద్ధ గ్రాంధికంలో రాసిన 'సువార్త' ఇందులో లేవు.

ఇవి కాక ఆంగ్లంలో ప్రచురించిన Destiny of Dalits, The Rhythum of Revolution, The Destruction of Democracy వంటివి కూడా మినహాయించాను. అలాగే జన విజ్ఞాన వేదికకీ, గ్రంథాలయ కార్యవర్గానికీ రాసిన లేఖల్ని కూడా చేర్చలేదు. అలాగే వ్యక్తుల్ని కించపరుస్తూ కొద్దిపాటి ఉద్రేక భావాల్తో రాసిన ఇతర వివాదాస్పద కరపత్రాల్ని కూడా ప్రచురించలేదు. వాటి భాషా శైలితో నేను ఈ రోజు పూర్తిగా విబేధిస్తున్నాను. ఇవేకాదు. ఒకప్పుడు నేను వ్యక్త పరిచిన భావాల్లో గాంధీ, రాయ్, ఇంకా కొద్దిమందిని కూడా కించపరిచే విధంగా రాసాను. వారి భావాలు చదవవలసినంతగా అప్పటికి నేను చదవకపోవడం వల్ల జరిగిన పొరపాటది. అలాగే ఇతర మతాల్ని మతస్తుల్ని కించపరిచిన పదాల్ని ఈరోజు పూర్తిగా ఉపసంహరించు కుంటున్నాను. ఉద్రేకాలెప్పుడూ ఉద్యమాలు కావు. ఉ ద్వేగాలతో ఉద్యమాలు రావు.

కాబట్టి, నా మునుపటి రచనలపై ఆధారపడి ఏదోక ముద్ర నాపై వేయించుకోడానికి నేనీనాడు సిద్ధంగా లేనన్న విషయాన్ని పాఠకులు గుర్తిస్తే సంతోషిస్తాను. వీటిలో కొన్ని పునర్ముద్రణ పొందాయి. మరికొన్ని, సంచలనాత్మకంగా చలామణీ అవుతున్నాయి.

ఈ కరపత్రాల కారణంగా నా కొచ్చిన బెదిరింపులు, బుజ్జగింపులు చాలానే ఉన్నాయి. అవమానాలూ, తిట్లూ, భౌతిక దాడులకు యత్నాలు కూడా జరగకపోలేదు. ఇవి నా ఆరంభ అన్వేషణకు – ప్రారంభ సంఘర్షణకు ప్రతిరూపాలన్న విషయం మనవి చేసుకుంటూ స్పందనల్ని ఆహ్వానిస్తున్నాను. కదలికకి కలం ప్రేరణ అందించగలదే కాని కాళ్లని కదిలించలేదు. కాబట్టి, ఎవరి ప్రయత్నాల్ని వాళ్ళు చేయాలి. ఫలితాన్ని సాంఘిక ప్రయోజనానికి వినియోగించాలి.

అదే విప్లవం, ఇదే జీవితం.

మీ

గౌరవ్

అంకితం

సమాజంలోని అంధకారాన్ని
సమూలంగా నిర్మూలించడానికి
అవిరామంగా శ్రమించి
మతోన్మాదుల ఘోరానికి
బలయిపోయిన మానవతావాది
'అంధ శ్రద్ధా నిర్మూలనా సమితి' స్థాపకుడు
'నరేంద్ర ధబోల్కర్'కి
అశ్రుపూరిత నయనాలతో...

* * *

"It often happens that men pull in a certain political, social or familiar harness simply because they never time to ask themselves whether the position they stand in and work they accomplish are right; whether their occupations really suit their inner desires and capacities, and give them the satisfaction which everyone has the right to expect from his work. Active men are especially liable to find themselves in such a position. Everyday brings with its fresh batch of work, and a man throws himself into his bed late at night without having completed what he had expected to do; then in the morning he hurries to the unfinished task of the previous day. Life goes, and there is no time left to think, no time to consider the direction that one's life is taking. So, it was with me."

– Peter Kroptkin

కరపత్రాల కథ

ముద్రణారంగం ఆవిష్కరింపబడిన తర్వాతే చిన్న కాగితపు పొత్తాల్ని కరపత్రంగా పిలిచేవారు. అంతకుముందు రాజరికపు పాలనలో చేత్తో రాసి పంపిణీ చేసే పత్రాల్ని ఆధారంగా చేసుకుని ఆ పేరొచ్చింది. కరపత్రాల్ని ప్రధాన ప్రచార సాధనాలుగా పరిగణించి విస్తృతంగా ఉపయోగించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీల్లో వీటిని వాడినట్లు ఆధారాలున్నాయి. అయితే, ఇవి ఎక్కువగా మత సంబంధమైనవిగానే ఉండేవి. మత సంస్కరణ నేపథ్యంగా రూపొందిన వివాదాస్పద కరపత్రాలు 16వ శతాబ్ద ప్రథమాంకంలో వచ్చాయి. వీటికి సంబంధించిన నిషేధపు ప్రకటనలు కూడా 1523, 1553, 1566 సంవత్సరాల్లో జారీ అయ్యాయి. జర్మనీలో పోప్‌కి వ్యతిరేకంగా రోమన్ క్యాథలిక్ శాఖని నిరసిస్తూ క్రైస్తవ ప్రొటెస్టెంట్ సంస్కరణా కరపత్రం ప్రథమంగా విడుదలయ్యింది. మార్టిన్ లూథర్ ప్రప్రథమ ప్రతిభాయుత కరపత్ర రచయితల్లో ఒకరు. కరపత్రాల విషయమై అనేక వివాదాలు మొదలవడంతో సమాజంలోని కొన్ని వర్గాలు ప్రత్యక్ష దాడులకు తెగబడే పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం 1589లో వీటిని నిషేధించింది.

ఎలిజబెత్ కాలంలో కరపత్ర రచన కొత్త పుంతలు తొక్కింది. అప్పటిదాకా ఎక్కువగా మత సంబంధమైన అంశాలకే పరిమితమయిన ఈ ధోరణి, థామస్ డెక్కర్, థామస్ నాషే, రోబర్ట్ గ్రీనీ మొదలగువారి చలువతో కాల్పనికంగా, స్వీయకథాత్మకంగా, వ్యక్తిగత దూషణలతోబాటు సాహిత్య విమర్శకు కూడా ప్రాధాన్యత నిచ్చాయి. ముఖ్యంగా ఫ్రాన్స్‌లో నైతిక బోధనాత్మక కరపత్రాలతోబాటు మతదూషణా కరపత్రాలు ప్రభుత్వాల కుటిలత్వాన్ని న్యాయస్థానాల - మంత్రుల కుహనా విలువల్నీ విమర్శిస్తూ వచ్చాయి. బ్లేస్‌పాస్కాల్ రాసిన సాహితీ సంబంధమయిన కరపత్రాలు స్పష్టమయిన భావాల్ని ప్రకటించాయి. 17వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో రాజకీయ, మత విషయాలు ప్రధానంగా కరపత్ర రచన సాగింది. ఛాందస పండితులకూ, ఆధునిక అభ్యుదయవాదులకూ జరిగిన వాదవివాదాల్లో కరపత్రం పోషించిన పాత్ర గణించదగ్గది. 1660లో కరపత్రాల్ని గురించిన వ్యాసాలు, చర్చనీయ కథనాలు కూడా పత్రికల్లో ఆసక్తికరంగా అచ్చయ్యేవి. గ్లోరియస్ విప్లవం (1688-89) తర్వాత కరపత్రాల్ని రాజకీయ ప్రచార సాధనాలుగా వాడటం ఎక్కువైంది. జోసెఫ్ అడిసన్, రిచర్డ్ స్టీలీ, మాథ్యూప్రియర్, ఫ్రాన్సిన్ అట్టర్ బ్యూరీ జోనాతన్ స్విట్ట్ మొదలగువారిని పార్టీ రాజకీయాలు కరపత్ర లేఖకులుగా ప్రసిద్ధుల్ని చేయడమే కాక ఎంతోమందికి బతుకు దెరువును అందించాయి.

18వ శతాబ్దంలో కూడా ఇది కొనసాగింది. ఉత్తర అమెరికాలో విప్లవపూర్వ స్థితి కరపత్ర రచనకి ప్రోత్సాహమిచ్చింది. 1776 జనవరిలో థామస్ పెయినే రాసిన 'కామన్ సెన్స్' ప్రపంచాన్ని ఒక్క ఊపు ఊపింది. లోతయిన వైజ్ఞానిక సంచనాలకు వేదికయ్యింది. ఆ తర్వాత 1787లో అమెరికా నూతన రాజ్యాంగ ప్రతిపాదన కొత్త తరహా కరపత్ర రచనకి వేదికయింది. అలెగ్జాండర్ హేమింగ్‌టన్, జాన్ జే, జేమ్స్ మాడిసన్‌లు విప్లవ రాజకీయాలపై కరపత్ర రచన కొనసాగించారు. ఈ 19వ శతాబ్దంలోనే ఫ్రెంచ్ విప్లవానికి వోల్టేర్, రూసో, మాంటెస్క్యూ, డెనిస్‌డైడెరోబ్‌ల కరపత్రాలు ప్రేరణనందించాయి. సామాన్య ప్రజల్ని చైతన్యపరచడంలో కరపత్రాల పాత్ర ఎంత శక్తివంతమయిందో ఫ్రెంచ్ రష్యన్ విప్లవాలే ఉదాహరణ. ఇక 19వ శతాబ్దపు ఇంగ్లాండ్ రాజకీయాల్లో కరపత్రం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఫ్రాన్స్‌లో పాల్‌బాయినష్ కొరియర్ అద్వితీయ కరపత్ర రచన చేసాడు. శాసనామోదాల మీదా, ఐరిష్‌హోమ్ రూల్ విషయంలో, ఆక్స్‌ఫర్డ్ ఉద్యమం సందర్భంగా అనేక అపూర్వమయిన కరపత్రాలొచ్చాయి.

19వ శతాబ్దపు చరమాంకంలో 20వ శతాబ్దపు ప్రథమంలో జార్జ్ బెర్నార్డ్ షా, బెట్రాయిస్ వెబ్, గ్రాహమ్ పాలాస్‌లు రాజకీయ తాత్విక సంబంధ కరపత్రాల్ని రచించారు. 20వ శతాబ్దపు ద్వితీయార్ధం నుంచి ప్రభుత్వాలు, పాలక వర్గాలు, మతమౌఢ్యులు సైతం కరపత్రాల్ని రచిస్తున్నారు. ఇక ప్రైవేటు సంస్థల లాభార్జనలకి కరపత్ర ప్రచారం తప్పనిసరి అయ్యింది. 21 వ శతాబ్దంలో కరపత్రాల రచన మాటెలా ఉన్న ఆదరణ ప్రశ్నార్థక మయ్యింది. అయితే, ఒక విషయాన్ని గురించి విశ్లేషించడానికీ, ఆలోచనాత్మక దృక్పథంతో ప్రజల్లోకి నిజాల్ని తీసుకెళ్ళడానికీ, ప్రచారోద్యమ ప్రసార మాధ్యమంగా కరపత్రం ప్రథమ స్థానంలో నిలుస్తుందని నా వ్యక్తిగత అభిప్రాయం. కరపత్ర చరిత్ర తడిమినా లేక విప్లవాత్మక - వివాదాస్పద కరపత్రాల గురించిన చర్చ మొదలెట్టినా ఒకచోట ఆగదు. నాస్తికత్వ ఆవశ్యకత పేరుతో షెల్లీ మహాకవి రాసిన కరపత్రం ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి అతడ్ని బహిష్కరించడానికి కారణమయింది. అలాగే, మన స్వాతంత్రోద్యమ కాలంలో వెలువడిన కరపత్రాల చరిత్ర తెలుసుకోదగ్గది. లాలా హరిదయాళ్ మొదలుకొని భగత్ సింగ్ దాకా అనేక విధాలుగా కరపత్ర రచన కావించారు. ఫ్రెంచ్, రష్యన్ విప్లవాల్లో కరపత్రాల పాత్ర చెప్పుకోదగ్గది. మహారచయిత మాక్సిమ్ గోర్కీ 'అమ్మ' రచనలోని ప్రదాన కథాంశం విప్లవ రాజకీయ కరపత్రాల కోసమే. ఏది ఏమైనా, ఈనాటికీ కరపత్రం ఒక ప్రదాన ప్రచార సాధనమనేది అంగీకరించాల్సిన సంగతి. అయితే, కరపత్రాల గురించిన ఎంపిక చేసిన సంక్షిప్త చిత్రణ మాత్రమే ఇక్కడ చోటు చేసుకుందనే విషయాన్ని చదువరులు గ్రహించాలి.

- - -

పరిచయ పత్రం

"My strength is the strength of Oppressed
My Courage is the Courage of Desperation"

– Bhagat Singh

అది లాహోర్ సెంట్రల్ జైలు!

సాయం సంధ్యా సమయం!

ఆరోజు 23వ తేదీ మార్చినెల, 1931వ సంవత్సరం!

ఒక ఖైదీ ఖానాలోనున్న వ్యక్తి ఆరోజు ఉదయం ఉండి ఏదో చదువుకుంటున్నాడు. చాలా దీర్ఘంగా, సాలోచనగా దేన్నో అధ్యయనం చేస్తున్నాడు. విచిత్రమేమిటంటే అతను మరికొద్దిసేపట్లో మరణించబోతున్నాడు. అతన్ని ఉరికంబం ఎక్కించడానికి అతని గదికొచ్చిన జైలరుని మరొక్క రెండు నిమిషాల సమయమడిగి, ఆ అధికారి సమాధానం కోసం ఎదురుచూడకుండానే తను చదువుతోన్న పుస్తకం పూర్తి చేసాక తాపీగా బయటకి నడిచాడు. మీకతన్ని పరిచయం చేస్తోంది చావుకు భయపడకుండా అతను అలా బయటకి జైలరుతో నడిచినందుక్కాదు! మరి కొద్ది నిమిషాల్లో చనిపోతాడని తెలిసి కూడా జైలరుని నిలబెట్టి చదువుతున్నది పూర్తి చేసినందుకు!!

అతని పేరు భగత్‌సింగ్. పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ జిల్లా బాంగా తాలుకా ఖట్‌కార్ కలాన్ గ్రామంలో 27-9-1907న పుట్టాడు. 23 సంవత్సరాల వయసులోనే వెనుదీయని విశ్వాసంతో విశ్వాంతరాల్లో విశ్రాంతి తీసుకొంటోన్న వసుధైక వ్యవస్థని స్థాపించడం కోసం కోట్లకొద్ది విధ్వంసమౌతోన్న వీరుల హృదయాలకి చిట్టచివరి వ్యక్తిగా, చిద్రమైన సాక్షిగా చరిత్రలో నిలిచాడు! కాలాతీతమైన కట్టుకథల ఖైదుల్లో కల్తీగా బ్రతుకుతోన్న భావదరిద్రుల బండబారిన గుండెల్లోంచి, బాధాపీడితుల కోసం బడబాగ్నిలా దూసుకొచ్చి దహనమైపోయిన ధర్మయోధుడతను!

అంతులేని ఆర్తనాదాలకి ఆసరాగా నిల్చి ఆశయాల్ని ఆయుధంగా మార్చడం కోసం అక్షరాల ముసుగులో ప్రాసలుగా పేర్చబడ్డ పదునయిన పదాల మందుగుండుతో

వివక్షకి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజల తరుఫున పేలిన మర ఫిరంగతను. నిస్సారమైన నిజాల్లోంచి, నిస్తేజమైన జీవితాల్లోంచి, భావాల భ్రమల్లోంచి, భారమైన అనుభవాల్లోంచి గడిచిపోయింది గతితప్పిన గతమునిగర్జిస్తూ, భవిష్యత్తు బహుజనులదేనని ఘోషిస్తూ నైతికతే నేపధ్యంగా వెలువడ్డ విజృంభణవాదం అతడు! నిరంతర రణనినాదమతడు!!

అసలు కార్యమేలేని క్రమాన్నే క్రతువుగా చూపిస్తూ, జనాన్ని గొర్రెలుగా భావిస్తూ, శతాబ్దాలుగా "సింహాసనం" అనే ఒక "సీమకుక్కాసనాన్ని" సృష్టించుకొని, దాన్ని స్వయంగా అనుభవిస్తూ అభూత కల్పనల అజ్ఞానపు కథల్నే, పరమ పవిత్ర పుణ్యగాధలుగా ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకి అందిస్తూ సాంప్రదాయం పేరుతో వారిని సుకుమారమైన శుంఠల్నిగా తయారుచేస్తోన్న చౌకబారు పరిపాలనకి వ్యతిరేకంగా గళంతోబాటు కలాన్ని కూడా కదిలించాడు! పదాల్ని సైతం పరుగెత్తించాడు!!

"భారత్ నవజవాన్ సభ" అనే యువజనోద్యమ సంస్థను స్వయంగా స్థాపించాడు. ఆ సమయంలోనే "హిందుస్తాన్ జిందాబాద్" అనే ప్రసిద్ధమైన పధబంధాన్ని రూపొందించాడు. ఆ తర్వాత "హిందుస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్" యువజన కార్యవర్గ సమావేశంలో, "తెల్లదొరల స్థానంలో స్వాతంత్ర్యం పేరుతో నల్లదొరలు ప్రవేశించడం వల్ల పేదప్రజల జీవిత విధానంలో ఏ విధమైనటువంటి మార్పూ ఉండదని ఉద్ఘాటిస్తూ, మనం ఇప్పుడు పోరాడవల్సింది బ్రిటీష్ వారిచ్చే నామమాత్రపు స్వాతంత్ర్యం కోసం కాదని, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అసమానతలు లేని సమసమాజం కోసమని ఉపన్యసిస్తూ అలా కాని పక్షంలో భారతదేశానికి స్వాతంత్ర్యమైతే వస్తుంది కానీ అదొక సాంప్రదాయక భ్రష్టుపట్టిన సమాజానికి ప్రతీకగా నిలుస్తుందని" చెప్పాడు.

ఆ సమావేశంలోనే సౌమ్యవాదాన్ని ప్రతిఫలించేలా సంస్థ పేరును "హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్"గా మార్చాడు. ఆ చారిత్రక సందర్భంలోనే "హిందుస్తాన్ జిందాబాద్"ని ప్రపంచ ప్రసిద్ధ విప్లవ నినాదమైన "ఇంక్విలాబ్ జిందాబాద్"గా మార్పు చేసాడు. ఆ తర్వాత అనేక ప్రజా ఉద్యమాలని నిర్దేశించిన ఆ నినాదం దాని కర్తయిన భగత్‌సింగ్‌ని మాత్రం మరుగునపర్చింది. భగత్‌సింగ్‌ని విప్లవకారుడిగా కంటే అనే కరపత్రాల కర్తగా అద్భుతమైన వ్యాసకర్తగా వెనుదీయని పాత్రికేయుడిగా, అన్నింటినీ మించి ఒక అసామాన్య స్వాప్నికుడుగా, అసాధారణ తాత్వికుడిగానే గుర్తించడం సబబు!

డబ్బులెక్కువయ్యో, నా డబ్బా భాషాప్రాస మీ ముందు ప్రదర్శించుకోవడానికో ఇది రాయటం లేదు. ఇది చదివిన ఏ వ్యక్తయినా దశాబ్దాల క్రితం మన కోసం అతనెందుకు మరణించాడో ఈ పత్రం ఆలోచింపజేయగలిగితే ఈ కృషి ఫలించినట్లే భావిస్తాను. నిజానికిది అసలు శ్రమే కాదు. నా పద విన్యాస ప్రదర్శన అంతకన్నా కాదు. ఎప్పుడో ఒకప్పుడు రాకతప్పని "ప్రజా తిరుగుబాటుకి" ఆనాడే అతడేసిన తీక్షణమైన బాటకి ప్రతీకే ఈ పరిచయ పత్రం!

భగత్‌సింగ్ జైల్లో ఉంటుండగానే "నీకు పొగరెక్కువయ్యే దేవుణ్ణి నిరాకరిస్తున్నావన్న" మిత్రుడి మాటలకి జవాబుగా, "నేనెందుకు నాస్తికుణ్ణయ్యాను" (Why I am an Atheist?) అనే అత్యద్భుతమైన వ్యాసమూ. మరొక మిత్రుడు రచించిన "స్వాప్నిక జగత్తు" (Dreamland) అనే కవితా సంపుటికి రాసిన ముందుమాటా యువతకి సందేశం (Message to the youth) అనే వాటిని రచించాడు. మరికొద్ది నిమిషాల్లో మరణిస్తాడనగా కూడా రష్యన్ మహావిప్లవ నిర్మాతయిన లెనిన్ రచించిన "రాజ్యమూ-విప్లవమూ" (State and Revolution) గ్రంధాన్ని చదివి అది పూర్తిచేసేటంత వరకూ మృత్యుదేవతని సైతం తన ముంగిట నిలిపి ఉంచాడు.

అతనొక కొత్త లోకాన్ని కలకన్నాడు, ఆ కల నిజమవ్వాలని కోరుకున్నాడు. అతనొక అసమానతలులేని అందమైన ఉదయం కోసం అడుగడుగునా అంధకారంతో యుద్ధం చేసాడు. అల్పమైన ఆనందాల కోసం, స్వల్పమైన సరదాలకోసం సార్వత్రికత్వాన్ని విస్మరిస్తున్న వృధా జనానికి యదార్థాన్ని ప్రయాసగా ప్రతిపాదించాడు. పోరాటాన్నే పరిపూర్ణ జీవన మార్గంగా చేసుకొని సంకల్పం సడలిపోతూన్న సమాజానికి ఆ శాశ్వత సత్యాన్నే ప్రేరణగా అందించాడు, అలా అందిస్తూనే అస్తమించాడు! అతడాశించిన వ్యవస్థ స్వరూపంతో మన శవ వ్యవస్థని అంచనా వేసుకొన్నప్పుడల్లా అనిపిస్తూ వుంటుంది, మనం అతని త్యాగానికి ద్రోహం చేసామేమోనని!!

విజ్ఞప్తి : ఇందులోని భాషా, పద ప్రయోగాలు శైలి మొదలైనవి ముఖ్యంగా మనలోని "చదువుకున్న నిరక్షరాస్యుల్ని, వృద్ధాప్యంలోనున్న యువతని, మేధావులైన మూర్ఖుల్ని "దృష్టిలో పెట్టుకుని వ్రాయడం జరిగింది. కాబట్టి సామాన్య ప్రజానీకానికి స్వల్పమైన ఇబ్బందులు ఏర్పడ్డాకూడా ఈ విషయంలో ఇతరత్రా వివాదాలకు తావులేదని తెలియజేస్తున్నాం.

చేగువేరా

"ప్రపంచంలో ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా మనం గాఢంగా ప్రతిస్పందించడం చాలా అవసరం; ప్రతి విప్లవకారుడికీ తప్పనిసరిగా ఉండి తీరాల్సిన అద్భుతమైన లక్షణం అదే!" - చేగువేరా (తన పిల్లలకి రాసిన చివరి ఉత్తరంలో)

అది 1967, అక్టోబర్ 9,

ప్రపంచంలో నున్న ప్రతి పెత్తందారీ, పారిశ్రామిక దేశమూ దశాబ్దాల తరువాత ఆ రోజే ప్రశాంతంగా నిద్రపోయింది! ప్రతి బడా పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద రాజ్యమూ సంతోషంతో బహిరంగంగానే పండుగ చేసుకుంది! అతడు అమాన వీయంగా హత్య చేయబడిన సంగతి తెలియగానే ప్రజల్ని పీడించుకుతినే ప్రతి నియంతా తన్నుకొస్తున్న ఆనందాన్ని ఆపుచేసుకోలేక పగలబడి నవ్వుకున్నాడు! అతడింక ఈ భూమిపై బ్రతికి లేడనే సమాచారమే సామాజిక జలగలన్నింటికి కొత్త బలాన్నిచ్చింది!

అతని కోసం చెప్పుకోవాలంటే బలహీనమైన బ్రతుకులకి బలమైన భావాల్నందించిన బలవర్ధక "టానిక్" అని పేర్కోవాలి! బలప్రయోగంతో ప్రజల్ని పీల్చి పిప్పిచేసే ప్రపంచ దోపిడీ మూకల ముఠాని బూటుకాలితో తొక్కి అవతలికి తోసిపారేసిన అసామాన్యుడిగా అభివర్ణించుకోవాలి! ఇంతకీ ఈ వివరాలన్నీ మన వరకే సుమండీ! ఎందుకంటే బహుళజాతి వ్యవస్థలకీ (Global Corporations), బడా పారిశ్రామిక సంస్థలకీ (Multinational Organizations) అతడు చిరపరిచితుడే!

ఆ వ్యక్తిత్వంలో అవిశ్రాంతంగా ప్రజ్వరిల్లిన విప్లవాగ్ని కణాల వేడి ఇప్పటికీ అప్పుడప్పుడూ విజృంభిస్తూ వాటి సుఖనిద్రల్ని పీడకలగా పాడుచేస్తుంటుంది! ఆ వీరత్వంలో అపూర్వంగా పెల్లుబికిన నిరంతర పోరాటతత్వం నేటికి వాటిని నీడలా వేటాడుతూ అతని జ్ఞాపకాలతో వాటి వెన్నుల్లో చలి పుట్టిస్తుంది! ఆ విశ్వాసంలో

అఖండంగా ప్రభవించిన విశ్వవ్యాప్త శ్రమజీవుల విజయావేశపు కరతళ ధ్వనుల ప్రకంపనలు ఈ రోజుకి వాటి కర్ణాంతరాల్లో కంపరం పుట్టిస్తాయి! సర్వకాల సర్వావస్థల సార్వజనీన విప్లవ వీరుల సమిష్టి చిరునామా అతడు – చే గువేరా!

అతని పూర్తిపేరు ఎర్నెస్తో గెవేరా దలాసెర్నా. అర్జెంటీనాలోని రోజారియో పట్టణంలో 1928 జూన్ 14న పుట్టాడు. బాల్యం నుంచే అతి ప్రమాదకరమైన 'ఆస్తమా' వ్యాధి అతన్ని కబళించీ, జీవితాంతం వెంబడించీ, వీలైనంతవరకు వేధించీ, ఆఖరికి అతని ఆత్మ విశ్వాసానికి ఆహుతైపోయింది! ఆ వ్యాధితో బాధపడుతూనే అక్షరాలు నేర్చుకుని హైస్కూలు చదువు కూడా పూర్తిచేసి, వైద్యవిద్యను అభ్యసించాడు! ఆ కాలంలోనే సాంఘిక రేఖాచిత్రాన్ని దగ్గరగా గమనిస్తూ, అసమానతలు నిండిన సమాజంలోని అసలు నిజాలు తెలుసుకోవటం కోసం శక్తివంచన లేకుండా శ్రమించాడు!

1951 డిసెంబర్ 29న మిత్రుడితో కలిసి లాటిన్ అమెరికా దేశాలన్నీ పర్యటిస్తూ మోటర్‌సైకిల్‌తోనే పసిఫిక్ మహాసముద్ర తీరం వరకు సుదీర్ఘమైన యాత్ర చేయాలని యోచించాడు. 1955 జూలైలో ఫిడెల్ కాస్ట్రో ప్రధాన సహచరుడిగా మారి క్యూబా విమోచనోద్యమంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగాడు. లాటిన్ దక్షిణ అమెరికా దేశాలూ, గ్వాటిమలా, అర్జెంటినా, క్యూబా, నికరాగువా, వెనిజులా, బొలీవియా... మొదలైన రాజ్యాల సాంఘికోద్యమాల్లో స్పష్టమైన ముద్రవేసి అనేకమంది విప్లవకారులకి అసాధారణ స్ఫూర్తి ప్రదాతయ్యాడు!

ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తూ ఆకలి బాధలు, అన్నార్తుల వేదనలూ, పేదల రోదనలను స్వయంగా చూసి చలించి పరిపూర్ణ విప్లవకారుడిగా మారాడు. ప్రజల్లో పెరుగుతూన్న ప్రశ్నాత్మక ధోరణుల్ని, ముఖ్యంగా చేగువేరాపై ఆరాధనా భావాల్ని చూసి నియంత్రించలేక పిచ్చెత్తిపోయిన అమెరికా సామ్రాజ్యవాద దేశాలూ వాటి తొత్తులు అతనిపై రకరకాల అభాండాలు వేసాయి; అపఖ్యాతిపాలు చేయడానికి చేతనైన ప్రయత్నాలు చేసాయి; కొన్ని వందలసార్లు అతడు చనిపోయినట్లు వదంతులు పుట్టించి ప్రచారం చేయడమే కాకుండా అతని మరణవార్తను అనేకసార్లు అధికారికంగా కూడా ప్రకటించాయి!

చివరికి బొలీవియాలో యుద్ధఖైదీగా పట్టుకున్న నిరాయుధుడైన చేగువేరాని అత్యంత కిరాతకంగా చంపి, అతని దేహంలోకి తమ పదునైన బయనెట్లని క్రూరంగా

దింపి, అప్పటికే చనిపోయిన చేగువేరా శవంలోకి కూడ తమ శాడిస్టు మనస్తత్వాలు సంతృప్తి చెందేదాక బుల్లెట్లని నింపి పరమ కీచకంగా అతని శరీరంలోంచి తలని – చేతులని వేరుచేసి, వాటిని ముక్కలుచేసి, తన స్వచ్ఛమైన అగ్రరాజ్య అసహ్యపు రొచ్చు అనాగరికతను పచ్చిగా బట్టలిప్పి ప్రపంచమంతా ప్రదర్శించుకుందా పనికిమాలిన దేశం!

మరణానంతరం సైతం ప్రజలకి చేగువేరాపై గల ప్రేమాభిమానాల్ని కూడా సిగ్గులేకుండా సొమ్ము చేసుకొంటోంది! ప్రస్తుతం యువతరం బట్టలమీద – మార్కెట్ బుట్టలమీద, కాలేజీ గోడలమీద – కార్పొరేట్ మేడలమీద, సినిమాల్లోను – బహుమానాల్లోను, గ్లోబెల్ వాచ్‌లమీద – ట్రావెల్ బ్యాగుల మీద, బీడీ చుట్టలమీద – సిగరెట్ పెట్టలమీద, ఖరీదైన కార్లమీద – కండోమ్ ప్యాకెట్‌లమీద కూడా ఆ మహనీయుని ఫోటోని ఫ్యాషన్‌గా పబ్లిసిటీకోసం ప్రదర్శిస్తూ పబ్బం గడుపుకుంటోందా దగాకోరు దేశం!

జగమెరుగని నిజాల్ని జగత్ప్రసిద్ధంగా ప్రకటించడం కోసం నిర్భయంగా నిలబడి నినదించినందుకూ, జనమెరుగని యుగాన్ని జనసంద్రంగా సృష్టించడం కోసం జీవితాంతం అగ్నిగుండంలా రగుల్తూ, రణరంగంతోనే సహజీవనం చేసినందుకు, తనకోసం విస్మరించి తరాలకోసం తపించి తనని తానే మనస్ఫూర్తిగా మనకోసం ఆయుధానికి అంకితం చేసుకొన్నందుకూ, మరో ప్రపంచపు మహావిర్భావ ప్రవాహంలో పెను ఉప్పెనలా మృత్యుదేవతని ముఖాముఖి కౌగిలించుకున్నందుకూ, మన ఆదర్శవాదాలకీ – అభ్యుదయ భావాలకీ నిదర్శనంగా, మన నీచ – నికృష్టపు నిర్లిప్త ఆలోచనా విధానాలకి నిరసనగా మన తరం ఆయనకిచ్చే ఆత్మీయమైన నివాళులే అంతరించబోయే అధ్వాన్న సమాజపు సమాధికీ, అవతరించబోయే సమసమాజపు పునాదికీ, అంతిమంగా మిగిలిపోయే అక్షర సత్యాలేమో! అజేయంగా నిలిచిపోయే శాశ్వత సాక్ష్యాలేమో!!

What light is to the eyes
What air is to the lungs
What love is to the heart
Liberty is to the soul of man.
– Robert Green Ingersoll

మహావిప్లవ విధాత – మానవవాద ప్రదాత

మానవేంద్రనాధరాయ్

జీవించడానికి తింటూ జీర్ణించుకోడానికి తిరుగుతూ పుట్టినందుకేదో పనిచేస్తూ పుట్టించడం కోసం ఇంకొకరితో కలిసి పక్కపై పొర్లుతూ తినడానికి లేక ఆకలితో అల్లాడుతూ కొందరూ, తిన్నదెక్కువయ్యా అజీర్తితో అవస్థపడుతూ కొందరూ బతకడానికి కంచంలోకి లేక కొందరూ భుక్తాయాసంతో మంచం మీంచి దిగలేక మరికొందరూ ఈ దౌర్భాగ్యపు వ్యవస్థని దారుణంగా భరిస్తూ దరిద్రాన్ని సహిస్తూ దిక్కులేక దేవులాడుతూ ప్రతీదినం పాకులాడుతూ అసలు గమ్యమే లేని అడ్డగాడ్దెల్లా గమనమే తెలీని గొడిగేదెల్లా జీవితాన్ని గాడికి ముడేసుకుని గుడ్డిగా ఈడుస్తూ జిడ్డుగా జీవిస్తూ మొద్దుగా గడిపేస్తూ మురికిలో దోమల్లా ముసురుకుంటూ ఈగల్లా ఈదుకుంటూ పురుగుల్లా దొర్లుతూ నల్లుల్లా నలిగి నశించి నికృష్టంగా నాశనమైపోయే హీనమైన నాగరిక నరకకూపాలకి ఆధునికులుగా అచ్చమైన రూపాలం మనం!

మన కథ మనకెప్పుడూ కొత్తకాదు. కాని ఇదొక మనిషి కథ. ఈ ధరిత్రి దేహంపై పడిన గాయాల గాట్లని బాగుచేయడం కోసం తన బతుకంతా ధారపోసి వేకువ వెలుగుల్ని విశ్వానికంతటికీ వెలువరించడం కోసం జీవితాన్నే త్యాగం చేసి నేల తల్లి గుండెల్లో గూడు కట్టుకున్న శవాల గుట్టల్లో నెత్తుటి ముద్దలా మారిపోయి గువ్వలా ఒదిగిపోయి గుట్టుగా మిగిలిపోయి చరిత్రగా చెరిగిపోయిన ఒక చారిత్రాత్మక మహనీయుడి గాయాల గాధే ఇది. అనుభూతులతో బాటు ఆచరణనీ అనుసరించడానికి బదులు అన్వేషించడానికి అధ్యయనానికి తోడు అభ్యాసాలకి అంకితమయ్యి అనుభవాల్నే అక్షరాలుగా మార్చి దిద్దుకున్న ఒక అద్వితీయమైన సత్యాన్వేషి ఆత్మ వ్యధే ఇది!

ఎమ్.ఎన్. రాయ్‌గా ప్రసిద్ధి చెందిన మానవేంద్రనాధరాయ్ అసలు పేరు నరేంద్రనాధ్ భట్టాచార్య. బెంగాల్‌లోని అర్బాలియా గ్రామంలో 1887 మార్చి 21న సాంప్రదాయ పురోహిత బ్రాహ్మణ కుటుంబంలో బాసంతీకుమారి – దీనబంధు

భట్టాచార్య దంపతులకు జన్మించి, బాల్యంలోనే బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ తీవ్రవాదిగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి చాంగ్రిపోటా, డైమండ్ హార్బర్, గార్డెన్‌రీచ్, బెలియాఘాట్, రొడ్డా కంపెనీ దోపిడీ కేసుల్లోనూ హౌరా, లాహోర్, కాన్పూర్ మొదలయిన కుట్ర కేసుల్లోనూ ముఖ్యమైన ముద్దాయిగా మారి భారతదేశ విముక్తి విప్లవం కోసం ఆయుధాలు సేకరించదలచి, అందుకు జర్మనీ సహాయం కోసం జకార్తా ప్రయాణమయ్యా సరిహద్దులు దాటాడు!

అక్కడి నుండి వరుసగా ఇండోనేషియా, చైనా, జపాన్, మలేషియా, సయాం, సమత్రా, జావా, ఫిలిప్పీన్స్, కొరియాల మీదుగా అమెరికా చేరి సోషలిస్టుగా మారి అక్కడ అరెస్టు చేస్తే తప్పించుకుని మెక్సికో చేరి ప్రపంచంలో మొట్టమొదటి రష్యనేతర కమ్యూనిస్టు పార్టీని అక్కడ స్థాపించి, లెనిన్ ఆహ్వానం మేరకు రష్యాలోని మాస్కో నగరంలో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్, కమింటరన్‌లలో ప్రధాన పాత్ర పోషించి ప్రప్రథమ భారతీయ కమ్యూనిస్టు పార్టీని మొదట రష్యాలోనూ అనంతరం తాష్కెంటులోనూ స్థాపించి ఫ్రాన్స్, జర్మనీ, చైనా మొదలైన దేశాల్లోని విప్లవోద్యమాలకి మార్గదర్శకత్వం వహించి ప్రపంచంలోనే తిరుగులేని కమ్యూనిస్టు నేతలయిన లెనిన్, స్టాలిన్, ట్రాటెస్కీ మొదలగువారితో విభేదించి తిరిగి 16 సంవత్సరాల తర్వాత భారతావనికి వచ్చాడు!

భారతదేశంలో ప్రవేశిస్తూనే కమ్యూనిస్టు కుట్ర కేసులో అరెస్టయ్యాడు. విడుదలయ్యాక నేషనల్ కాంగ్రెస్‌లో చేరి అందులో అభ్యుదయవాదులందరితో కలిసి League of Radical Congress Men అనే సంఘాన్ని స్థాపించి, అనంతరం Radical Democratic పార్టీని స్థాపించి, తర్వాత ప్రజాస్వామ్యంలో పార్టీల వ్యవహారాల్ని పూర్తిగా నిరసిస్తూ మానవ అభ్యున్నతి దిశగా అవిరామకృషి చేసి ప్రపంచ మేధావులందరితో కల్సి ఉన్నత తాత్విక సూత్రాలని సైద్ధాంతికంగా క్రోడీకరించి సమృద్ధయిన మానవ సమాజ స్థాపనే లక్ష్యంగా సర్వోత్కృష్టమైన సామరస్య వ్యవస్థ రూపకల్పనే ధ్యేయంగా 1952లో "Radical Humanist International And Ethical Union" మహోద్యమాన్ని మానవాళికి అందించి 1954 జనవరి 25న మరణించాడు!

బటేవియాలో చార్లెస్ అలెన్ మార్టిన్‌గా జపాన్‌లో మిస్టర్‌వైట్‌గా, మెక్సికోలో మాన్యూల్ మెండెజ్‌గా, రష్యాలో గ్రేషియాగా అమెరికాలో రాయ్‌గా ఇండియాలో

డాక్టర్ మహమ్మద్‌గా, బెరర్జీగా ఇంకా అనేక దేశాల్లో అనేక వేషాల్తో అనేక పేర్లతో చలామణి అవుతూ అనుక్షణం రహస్య గూఢచారుల్ని పోలీసుల్ని తప్పించుకుంటూ అనేకసార్లు అరెస్టవుతూ విడుదలవుతూ ప్రపంచంలోని మూడు ముఖ్య ఖండాల రాజకీయ విప్లవ కార్యకలాపాల్లో చురుకుగా పాలుపంచుకుంటూ కూడా చరిత్రలో మరే విప్లవకారుడూ సృష్టించలేనంత కనీసం ఊహించలేనంత రాజకీయ తాత్విక సాహిత్యాన్ని సమకాలీనంగా రచించి మామూలు మానవమాత్రులనే కాకుండా మహా మేధావుల్ని సైతం తన జీవితంతో ఇప్పటికీ విస్మయానికి గురి చేస్తున్నాడు!

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా లభిస్తోన్న పుస్తకాలూ, శతాధిక గ్రంథాలే కాకుండా చైనా విప్లవంలోనూ జర్మనీ హిట్లర్ ఫాసిస్టు దాడుల్లోనూ ఆయన అమూల్యమైన అనేక రచనలు ధ్వంసమైనాయి. అవికాక వివిధ పత్రికలకి రాసిన వ్యాసాలు, ప్రముఖులతో నడిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, విమర్శలూ, తాత్విక విశ్లేషణలూ, కరపత్రాలూ, ఉపన్యాసాలూ, జైల్లో ఉంటుండగా 9 సంపుటాల 9000 పేజీల మహాగ్రంథం The Philosophical consequences of Modern Science" ఇప్పటికీ అముద్రితంగానే ఉన్నాయి. ఇవన్నీ కాకుండా స్వయంగా Vanguard, Advancedguard, The Masses of India, Independent India, The Marxian Way, Radical Humanist మొదలైన పత్రికలు నడిపాడు!

రాయ్ అంటని అంశమూ వదిలిన విషయమూ ఒక్కటైనా లేదు. వెతికినా కానరాదు. ఆయనవి ఆడంబరాక్షరాలు కావు. అవి, సునిశితమైన రక్తాక్షరాలు. సుశిక్షితమైన రణాక్షరాలు. పదాల వేగమే వాటి నాదం. పరిణామ ప్రవాహమే వాటి వాదం. తక్షణ చైతన్యమే వాటికి స్ఫూర్తి. శాశ్వత ప్రయోజనమే వాటికి కీర్తి. విశాల దృక్పథమే వాటి దృష్టి, విచక్షణా విప్లవమే వాటి సృష్టి. అందుకే ఆయన రచనలు పుస్తకాల దొంతర్లు కావు. అవి, అక్షరాల లాంతర్లు, అస్తిత్వపు వెలుతుర్లు, అలుపెరుగని పరవళ్ళు... అంతరాత్మ కన్నీళ్లు. ఆయన అక్షరాల అంతరార్థం అనంతమైన మధనమే. ఆయన పదాల పరమార్థం అపారమైన కథనమే. అవే ఆయన తన ఆశల కోసమూ అభిప్రాయాల కోసమూ ఆశ్రయించిన అవిశ్రాంత కలాలు! అవే ఆయన ఆవేశాన్నీ, ఆక్రోశాల్ని ఆఖరివరకూ అదిలించిన అంతరిక ఆశయబలాలు!! అవే ఆయన తన తదనంతర తరాలకందించిన అజరామర అక్షరజ్వాలల అపురూప విప్లవ ఫలాలు!!!

* * *

ఉరికే ఉత్సాహం – ఉరిమే ఉత్తేజం
ఉద్ధమ్ సింగ్

ఏప్రిల్ 13, 1919వ సంవత్సరం.

భారతదేశపు పంజాబ్ రాష్ట్రం, అమృతసర్ పట్టణం.

శరత్కాలపు వినీలాకాశంలో వెలిగే చుక్కల్లాంటి వేలాది చిరునవ్వుల్ని దయ్యరనే దయ్యం దారుణంగా చిదిమేస్తుంటే, భరతమాత ఆత్మపై అహంకారపు ఆయుధం పెట్టి ఆమె గుండెని తుపాకి గుళ్ళతో జల్లెడపడుతోంటే, ఆ బ్రిటీష్ సామ్రాజ్యపు భ్రష్టుపట్టిన పశుత్వానికి ప్రత్యక్ష సాక్ష్యంగా మిగిలిన ఏకైక ప్రదేశం – జలియన్‌వాలాబాగ్.

ప్రజలు దుఃఖించారు. పెద్దలు ఖండించారు. పత్రికలు అక్షరాల్ని మందంగా అల్లించాయి. పార్టీలు సిద్ధాంతాల్ని అందంగా వల్లించాయి. వాస్తవం వర్తమానమయింది. వర్తమానం వార్తయ్యింది. వార్త జ్ఞాపకంలోకి జారిపోయింది. జ్ఞాపకం గతమయ్యింది. గతం గాడితప్పి చరిత్రయ్యింది. చరిత్ర చేజారిపోయింది.

* * *

జూలై 15, 1940 వ సంవత్సరం

సెంట్రల్ క్రిమినల్ కోర్టు, ఇంగ్లాండ్.

బోనులో సింహంలా గర్జిస్తూ యావత్ న్యాయస్థానాన్ని నడివీధిలో నగ్నంగా నిలబెట్టి కొరడాతో కొట్టినట్లు మాట్లాడుతున్న ఆ ముద్దాయి మాటల తూటాలకి మొద్దుబారిపోతున్న శరీరాన్ని అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేస్తూ గౌరవనీయులైన న్యాయమర్తి "దయచేసి వాటిని ప్రచురించకండంటూ" పత్రికల్ని వేడుకున్నాడు.

బ్రిటీష్ లెఫ్టినెంట్ గవర్నర్ జనరల్ ఆర్.ఇ.హెచ్. డయ్యర్‌ని జలియన్‌వాలా బాగ్ హత్యాకాండకి ప్రతీకారంగా ఘటన జరిగిన రెండు దశాబ్దాల తర్వాత

వెస్ట్‌మానిస్టర్‌లోని కేక్స్‌టన్ హాలు వద్ద కాల్చి చంపిన కార్యశూరుడు - ఉద్దమ్ సింగ్ కేసు విచారణ అది.

* * *

పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లాలో సానమ్ గ్రామంలో డిశంబర్ 28, 1899లో జన్మించిన ఉద్దమ్‌సింగ్ విద్యార్థి దశలోనే విప్లవ పాఠాలు నేర్చుకున్నాడు. విపులంగా పఠించాడు. విస్తృతంగా పర్యటించాడు. 1927లో ఆయుధాల చట్టంలో అరెస్టయ్యాడు. లాలా లజపతిరాయ్, భగత్‌సింగ్, కిషన్‌సింగ్‌లతో కలిసి పనిచేసాడు.

జలియన్‌వాలాబాగ్ దురాగతానికి ప్రధాన కారకుడయిన డయ్యర్‌ని ఆనాడే తన గమ్యం చేసుకున్నాడు. 20 సంవత్సరాల వయసప్పుడు తీసుకున్న నిర్ణయాన్ని 21 సంవత్సరాల కూడా తిరుగులేకుండా అమలు పరిచాడు. తన జీవితంలోని కడపటి కాలాన్ని కరిగించి మన జడత్వపు కలాల్లో కల్లోలపు కలల సిరాగా మలిచాడు.

* * *

ఆ కలల్ని కాలంతో పరిగెత్తిస్తూ కలాన్నే హలంగా చేసి పండించిన అతని పదాల పంటలోని ప్రతివాక్యం వెనుకా ఒక నిర్దిష్టికత నిండిన లక్ష్యముంది. అయితే, వాటిని అందుకునే అదృష్టం మనకి లేదు. అత్యుత్తమ ఆశయాల కోసం పాటుపడే అక్షరాలకి ఆఖరికి మిగిలేవి అంతులేని ఆక్రందనలే కదా!

మానవుడ్ని మహనీయుడిగా మలచడం కోసం తపించే తాత్వికుల అవిశ్రాంతపు ఆశల పయనం త్యాగం దగ్గరకే సాగుతుంది. స్వార్థాన్ని విస్మరించి సంఘాన్నే స్మరించే స్వాప్నికుల నిరంతరాన్వేషణ అమరత్వం దగ్గరే ఆగుతుంది. తనకోసం మరిచి మనకోసమే జ్వలించే జీవితాల చివరి మజిలీ మహాప్రస్థానంతోనే ముగుస్తుంది!

* * *

మృత్యువనే అద్భుతమైన అంతమే లేకపోతే మానవ జీవితం మొత్తం అత్యంత శూన్యంగా, సారరహితంగా ఉంటుంది. మనిషికి చావే సారం. భవిష్యత్ తరాలకి అదే ఆధారం. బాధపడాల్సిందేంటంటే, న్యాయాన్ని నిస్వార్థంగా గెలిపించడం కోసం నిరంతరం శ్రమించే సత్యాన్వేషకుల్నే మృత్యుదేవత ముందుగా వరిస్తుంది. అటువంటి

అసాధారణ ధీరోదాత్తుల్నే ఆమె తన ఆభరణాలుగా ధరిస్తుంది!

మరణంలోని మహోన్నతమైన అద్వితీయతని మనసారా ఆహ్వానించలేని మూర్ఖత్వం మనది. ఆ దివ్యమైన అనుభూతిని మనస్ఫూర్తిగా ఆస్వాదించలేని హీనత్వం మనది. అందుకే జీవితమనే మన మూస పుస్తకంలో దాన్నెప్పుడూ ఆఖరి పుటకే పరిమితం చేసాం. అందుకు విరుద్ధంగా జీవించిన యుగపురుషుల జీవితాల్నయితే పిల్లల పాఠ్యపుస్తకాల్లోంచి కూడా ఎప్పుడో చెరిపేసాం!

* * *

జూలై 31, 1940 వ సంవత్సరం.

భారతదేశం కోసం బలిపీఠమెక్కిన విప్లవవీరుడు భరతమాత ముద్దుబిడ్డ సర్దార్ ఉద్దమ్‌సింగ్‌ని లండన్‌లోని పెంట్రోవిల్లీ జైల్లో ఉరితీయడం జరిగింది. న్యాయస్థానంలో అతడిచ్చిన అంతిమ ఉపన్యాసాన్ని అతడు మరణించిన చాలా కాలానికి బ్రిటీష్ పబ్లిక్ రికార్డ్స్ ప్రధాన కార్యాలయం నుండి విడుదల చేయడం జరిగింది.

* * *

ఏప్రిల్ 13, 2010వ సంవత్సరం

Truth is wandering in secret over the earth seeking a nest for herself among the people. She's like fire and sword for the authorities. They can't accept her-she'll slay them and burn them! For you truth is a good friend; for them she's a bitter enemy. That's why she wanders in secret over the earth!"

Young hearts are always quicker to catch the truth.... Not even an ocean of blood can drown the truth.

– Maxim Gorky
Mother



చారిత్రాత్మక చలనం చలం

చలం పేరుతో ప్రసిద్ధి చెందిన గుడిపాటి వెంకటాచలం 18-5-1894న జన్మించాడు. సాంప్రదాయిక విలువలను చీల్చి చెండాడాడు. మానవుడి స్వతంత్రేచ్ఛనూ స్త్రీ స్వేచ్ఛా పిపాసనూ సమర్థిస్తూ ఉద్యమస్థాయిలో అనేక రచనలు చేసాడు. 4-5-1979న మరణించాడు.

ఆనాడు ఆయన కొట్టిన చెప్పుదెబ్బల్నుంచీ ఆంధ్రదేశం ఇంకా తేరుకోలేదు. ఆ చావు దెబ్బల్నించీ చరిత్రింకా పూర్తిగా కోలుకోలేదు. జయంతి - వర్ధంతులు వరుసగా ఈ మాసంలోనే జరుపుకుంటోన్న సందర్భంగా ఆయన అక్షరాయుధాల్ని కొన్నింటిని ఇక్కడ అందిస్తున్నాం. తట్టుకోగల చేవుంటేనే చదవండి.

- మీ ఇంటి సంగతి యింకొకరికి తెలుసు. వాళ్ళ యింటి సంగతి మీకు తెలుసు. వాళ్ళకి తెలుసునని మీకు తెలుసు. మీకు తెలుసునని వాళ్ళకీ తెలుసు. వొకరిది వొకరు తెలియనట్టుగా నటించాలి. లోపల ఇంకోళ్ళకి తెలియకుండా ఎంత కుళ్ళిపోయినా సరే, పైకి మాత్రం మర్యాదస్తుల వలె కనబడాలి. ఇదే జీవనానికి మూలసూత్రం.
- వేశ్య ప్రతీ రాత్రీ ఒకరి కోసం తయారవుతుంది. భార్య రాత్రీ పగలూ కూడా వొక్కడి కోసమే తయారవుతుంది. ఆ ఒక్క రాత్రికి సంతోషించి వేశ్యకీ డబ్బూ, నగలూ ఇస్తారు. పగటికి, రాత్రికీ, చాకిరికీ కలిపి తిండీ, బట్టా యిస్తారు భార్యకి. వేశ్య దేహం మాత్రమే అమ్ముకుంది. భార్య దేహం, మనసూ, అభిమానం, నీతి, ఆత్మ అన్నీ అమ్ముకుంది.
- స్త్రీ-జీతం లేని సంఘ బానిస. బిడ్డల్ని కని పెంచుకునే తన జన్మహక్కుని అమ్ముకుంది పురుషుడికి తన పొట్టకోసం. స్త్రీని చూస్తే పురుషుడికి ఇష్టమే, కాని ఆమె ఇతరుల భార్య కావాలి. తనకి చిక్కాలి. తన భార్య ఇంట్లోనే ఉండాలి భద్రంగా.

- హృదయానుబంధం వివాహం, తక్కినదంతా ఎంత పవిత్రమైనా వ్యభిచారమే. పురుషుణ్ణి చూసి కలవరపడి, సిగ్గుపడి ఎడంగా పోయే ప్రతీ స్త్రీ హృదయంలోనూ, వ్యభిచారం దాక్కునే వుంది.
- పాకీవాళ్ళని రద్దుచేస్తే వాళ్ల పనిని యంత్రాలన్నా చేయాలి లేకపోతే ఎవరికి వారన్నా చేసుకోవాలి. వేశ్యల పని యంత్రాలు చేయలేవు. కనుక సంసార స్త్రీలే చేస్తారు ఆ పనిని.
- పుట్టుకతోనే ధనంలో పుట్టిన వాళ్ళు కాస్త విశాల హృదయులుగానే వుంటారు. కష్టపడి సంపాదించిన వాళ్ళూ ఫరవాలేదు. కానీ, అకస్మాత్తుగా ఐశ్వర్యం వచ్చిన మనుషులు చాలా వికృతమౌతారు.
- లోకంలో ఏమన్నా కావొచ్చును. దరిద్రుడు, నరహంతకుడు, కుష్టురోగి కావొచ్చును. కానీ మర్యాదస్తుడు కావడమంత హీనత్వం ఇంకేమీ లేదు.

చైతన్యరహితమయిన వ్యవస్థలో సామాజిక సాంగత్యం, శారీరక సంపర్కంతో సమాప్తమవుతుంది. లైంగికచర్య తీర్చుకోవడమే లక్ష్యంగా జనించే వాంఛ, ఆలు మగల మధ్య ఆత్మీయబంధం పెంపొందకుండా అడ్డుకుంటుంది... కృత్రిమ విలువలతో కూడిన సమాజంలో విపరీతమయిన అతిశయోక్తులతో నిండిన మత వ్యవస్థలో మేధోవంతమయిన నైతిక పరిణామాన్ని స్త్రీ అవగతం చేసుకోవడం కష్టసాధ్యం. అలాంటప్పుడే, యువత అనైతిక దిగజారుడుతనాన్ని ఆపడానికి గానూ, అంతకంటే ప్రమాదకరమైన పతనానికి వారిని లోను చేయడం జరుగుతుంది. అలౌకిక స్థాయిలో అవలంభించే శీలరక్షణ పద్ధతులు యువత పెడదారి పట్టడానికి పనికొచ్చినంతగా వార్ని ప్రయోజకుల్ని చేయడానికి పనికి రావడం లేదన్నది వాస్తవం.

- చలం, స్త్రీ-పురుషుడు

ప్రచురణ : Cynic Society
(School for Skeptical Thought Philosophical Nihilism)

సప్దార్ హష్మి

ఏప్రిల్ 12, 1954న ఢిల్లీలో హనీఫ్ హష్మి, కొమర్ ఆజాద్ దంపతులకు జన్మించిన సప్దార్ హష్మి భారత నాటకరంగంపైనే కాకుండా యావత్ ప్రపంచ రంగస్థల చరిత్రలోనే చెరగని ముద్ర వేస్తాడని ఎవరూ ఊహించలేదు. బాల్యంనుంచీ ఆలీఘర్, ఢిల్లీలలో గడిపిన సప్దార్ హష్మి ఢిల్లీలో స్టీఫెన్స్ కాలేజ్‌లోంచి ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రుడయ్యాడు. తరువాత ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఏ., ఇంగ్లీషు పట్టా పొంది భారత విద్యార్ధి ఫెడరేషన్‌లో భాగమవ్వడం ద్వారా అనేక ప్రగతికర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నాడు.

అప్పటికే భారత సామ్యవాద సంఘంలో ప్రధాన భాగమైన (IPTA) ఇండియన్ పీపుల్స్ ధియేటర్ అసోసియేషన్ ద్వారా ప్రేరణ పొంది 1973లో "జన నాట్యమంచ్" అనే అఖిలభారత సామాజిక సాంస్కృతిక వికాస దిశగా కృషిచేసే సంస్థను స్థాపించడంలో సప్దార్ హష్మిది ప్రధాన పాత్ర. విద్యార్ధిగానే విభిన్న సాంఘిక పరిస్థితులను ప్రత్యక్షంగా అనుభవించిన సప్దార్ కళకు స్పష్టమైన ప్రయోజనం, అసలు కళ పరమార్ధం ప్రజానీకాన్ని చైతన్య పరచడమేనని పరిపూర్ణంగా నమ్మాడు. అందుకనుగుణంగానే తన జీవితాన్ని ప్రజాకళకు పణంగా పెట్టాడు.

అభ్యుదయంపేరుతో జరిగే అరకొర కార్యాచరణలు ఎన్నైనా భరించగలరు. గాని మన పాలకులు ప్రజల ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేసే కళలను, ఆ కళాకారుల అస్తిత్వాన్ని తట్టుకోలేదు.

విశ్వవిఖ్యాత రచయిత మేక్సిమ్‌గోర్కి రచనలు మొదలుకొని భారతీయ సంస్కృతి సాంప్రదాయాల్లో ప్రముఖ భాగమైన సాధారణ రైతు కూలీల జీవితాల్లోని ముఖ్య ఘట్టాలను ఆధారం చేసుకొని హష్మి నిర్మించి దర్శకత్వం వహించిన అనేక యదార్ధ నాటకాలలోని ప్రజా అభ్యుదయానికి పాటుపడే విప్లవ తాత్వికతను చూసి వెర్రెత్తిపోయి

బుర్ర చెడిన ప్రభుత్వం అసాంఘిక శక్తులతో కలిసి 1989 జనవరి 1న ఘజియాబాద్ దగ్గర సాహిబాబాద్ మున్సిపల్ ఎన్నికలపై ప్రచారాస్త్రంగా "హల్లాబోల్" అనే వీధి నాటకాన్ని జెహండ్‌పూర్ గ్రామంలో ప్రదర్శిస్తుండగా జననాట్యమంచ్ సభ్యులపై దాడిచేసి సప్దార్ హష్మిని పొట్టనపెట్టుకుంది.

క్రూర మానవ మృగాల దాడిలో సప్దార్‌హష్మి మృతి చెందిన రెండు రోజులకు జనవరి 4వ ఆయన సహధర్మచారిణీ, కళాకారిణి అయిన మోలిశ్రి తిరిగి అదే గ్రామానికి వెళ్ళి తన భర్త హత్య కారణంగా ఆగిపోయిన మిగిలిన సగం నాటకాన్ని పూర్తిచేసుకొని సభ్యులతో తిరిగొచ్చింది! సప్దార్‌హష్మి హత్య జరిగిన 14 సంవత్సరాలకు ఘజియాబాద్ న్యాయస్థానం 10 మంది నిందితులను నేరస్తులుగా గుర్తించింది. అఖిల భారత జాతీయ కాంగ్రెస్‌లోని ముఖ్య నాయకులు కూడా వీరిలో ఉన్నారు. అమరజీవి సప్దార్‌హష్మిపై అభిమానంతో దేశంలో వివిధ ప్రాంతాల్లో కళాసంఘాలు, నాటక సమాజాలు ఆయన పేరుమీద నడుస్తున్నాయి. 1989లో ఆయన రచనల సంపూర్ణ సంకలనం వెలువడింది.

ప్రతీ సంవత్సరం జనవరి 1న సప్దార్‌హష్మి సంస్మరణ దినంగా సప్దార్‌హష్మి మెమోరియల్ ట్రస్ట్ (SAHMAT) జరుపుతోంది.

ఆయన కళాకృషిని మనసారా స్మరిస్తూ...

"దేహాన్ని చంపేవాళ్ళంటే భయపడనక్కర్లేదు, కాని చైతన్యాన్ని చంపేవాళ్లంటే భయపడాలి. వాళ్ళు ఇతరులను చంపినట్లే నన్ను కూడా చంపినప్పటికీ వాళ్ళు నా చైతన్యాన్ని చంపెయ్యలేరు. స్వతంత్రంగా నిలబడాలనే ఈ దేశం సంకల్పాన్ని వాళ్ళు చంపలేరు."

– గుగివాధియోంగో జైలు డైరీ, కెన్యా

అస్తమించని సూర్యుడు అంబేద్కర్

బాబాసాహెబ్ అంబేద్కర్ అద్భుతమైన వ్యక్తిత్వాన్ని అంచనా వేయడమంటే, భారతీయ కుట్రపూరిత కులబీజాల్ని కదిలించి, అమానుష హైందవ మత విలువలని నిరసించి, బ్రాహ్మణీయ భావజాలాన్ని ఎదిరించి, జీవితాంతం అంటరానివారి ఉన్నతికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి అసాధారణంగా శ్రమించి, ఆర్థిక, సాంఘిక తత్త్వవేత్తగా అనేక క్లిష్ట సమస్యలకు పరిష్కార మార్గం చూపించి జీవిత చరమాంకంలోని తుది శ్వాస వరకూ అమానుష కులతత్వాన్ని తుద ముట్టించడం కోసమే కృషి చేసిన అలవికాని తిరుగుబాటుదారుడి అంతరాత్మని సందర్శించడమే.

పైకి, అతి ప్రశాంతంగా కనిపించే అగ్నిపర్వతం లాంటి అరుదయిన వ్యక్తిత్వం అంబేద్కర్‌ది. నిత్య విద్యార్థిగా నిరంతరం జ్వలించే అద్వితీయ వైఖరి ఆయన సొంతం. అందుకే బాల్యం నుండి అడుగడుగునా భయంకరమయిన కులతత్వాన్ని అనుభవించి, దానిని కూకటివేళ్ళతో సహా అంతం చేయడం కోసం నడుం కట్టాడు. మతమనేది ఉన్నంతవరకూ కులమనే వెయ్యి తలల రాకాసిదే రాజ్యమని నమ్మిన అంబేద్కర్ దానిని బలహీనపరిచే మార్గం కోసం తన ఆఖరు నిమిషం వరకూ అన్వేషిస్తూనే గడిపాడు. ఆస్తిక హిందువుగా పుట్టిన అంబేద్కర్ నాస్తిక బౌద్ధుడిగా మరణించడం మతాన్ని ఆయన కొట్టిన చావుదెబ్బ.

నాగరికులమంటూ చంకలు గుద్దుకునే నేటి వ్యవస్థలోనే ఒళ్ళంతా 'మావాళ్లనే కులం చిడుముని ఎక్కించుకున్న ఎందరో భావ బానిసల్ని చూస్తున్న మనకి, అంటరానితనాన్ని పాటించని వారిని అంటరానివాళ్ళుగా చూసిన ఆనాటి సమాజంలో కులమనే మేరు పర్వతాన్ని ఒంటరిగా ఢీకొన్న అంబేద్కర్ తెగువ ఆశ్చర్యం కలిగించక మానదు. ఆధునికతకు ప్రతినిధులమంటూ అప్రకటితంగానో, అప్రయత్నంగానో సిగ్గులేకుండా డబ్బా వాయించుకుంటూ అంతర్గతంగానే అంటరానితనానికి ఆసరాగా అండనిచ్చేవారూ, కొత్త కొత్త దారులతో కుయుక్తులు పన్నుతూ కులానికి కాపలాగా కొమ్ముకాసేవారూ రోజురోజుకీ పెరుగుతున్నారు.

ముందు జీవితంలో ఉన్నతంగా స్థిరపడి తర్వాత స్థిమితంగా సమాజం గురించి ఆలోచిందామనుకునేవారు, తాము సరిదిద్దగల సమస్యలు సంఘంలో లేవని సంతృప్తి చెంది సంపాదనే లక్ష్యంగా జీవిస్తున్నవారు, అసలు సమాజంలోని సమస్యలకి మూలం అర్థం కాక ఆ భారాన్ని భగవంతుడి మీదేసి బాధ్యత దులిపేసుకునే బడుద్దాయిలు, సమాజాన్ని తాము మర్చిపోలేదన్న విషయం జనానికి నొక్కి చెప్పడం కోసం తోచినప్పుడల్లా తోక తెగిన కోతుల్లా అవినీతి – అక్రమాలపై అంతెత్తు గొంతు చించుకునే చిద్విలాసపరులు, ఇలాటి ఇరుకు భావాలకతీతంగా అంతరాన్ని జయించే ఆశాజన సిద్ధాంతాన్ని సార్వత్రిక సౌభృతత్వం కోసం సృష్టించిన విశ్వనరుడు, ప్రపంచ పౌరుడు అంబేద్కర్.

ఆయన ఆకాంక్షించిన ఆదర్శ సంఘానితో మన దౌర్భాగ్య వ్యవస్థని చూసే సాహసం, కులం కుళ్ళూ, మతం మత్తులో జోగుతున్న మనం చేయకపోవడమే ఉత్తమం.

In every country the intellectual class is the most influential class. This is the class which can forsee, advise and lead. In no country does the mass of the people live the life for intelligent thought and action. It is largely imitative and follows the intellectual class. There is no exaggeration in saying that the entire destination of the country depends upon its intellectual class. If the intellectual class is honest and independent, it can be trusted to take the initiative and give a proper lead when a crisis arises. It is true that the intellect by itself is no virtue. It is only a means and the use of a means depends upon the ends which an intellectual person perseue. An intellectual man can be a good man but he may easily be a rogue. Similarly, an intellectual class may be a band of high-soulded persons; ready to help, ready to emanicipate erring humanity or it may easily be a gang of crooks or a body of advocates of narrow clique from which it draws it support.

– B.R. Ambedkar

రాజీపడని ఒక యోధుడి కథ

ఇదో కథ. ఇదమిద్దంగా చెప్పాలంటే ఓ వీరుడి సామాజిక వధ. ఇంచుమించు ఇరవైఏళ్ళు కూడా దాటని యువకుడి విప్లవ గాధ. విశేషమేమిటంటే అతడి జీవితానికి ఆరంభం అంతంతోనే ప్రారంభమైంది. మనిషిగా అతని మజిలీ, ముగింపు దగ్గరే మొదలైంది. మొదలనేది ఎవరైనా పెట్టొచ్చు, ముగింపు మాత్రం కొందరే ఇవ్వాలి. మనకి పుట్టడం తెలుసు. పోతామని తెలుసు. కాని పోరాటం మాత్రం తెలీదు. తెలుసుకునే తెగింపు కూడా లేదు. అయినా తెగింపు తెలుసుకుంటే వచ్చేది కాదు. తెగిస్తే తెలిసేది. అలా తెగించిన ధీరుడి త్యాగ చరితే ఇది.

కథలన్నీ సాధారణంగా కంచికే వెళతాయంటారు. కాని మన కథ మొదలు తెలుసుకోవాలంటే, కలకత్తా దగ్గర మిడ్నాపూర్ వెళ్ళాలి. పశ్చిమ బెంగాల్‌లోని మిడ్నాపూర్ మండల గ్రామమైన హబీబ్‌పూర్ త్రిలోక్యనాధ్‌భసు, లక్ష్మిప్రియాదేవి దంపతులు నివసించేవారు. వారికి ముగ్గురు కుమార్తెలు, రెండుసార్లు మగశిశువులు పుట్టి మరణిస్తే మూడోసారి గర్భం దాల్చిన లక్ష్మిప్రియాదేవి కలలో కాళికాదేవి కనిపించి ఈసారి పుట్టబోయేవాడు అల్పాయుష్కుడైనా చరిత్రలో అజరామరుడౌతాడని చెప్పిందట. కలలు మన భ్రమలకీ, కథలు మన కల్పితాలకి ప్రతీకలే అయినా నిజానికి జరిగిందదే.

అలా జన్మించిన కారణజన్ముడే ఖుదీరామ్ బోస్. 1889లో పుట్టిన బోస్ ఆరేళ్ళలోపే తల్లిదండ్రులని పోగొట్టుకున్నాడు. బోస్‌కి అపురూప, సరోజిని, నానిబాల అనే ముగ్గురు అక్క చెల్లెళ్లు. పెద్దక్క అత్తగారి ఊరైన హాట్‌గచియా గ్రామంలో అక్షరాలు దిద్దటం ఆరంభించిన ఖుదీరామ్, 1901లో తమ్లుక్‌లోని హెమిల్టన్ స్కూలులో తరువాత మిడ్నాపూర్ కొలిజియేట్ స్కూల్‌లో చదివాడు. జీవిత విషాదాలతో పాటు సాంఘిక విప్లవోద్యమ కార్యక్రమాలలో కూడా అనుభవం సంపాదించాడు. 1905లో బెంగాల్ విభజన, స్వదేశి ఉద్యమాలు ఖుదీర్వామ్‌పై తీవ్ర ప్రభావం చూపాయి.

ముఖ్యంగా ఆ కాలంలో బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా వందేమాతరం, యుగాంతర్, సంధ్య, నవశక్తి, కల్ మొదలైన పత్రికలు వస్తూండేవి. జాతీయోద్యమంలోని అతివాద – మితవాదులిద్దరిపై కూడా బంకించంద్ర రాసిన ఆనంద్‌మఠ్, ఆరంబింద్ ఘోష్ భవాని మందిర్, అవి కాక వర్తమాన్ రాజనీతి, ముక్తికోన్‌పాథే, మొదలగు దేశీయ రచనలతోపాటుగా ఇటలీ విప్లవకారులు మాజిని, గారిబాల్డీల ప్రభావం తీవ్రంగా ఉండేది. ఫ్రెంచ్ విప్లవం గురించిన చర్చలు ఆసక్తిగా జరుగుతుండేవి. అటువంటి ప్రమాదకర వాతావరణంలో 1906లో నిషేధిత సాహిత్యం జనాలకు చేరవేస్తూ రాజద్రోహం కేసులో బోస్ అరెస్టయ్యాడు.

ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పటికే స్వాతంత్రోద్యమకారుల్ని అణిచివేయడం కోసం ప్రభుత్వం కింగ్స్‌ఫోర్డ్ అనే రాక్షసుడిని నియమించింది. యుగాంతర్ విప్లవ సంస్థ ఆ నియంతని చంపడం కోసం ప్రఫుల్లచక్కి అనే పేరొందిన వీరుడ్ని నియమించింది. అతడికి సహచరుడిగా వెళ్ళిన వాడే మన ఖుదీరామ్ బోస్. ఏప్రిల్ 30, 1908న ముజఫర్‌పూర్‌లో కింగ్స్‌ఫోర్డ్ ఉన్నాడని భావించిన బండిపై మొట్టమొదటి బాంబు వేసాడు బోస్. అయితే అందులో దురదృష్టవశాత్తూ కెన్నడీ అనే ఆయన భార్య, కూతురు ఉన్నారు. ఆ అమాయక ఆడవాళ్ళు మరణించారు.

స్వాతంద్రోద్యమ చరిత్రలో చెరగని ముద్రవేసిన భగత్‌సింగ్ – చంద్రశేఖర్ ఆజాద్‌ల జీవితాలకి, ఖుదీరామ్ బోస్ – ప్రఫుల్ల చక్కి జీవితాలకి సామ్యముంది. ఖుదీరామ్, భగత్‌సింగ్ లిరువురూ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని హడలెత్తించి చిరునవ్వుతో ఉరికంబమెక్కితే, ఆజాద్ – ప్రఫుల్ల చక్కిలిద్దరూ ఆంగ్లేయుల చేతికి చిక్కడాన్ని అసహ్యించుకుని తమంతట తామే ఆత్మహత్య చేసుకున్నారు. మే 1, 1908న ప్రఫుల్లచక్కి కాల్చుకుని మరణించి బెంగాల్ చరిత్రలో మొట్టమొదటి అమరుడిగా నిలిస్తే తన దాడి ఇద్దరాడవాళ్ళ చావుకి కారణమైనందుకు బాధపడుతూనే ఆగష్టు 11, 1903న ఖుదీరామ్ బోస్ దేశ చరిత్రలోనే మొట్టమొదటి యువయోధుడిగా ఉరికొయ్యని అలంకరించాడు.

ఉబుసుపోలు రాతల్ని, ఊకదంపుడు గీతల్ని చదవడానికి అలవాటుపడిన మన కళ్ళకి అక్షరాలన్నీ పచ్చగానే కనిపిస్తాయి. కాబట్టి అంతులేని అనుమానాలకి కాసేపు అడ్డుకట్ట వేసి మన కోసం మరణించిన ఆ అమరుడి అంతరాత్మని అర్ధం చేసుకోగలమేమో ప్రయత్నించుదాం.

ఆ యోధుడి త్యాగాన్ని ఆత్మీయంగా హర్షిస్తూ...

* * *

మతం – రాజ్యం – మనిషి

When in the course of human development, existing institutions prove inadequate to the needs of man, When they serve merely to enslave, rob, and oppress mankind, the people have the eternal right to rebel against, and overthrow, these institutions.

– Emma Goldman

మానవ అభివృద్ధి క్రమంలో భాగంగా, అతడు స్థాపించుకున్న సమాజాలు అతడి అస్తిత్వానికి అసమానంగా వున్నప్పుడు, అతడి అవసరాల్ని తీర్చేందుకు అవి అక్కరకు రానప్పుడు, అతడ్ని దోచుకుంటూ, బానిసను చేస్తూ, మానవాళిని అణిచివేతకు గురిచేస్తున్నప్పుడు, ఆ వ్యవస్థల్ని వూడబెరికే విప్లవాన్ని సృజించే శాశ్వత హక్కుని సాంఘిక జనశ్రేణులు ఎల్లప్పుడూ కలిగి వుంటాయి. – ఎమ్మా గోల్డ్‌మెన్

జీవితం నిరంతర జిజ్ఞాస. అధ్యయనం ఏ ఉద్యమానికయినా మూలం. అన్వేషణ ఆ పునాదికి ప్రాణం. ఆచరణ అసలు సూత్రం. అనుభవం అచ్చమయిన పారం, అనుకరణ దాని అంతం. అలాంటి వ్యవస్థ వున్నతిని స్వాగతించే సార్వజనీన సిద్ధాంతాలు సమాజంలో ప్రస్ఫుటించినప్పుడు, మార్పుకి తోడ్పడే నిజాన్ని జనబాహుళ్యం పూర్తిగా జీర్ణించుకున్నప్పుడు, నిర్దిష్టమయిన ప్రతీ నైతిక వాదానికి నూతన శకం ప్రారంభమౌతుంది. అదే విప్లవం.

విప్లవమంటే వివేక ప్రస్థానానికి నాంది. భావ ప్రస్థానం భావ విస్తరణకి వూతమిస్తుంది. భావ విస్తరణ భావ వికాసానికి కారణమౌతుంది. భావ వికాసం నుంచే భావ ప్రసారం మొదలవుతుంది. ప్రసరించే భావాల్ని ప్రవచించ ప్రయత్నిస్తే ప్రతిపాదనవుతుంది. నిపుణత జోడిస్తే ప్రయోగమౌతుంది. పరిస్థితులకి ఆపాదిస్తే సమాజ అభ్యుదయమౌతుంది. ప్రవర్తనలోకి చొప్పిస్తే తిరుగుబాటవుతుంది. వ్యక్తి తిరుగుబాటుకి సమిష్టితత్వాన్ని సంధానిస్తే ఉద్యమమౌతుంది. ప్రజా ఉద్యమాలు సంఘటితమైతే సంఘం సామరస్యంగా ప్రవర్ధిల్లుతుంది. అదే ప్రగతి.

ప్రగతంటే మానుష గతి క్రమమే. అలాకాక అమానుష స్థితి మార్గాన్ని ఆశ్రయించిన ఆటవిక ఆలోచనల నడక మానవ పరిణామ ప్రవాహంలో నట్టనడుమనే కుంటుపడి కూర్చుంది. వికార వాదాలతో, విచ్ఛిన్న లక్ష్యాలతో వినాశనమే ధ్యేయంగా

సాగిన వాటి తుచ్ఛమైన గమనంలో మనిషికి దిశానిర్దేశం చేసే అభ్యుదయ మార్గాలకంటే కూడా అతడ్ని అమానుషత్వానికి అక్కునచేర్చే అక్రమ దారులు రెండేర్పడ్డాయి. అందులో మొదటిది మతం. తదుపరిది రాజ్యం.

మనిషి సామూహికంగా అవలంభించేందుకు ఏర్పరుచుకున్న అలౌకిక ఆలోచనా మార్గమే మతం. మనిషి సాంఘికంగా ఆచరించేందుకు నిర్మించుకున్న లౌకిక ఆచరణా సౌధమే రాజ్యం. ఇవి రెండూ మనిషి బౌద్ధిక, భౌతిక నిర్ణయాల్ని నైతికంగా నిర్దేశించేందుకు కల్పించుకున్నవే కాని అతడ్ని నియంత్రించేందుకు నిర్మించుకున్నవి కాదు. నైతిక క్రమబద్ధీకరణంటే అర్ధం నియంతృత్వాన్ని అమలుజరపడం కాదు.

మతం తనకి తానే సత్యమనుకుంటుంది. కాబట్టి తక్కిన తంతంతా అసత్యంగానే దానికి తోస్తుంది. రాజ్యం దానికదే శాశ్వతమని చొక్కా చించుకుంటుంది. అందుకే మిగిలిన సాంఘిక సరంజామా అంతా అశాశ్వతమేనని అది భావిస్తుంది. అందుకే, అనాలోచన పునాదిగా అవతరించిన మతం అమానవత్వానికి అందమైన పదం. అమానవత్వం అసమానత్వానికి ఆందరిక అనుకూల సూత్రం. అసమానత్వం ప్రభుత్వావిర్భావానికి ప్రాధమిక పైత్యం.

మతం దేవుడి పేరుతో జనాల్ని పిచ్చివాళ్ళను చేస్తుంటే, రాజ్యం ప్రజాస్వామ్యం పేరుతో ప్రజల్ని పీల్చిపిప్పి చేస్తోంది. మనుషుల్ని మతిహీనులుగా పరిగణించే ప్రమాణానికి మతమూ, రాజ్యమూ రెండూ దొందూ దొందే. ప్రభుత్వం మరో మతమయితే, మతం పరోక్షంగా మరో ప్రభుత్వం. ఈ రెండింటి అంతిమ లక్ష్యం వీలయినంత అధికంగా ప్రజానీకాల్ని అజ్ఞానాంధకారాల్లో మగ్గబెట్టి తమ పబ్బం గడుపుకోవడం.

అనాదిగా మతమౌడ్యంచేతా, రాజ్యమూర్ఖులచేతా అవిశ్వాసులు, అరాజకవాదులు హింసోన్మాదులుగా ప్రచారం చేయబడుతున్నారు. మత–రాజ్యాల దృష్టిలో వాటిని కాదనేదేదయినా అక్రమం కిందే లెక్క. అందుకే ఎంతోమంది సత్యశోధకుల్ని, శాస్త్రసాధకుల్ని అన్యాయంగా బలితీసుకున్నాయి. అయినా వాటి యావ తీరలేదు. ఈనాటి వైజ్ఞానిక నవీన మానవుడ్ని సైతం తమ జానాబెత్తెడు జంగిలి తర్కంతో దబాయించ చూస్తున్నాయి.

అందుకే వాటికంటూ ఏనాడూ లేని ధైర్యాన్ని కొత్తగా కూర్చుకో యత్నిస్తూ అవిశ్వాసులయిన నాస్తికుల ముందూ, అరాజకవాదులయిన ప్రజాస్వామ్యుల ముందూ

మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి మత రాజ్యాలు. ఈ ఇరుగణాలూ అభూత కల్పనల్తో ఆవేశంగా పేలగలవే తప్ప మనిషి భౌతిక సమస్యలకి సరయిన ప్రత్యామ్నాయాల్ని ప్రతిపాదించలేవు. మతం భావ బానిసత్వాన్ని మానసికంగా మెరుగుపర్చే సాధనమయితే, ప్రభుత్వం ఐహిక అలక్ష్యాన్ని అధికం చేసే ప్రేరకం.

మానవ జీవన సారం తత్వం. అదే సత్యం. అది నిరంతర శాస్త్ర విజ్ఞాన సాయంతో సత్యాన్వేషణ కావిస్తూ ముందుకు సాగిపోయేదే కానీ, స్థితిని సమీక్షించుకుంటూ, పరిస్థితిని సంరక్షించుకుంటూ ఉన్న క్రమానికి రాజీపడి తలవొంచి పాచిమాటలు పలికేది కాదు. ఆ చెత్త కార్యాన్ని మానవాళి సిగ్గుపడే స్థాయిలో మతోన్మాదం, అధికారోన్మాదం అవిరామంగా ఈనాడు అమలు చేస్తున్నాయి.

మానవుడి వివేచన అతడి అంతర్గత అభీష్ట వ్యవస్థ స్వరూపాన్ని వుద్బుద్ధం చేస్తుంది. ప్రస్తుత స్థితిని అతడి స్వాప్నికగతికి చేర్చడానికి విజ్ఞాన శాస్త్రం సహకరిస్తుంది. ఈ క్రమంలో మనం చేసే ప్రయత్నాల ప్రభావం భావితరాలపై తిరోగమన దిశగా ప్రతిబింబించకుండా జాగ్రత్తపడడమే సాంఘిక జాగృతికారుల చైతన్యవిధికి ప్రధాన సూత్రం.

మతం మరణించడం కోసమే జీవించమని మనకి బోధిస్తే, రాజ్యం జీవించడం కోసమే మరణించమంటుంది. అంటే ఒకటి చావడం కోసమే బతకమంటే, మరోటి బతకడం కోసం చావక తప్పదంటుంది. మొత్తానికి రెండూ మనుషుల్ని మృతదేహాలుగా మలచడంలో ముఖ్యపాత్ర వహిస్తున్నాయి. జనాల్ని శవాలుగా సాకడంలో మత రాజ్యాల ఘనత ప్రస్తావించదగ్గదే. అందుకే మత రాజ్యాలు మానవాళికి గల మొట్టమొదటి శత్రు సముదాయం. వీటికి విరుద్ధంగా వుద్యమించడం ప్రతీవ్యక్తి ప్రధమ బాధ్యత.

Yes, we must fight, struggle, be ready for defeats and disappointments, but once we have consciously set our feet on the right road, with a clear vision of the task ahead, nothing can daunt us and all causes for pessimism disappear. – M.N. Roy

అవును మనం పోరాడదాం. యుద్ధం చేద్దాం. అపజయాలకీ, ఆశాభంగాలకీ సిద్ధంగా వుందాం. కానీ, మనం ఒక్కసారి సచేతనంగా సరయిన పధంలో ఎప్పుడయితే స్పష్టమైన దృష్టితో కాలిడుతామో, ఇక ఏ రకమయిన బెదిరింపులూ మనల్ని ఆపలేవు. అప్పుడు, నైరాశ్యానికి దారితీసే అన్ని కారణాలూ అప్రయత్నంగానే అదృశ్యమవుతాయి. – ఎమ్.ఎన్. రాయ్

స్వచ్ఛం'ధ' సేవా పూనకం!

ప్ర : ***స్వచ్ఛంద సేవ మంచిదేగా, అందులో తప్పేముంది?***

స : నేను చెబుతోంది స్వచ్ఛ(అ)ం'ధ' సేవా ఉన్మాదం గురించి. ఎబ్బెట్టు కానంత వరకూ ఎందులోనూ తప్పులేదు. పరిధి దాటితేనే సేవా పూనకం పిచ్చిగా మారుతుంది.

ప్ర : ***సేవపైనే నిందలా! స్పందించే గుణం చెడ్డదా?***

స : నిజాలే కాని నిందలు కావు. ఎందుకంటే కులగజ్జి నొదుల్చుకోలేని కుక్కలూ మతమూర్ఖ నుంచింకా తేరుకోని నక్కలూ మాత్రమే దొంగ సేవా దండకంలో దండుగ పాత్రలు.

ప్ర : ***ఎలాగో ఉదాహరణ ఇవ్వగలరా?***

స : అన్నదానం అంటూ బద్ధకస్తులకి భోజనాలు పెట్టడం, అడపాదడపా పుట్టినరోజు పేరుతోనో, పోయినవారి పేరు చెప్పో వృద్ధరోగులకీ, జబ్బు మనుషులకి ఫోటోలకోసం పళ్ళూ, రొట్టెలూ పంచడం...

ప్ర : ***ఇందులో స్వార్థమేముంటుంది?***

స : ఈ ఆషాడబూతుల సేవా భాగోతమంతా బడుద్దాయి భగవంతుడిపై భయంతోనో, చచ్చిన తర్వాత స్వర్గంలో పడుపు సుఖం కోసం పుణ్యం సీటు రిజర్వు చేసుకోడానికో మాత్రమే.

ప్ర : ***ఉద్దేశమేదయినా ఉపకారమే కదా?***

స : అమాయకత్వం అయినంతలో అజ్ఞానం ఆమోదయోగ్యం కాదు కదా!

ప్ర : ***అంటే అర్థం ఏంటి?***

స : వ్యవస్థపై కనీస పరిజ్ఞానం లేని ప్రతీ కోన్కిస్కా సంస్థా స్వచ్ఛందంగానే తన డొక్కు సేవ మొదలెడుతుంది.

ప్ర : ***పోనీ అలాగయినా చేస్తున్నారుగా?***

స : వీళ్ళ సోడాబుడ్డి సిద్ధాంతాల డాంబికం చూసి ప్రజలూ, ప్రధానంగా యువత సంఘంలో మార్పుకి సేవే పరమావధనుకుంటున్నారు.

ప్ర : **సేవ వలన మార్పు రాదంటారా?**

స : ఏంటొచ్చేది వీళ్ళ తలకాయ. ఆధునిక సమాజం ఆవిర్భవించిన నాటి నుండి సాగుతోంది ఈ గొట్టం సేవ. మరింకా రాలేదేం మార్పు?

ప్ర : **ఇంతకీ ఇప్పుడేం చేయమంటారు?**

స : ఇప్పుటికిప్పుడే ఏదో చేసేద్దామని ఊగద్దంటాను. ముందు సమాజాన్ని అధ్యయనం చేయమంటాను.

ప్ర : **అందువల్ల ప్రజలకేం ఒరుగుతుంది?**

స : ఏది ఒరిగిందో ఏది లేదో ముందు తెలుస్తుంది. అధ్యయనం ఆలోచనకి స్పష్టతనిస్తుంది. ఆలోచన ఆచరణకి స్ఫూర్తినందిస్తుంది.

మతాల మౌడ్యం - బాబాల జాడ్యం

దేవుడనే దురద మతమనే బురదకి కారణమయింది. భగవంతుడనే భావన మానవుడి అజ్ఞానంలోంచి జనించిన అభిప్రాయం. మతమనే మురికి మానవుడు సామూహికంగా సమాజంలో సంక్రమింప జేసుకున్న రోగం. మనం సృష్టించుకున్న మానవాతీత వ్యర్థ దేవుళ్ళు చాలక మనలాగే పుట్టిన బడుద్దాయిల్ని కూడా వ్యక్తి దేవుళ్ళంటూ దేవులాడే దేభ్యపు స్థితి దాపురించింది. జూకాలు పెంచుకుని పాపాలు చేసే జుట్టుపోలిగాళ్ళందరూ భగవత్స్వరూపుల అవతారాలెత్తి అమ్యామ్యాలు దండుకుంటూనే వున్నారు. హైందవ మత జిడ్డుని జనాలకి అంటించాలని కొంతమంది తొందరపడుతోంటే, స్వస్థత సభలతో స్వర్గం సాధిస్తామనీ, తైలాభిషేకాలతో రోగాలు తగ్గిస్తామని క్రైస్తవ తాపాల బాబాలు పవిత్రతైలంతో తహతహలాడుతున్నారు. మానవులందరికీ అల్లాయే దిక్కనీ అతడ్ని ధిక్కరిస్తే తల పగిలిపోవడం ఖాయమనీ, నాస్తికులకి నరకప్రవేశం తధ్యమంటూ అన్ని మతాల్లాగే గబ్బుని వల్లించే ముస్లిమ్ శాపాల సైతాను బాబాలు పబ్బం గడుపుకుంటున్నారు. అనాలోచన విజ్ఞానానికి, ఆలోచన అజ్ఞానానికి బద్ధ శత్రువులు. అందుకే ఈ బొంగు బాబాల దొంగ భక్తి, కొంగ జపం చూసి చొంగ కార్చుకోకుండా కాస్త శాస్త్రీయంగా ఆలోచిద్దాం. సమాజంలో మతాల మౌఢ్యాన్ని, బాబాల జాఢ్యాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రయత్నిద్దాం.

వ్యక్తిత్వం - అరాజకత్వం

Brutality is the progress of revolution. When it is over we realize that the humanity has been treated very badly. But it has moved forward. – Victor Hugo

వైప్లవ ప్రగతికి క్రూరత్వమొహ ప్రమాణం. అలాంటప్పుడు మానవత్వం మంటగల్సిందంటాం. కానీ, నిజానికి మానుషత్వమెప్పుడూ ముందుకే సాగుతుంది
– విక్టర్ హ్యూగో

మనిషిలోని చిత్తతృష్ణే అతడి తాత్విక చైతన్యాన్ని వుద్భుద్ధం చేస్తుంది. చైతన్య సారం గమనం. చేతన భావం పయనం. వ్యక్తి దాన్ని గుర్తించి గ్రహణతో తన స్వీయ అస్తిత్వాన్ని సమాజ అంతర్వాహినితో అనుసంధానించ ప్రయత్నించడమే వ్యక్తిత్వం. వ్యక్తిత్వం గతిని గుర్తెరిగిన గ్రాహ్య భావనే కానీ స్థితిని వ్యక్తపరచే సాధనం కాదు. సంఘంలోని ఇతర వ్యక్తులకి దూరమయ్యి వ్యక్తి నిర్మించుకోజూసే ఏకత్వాలు లేదా ఏకాకితత్వాలు వ్యక్తిత్వాలు కావు. వ్యక్తిత్వ విధాన సూత్రం సమిష్టి శ్రేయస్సుని కాంక్షించడమే. ఎప్పటికప్పుడు భావదారిద్ర్యాన్ని పారద్రోల పూనుకోవడమే. సంఘంలో మనవరకూ అయ్యే ఆంతరిక, ఆచరణాత్మక అభివృద్ధిని ఆశాజనకంగా అమలుచేయ యత్నించడాన్నే "ప్రగతి" అంటాం. అది అధ్యయనం ద్వారానే సాధ్యమవుతుంది తప్ప అన్యకార్యాల వల్ల కాదు.

మంచనేది ప్రజలకి చేరకుండా వుండడం కోసం అనాదిగా పాలకులు, పూజారులు, ప్రగతి కాముకులపై పింజారీ ప్రచారాలు చేస్తూనే వున్నారు. మతాన్ని నిరాకరించినవార్ని మూర్ఖులనీ, పరలోకాన్ని ప్రశ్నించినవార్ని పాషండులనీ, దేవుడ్ని ధిక్కరించినవార్ని చార్వాకులనీ, సత్యాన్వేషణ కావిస్తున్నవార్ని నాస్తికులనీ నానా రకాల అపవాదుల్ని పుట్టించి వారి ఆంతరిక ధూర్తత్వాన్ని ప్రదర్శించుకున్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకూ జనాన్ని జడ్డివాళ్ళుగా చేయాలనే ప్రామాణిక సూత్రాధారంగానే ప్రతి మతమూ, ప్రభుత్వమూ తమ అస్తిత్వాలకి అశుద్ధమైన లక్ష్యాల్ని ఏర్పర్చుకున్నాయి. చార్వాకలోకాయతాల్ని పిడివాదాలంటూ దూషించినా, జైన, బౌద్దాల్ని సుఖ వాదాలంటూ ధ్వంసం చేసినా, అవన్నీ వీటి నికృష్టపు కుట్రలో భాగమే కానీ వేరు కాదు.

ప్రాపంచిక ప్రశ్నలకి జవాబు చెప్పలేని మతరాజ్యాలు తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికీ, ఇహలోకపు సమస్యల్ని సవరించలేని మతరాజ్యాలు తమ సోమరితనాన్ని క్రమబద్ధీకరించుకోవడానికీ, అత్యంత క్రూరంగా ప్రవర్తించాయి. మానుష యత్నాలపై రక్తపుటేరులు పారించాయి. ప్రపంచ చరిత్ర పుటలపై నెత్తుటి చారలు సృష్టించాయి. పురోగమన దిశగా దారితీసిన ప్రతిమార్గాన్ని పాశవికంగా కాలరాసాయి. ప్రజానీకాన్ని ఎల్లకాలం అజ్ఞానంలో మగ్గపెట్టాలన్నదే మత, ప్రభుత్వాల ప్రధాన విధి. అందుకు విరుద్ధంగా జనించిన ప్రతీ వృద్ధిదాయక ప్రజా సంక్షేమ సిద్ధాంతాన్నీ కూకటివేళ్ళతో సహా పెకలించి సమాధి చేయడం కోసం ఇవి రెండూ ఎల్లప్పుడూ ఎదురుచూస్తుంటాయి.

జీవితమంతా నిశీధికే అంకితమయ్యే మతప్రభుత్వాలు అభివృద్ధిని కాంక్షించే వార్ని అరాజకవాదులంటూ ఆ పదాన్ని, దాన్ని అర్థాన్ని తప్పుగా వుపయోగిస్తూ ఉత్త పుణ్యానికే అరాజకవాదుల్ని ముద్దాయిల్ని చేస్తున్నాయి. 1928 మే, సెప్టెంబర్ నెలల మధ్యలో భగత్‌సింగ్ "కీర్తి" అనే పంజాబీ పత్రికలో అరాజకత్వం గురించిన వ్యాసాలు ధారావాహికంగా ప్రచురించాడు. అందులో ఒక చోట "The People are scared of the word Anarchism. The word Anarchism has been misused so much that even in India, revolutionaries has been called Anarchists to make them unpopular" అంటూ అరాజకత్వమనే పదాన్ని అడ్డదిడ్డంగా వుపయోగించడం కోసం పాలకులు పడే తాపత్రయాన్ని తెలిపాడు.

అరాజకత్వమంటే రాజరికం లేకపోవడం. ప్రజలపై చెలాయించే ప్రతి పెత్తనాన్ని నిరసించడం. ప్రభుత్వ లేదా ప్రభువుల పాలనని వ్యతిరేకించడం. ప్రజాపాలనని స్థాపించడం. పరిపాలనలోని ప్రతి పాశ్వంలోనూ పారదర్శకతతో కూడిన పద్ధతుల్ని ప్రతిపాదిస్తూ అందుకోసం నిర్ద్వందంగా కృషి చేయడమే అరాజకత్వం. అంతేకాని పత్రికలూ, ప్రసారమాధ్యమాలు సిగ్గులేకుండా ప్రకటిస్తున్నట్లు అరాజకత్వమేమీ హింసోన్మాదాన్ని ఒంటబట్టించుకున్నది కాదు. సమాజాన్ని బురిడీ కొట్టించడం కోసం మతాలు, ప్రభుత్వాలు ఎన్ని రంగులు మార్చి మనుషుల్ని ఏమార్చాలని చూసినా ఏదోనాడు వీటి అసలు రంగు బయటికి రాక మానదు. వ్యక్తుల్ని నిరోధించడం కోసం ఇవి వ్యవస్థలో ఎన్ని కొక్కివేషాలు వెకిలిగా వేసినా ఏదోప్పుడు వీటి అసలు సిసలు వికారాలు వెలువరించక తప్పదు.

ఆర్జించిన జ్ఞానాన్ని అందించేందుకు అక్షరమొక సాధనం. లిఖించబడిన అక్షరాలు మానుష గమనాన్ని ఎంత త్వరితంగా ఏ రీతిన వున్నతీకరిస్తాయనే అంశంమీదే అక్షరకర్త అస్తిత్వం పరిగణించవీలవుతుంది కానీ అతడు రాసిన మహాగ్రంధాల మోతని తూకంతో తూచో, ఒకడు కూర్చిన కావ్య ప్రబంధాల ఊకని వృధా ఊతంతో ఎంచో రచయితని అంచనా వేయరాదు. అక్షరాలకి కొలమానం నిర్దేశించడం అమాయకత్వం. విజ్ఞానానికి వాదాల్ని అంటగట్టడం మూర్ఖత్వం. మార్పుని ఆహ్వానించడమొక్కటే మానుషత్వం. అలాంటి మానవ తత్వాన్ని క్రమబద్ధం చేసే అక్షరాల్ని సృజించడమే సామాజిక రచయితల విధి. వ్యవస్థని విప్లవీకరించే మానవాళికి అక్షరాలే మహోన్నత నిధి.

"The Most violent element in Society is ignorance"

– Emma Goldman

అజ్ఞానం వ్యవస్థలో అన్నిటికంటే ప్రమాదకర అంశం – ఎమ్మా గోల్డ్‌మెన్

"But experiance testifies and philosophy demonstrates, contrary to that prejudice, that any revolution, to be effective, must be spontaneous and emanate, not from the heads of the authorities but from the bowels of the people : that government is reactionary rather than revolutionary : that it could not have any expertise in revolutions, given that society, to which that sacread if alone revealed, does not show itself through legislative decree but rather through the spontaneity of its manifestations : that, ultimately, the only connection between government and labour is that labour, in organising itself, has the abrogation of government as its mission."

– Proudhan

మాలాధారణ దీక్షలా?
మానసిక బానిసత్వ పరీక్షలా?

మనిషి తన తలని మతానికి తాకట్టు పెట్టిననాటి నుంచీ వడ్డీ వసూలు చేసేందుకు ఏర్పడిందే మతాధిపతుల ముఠా. ఆనాటి నుండి అనేక రూపాల్లో మతానికి బలవుతూనే వున్నాడు మానవుడు. అలాంటి బలిదాన విధానాల్ని బలపర్చే ఒక ప్రధానమైన మార్గమే మాలాధారణ దీక్షలు. జరుగుబాటు వున్నా, లేకున్నా ప్రతీ వత్సరం క్రమం తప్పకుండా ఏదో ఒరుగుతుందనే నమ్మకంతో, అలా నమ్మాలని నటిస్తూ ప్రజల్ని మభ్యపెట్టేందుకు దీక్షలు వేసే నటులు, నాయకులు కూడా పెరిగారు. మహమ్మదీయులు రోజా మాసంలో ఉపవాసదీక్షలు వుంటారు. క్రైస్తవులు డిసెంబర్ నెలని పవిత్రంగా భావిస్తారు. కానీ హైందవంలో ముప్ఫైమూడు కోట్లమంది దేవతలున్నారు. ఎవర్ని పూజిస్తే ఎవరికి కోపమొస్తుందో చెప్పడం కష్టం. కాబట్టి భక్తులు ఒక్కొక్క దేవుని పేరుతో అభిమాన దీక్షలు అమలు చేస్తుంటారు. భవిష్యత్తులో దేవునికొక దీక్ష పుట్టుకొచ్చినా ఆశ్చర్యపడవల్సిన పనిలేదు.

నైతిక నిబద్ధతకల వ్యక్తికి ప్రత్యేకంగా భక్తి అవసరంలేదు. పొద్దున్నే లేస్తూ చెడ్డపనులు మాత్రమే చేసే దుర్మార్గులకి మాత్రమే మానసికంగా ఏదో తెలీని వికారం మొదలయి ఎదుగుతుంది. సంవత్సరం మొత్తంలో చేసిన పాపాలన్నింటికీ కలిపి స్వర్గంలో స్థానం కోసం పుణ్యం సంపాదించుకోవాలని ఆక్రోశపడే అరకొర ఆధ్యాత్మిక పారాయణులు మాత్రమే నరకంలో లెక్కల్ని సవరించి దీక్షల ద్వారా శిక్ష తగ్గించుకుందుకు తప్పటడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం ఈ మాలాధారణ దీక్షలు అనేక అపభ్రంశ ప్రేరణలకి తావిస్తూ పైత్యపు పోకళ్ళకి దారి తీస్తున్నాయి. వ్యక్తిగతంగా శరీరాన్ని కష్టపెట్టడానికి మాత్రమే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్న ఈ మాలాధారణ దీక్షలు లౌకిక క్రమశిక్షణకీ, మానసిక పరిపక్వతకి ఎంతవరకూ ఉపకరిస్తున్నాయనే అంశంపై మిత్రులు దృష్టిపెడితే మంచిది. దున్నపోతు ఈనిందంటే దూడని కట్టేయమన్న చందాన ఎవరో ఒక స్థితిపరుడైన భక్తుడు మొదలెట్టగానే అందరూ అదే దారి పట్టడం ఎంత వరకూ సబబో ఆలోచించండి.

"జీవితంలో అన్నిటికంటే ఎక్కువ దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, ఒక్కసారి కూడా సర్వశక్తులూ ఒడ్డి పోరాడకపోవడం. ఒక్కసారి కూడా నలుగురి ముందూ నిటారుగా, సగర్వంగా నిలబడి మాట్లాడలేకపోవడమన్నారు" ఆర్నాల్డ్ బెన్నెట్. ఇంత భారీఎత్తున వ్యాపారంగా సాగుతోన్న ఈ మాలాధారణ దీక్షల వల్ల బాగుపడే వర్గాలేవయినా వుంటే అవి పాలకవర్గం, పూజారీవర్గం, వ్యాపార వర్గాలు మాత్రమే. శరీరాన్ని కష్టపెట్టడమే ముక్తికి ముఖ్య సాధనమనుకుంటే సమాజంలో నూటికి తొంబయి శాతమున్న దిగువ, మధ్యతరగతి కష్టజీవులకి అసలు ప్రత్యేకంగా మతం అవసరమే లేదు. ఇక ఇతర సమస్యల విషయానికొస్తే మన జీవితాల్లో ఎదురయ్యే సమస్యలకి పరిష్కారాలు కూడా మన జీవితాల్లోనే ఉంటాయి. సమాజంలోని ఇతర ప్రజా సంబంధ సమస్యల్నుంచి జనం దృష్టి మళ్ళించడానికే ఈ రకమయిన మత జాగరణలు, మాలాధారణ దీక్షలు వుపయోగపడ్డాయి.

మెలకువ రానంతవరకూ నిద్రపోతున్నామనే సంగతి మనకి తట్టదు. అలాగే చైతన్యం రానంతవరకూ మోసపోతున్నామనే నిజం మనకి పట్టదు. వ్యక్తిగత విశ్వాసానికి ఆర్భాటంతోనూ, అనవసర ఆడంబరాల్తోనూ పనిలేదు. వ్యవస్థలో మిగిలిన విషయాలన్నింటినీ విస్మరించి వ్యక్తిగతంగా మనమేదో మాల లేక దీక్ష వేసినంతలో మనకీ, ప్రజలకీ ఏదో ఒరుగుతుందనుకోవడం వొట్టి భ్రమ. ఆలూ లేదు, చూలూ లేదు కొడుకు పేరు సోమలింగమని సామెత. అలాగే అసలు మన స్థితి, సంఘం పరిస్థితి ఆలోచించకుండా మాలాధారణ దీక్షలే అన్నింటికీ మందనుకోవడం మన అమాయకత్వం. దేవుని పేరుతో నెలలకి నెలలు అర్ధంకాని దీక్షలు వేస్తూ కాలయాపన చేసే భక్తులు వ్యవస్థలోని అసమానతల్ని అధ్యయనం చేసేందుకు నాలుగు రోజులు నిష్టగా దీక్షచేసి కష్టపడినా, సమాజంలోని సమస్యలకి చరమగీతం పాడేందుకు రోజుకొక అరగంట ఆచరణాత్మకంగా దీక్ష వేసినా, అవి కొత్త తరాలకి స్ఫూర్తినిచ్చే నూతన ప్రస్తానానికి నాంది పలుకుతాయేమో ఆలోచించండి, మారడానికి ప్రయత్నించండి.

* * *

మాలాధారణ మిత్రులారా...!

మీ జీవితాల్లో ఏనాడయినా పక్కవాడి బాధల గురించి పట్టించుకున్నారా? పోనీ అందరి బతుకుల్లో అసలు కష్టాలెందుకున్నాయో ఆలోచించారా? మిమ్మల్ని కని పెంచిన అమ్మనో, నాన్ననో తలుస్తూ తల్లిదీక్షో, తండ్రి మాలో వేద్దామనుకున్నారా? పోనీ మనకోసం మరణించిన వీరుల త్యాగాల్ని స్మరిస్తూ అల్లూరి సీతారామరాజు దీక్షో, అజేయుడు భగత్‌సింగ్ మాలో ధరిద్దామనుకున్నారా? లేదా ఒక నెల్లాళ్ళపాటు విద్యాదీక్ష చేపట్టి విజ్ఞానానికి అధ్యయనం ద్వారా పదునుపెట్ట ప్రయత్నించారా? ఒక నాల్గురోజులు చైతన్య దీక్ష చేపట్టి వ్యవస్థలోని సమస్యల్ని ప్రత్యక్షంగా తెలుసుకొనే ప్రయత్నం చేసారా? సమాజంలోని అసమానతల్ని అంతమొందించేందుకు మీ వంతుగా సమసమాజ దీక్ష వేయగలరా? సంఘానికి పట్టిన అసాంఘిక శక్తులని తరిమేందుకు మీ బాటగా నవ సమాజ దీక్ష చేయగలరా? పోనీ ఏ పర్యటన మాలో వేసి సాధ్యమైనన్ని కొత్త ప్రదేశాల్ని సందర్శించి పరిస్థితులు తెలుసుకొనే ఆసక్తి వుందా? లేక పర్యవేక్షణ దీక్ష ధరించి ప్రభుత్వ పథకాలు ప్రజలకి ఏ మేరకు అందుతున్నాయో తెలుసుకోగలరా? విద్యావిధానమనే దీక్ష నిష్టగా చేపట్టి జరుగుబాటు కాని పేద పిల్లలకి చదువు చెప్పించే బాధ్యత తీసుకోగలరా? కులాంతర వివాహమనే దీక్షకి సిద్ధపడి కట్నానికి అమ్ముడుపోకుండా వుండగలరా? మతాంతర మాల వేసుకొని బానిసల్లా కాక మనుషుల్లా మసలగలరా? పోనీ ఆశయదీక్షచేసి వున్నత కార్యాచరణకి ముందడుగు వేయగలరా? కనీసం ఆచరణ దీక్ష వేసి దుందుడుకు చర్యలకి తావులేని నిర్ణయాల్ని అమలుచేయగలరా? అలాకాక తోచిన ప్రతీ పిచ్చదేవుడి పేరుతో పైత్యపు దీక్షలన్నీ చేస్తూ రంగురంగుల బట్టలు, రింగురింగుల దండలు, మొహం కనపడకుండా నామాలు, మోతాదు మించిన మోటు వేషాలు.... ఇవన్నీ పగటివేషగాళ్ళ పనులే తప్ప భక్తి మాలాధారణకి వుదాహరణలు కావు. ఇప్పటికయినా ఏది భక్తో ఏది పిచ్చో ఆలోచించి ఆచరించాల్సినదిగా మనవి.

* * *

మందుబాబులూ జిందాబాద్!

జీవితం జీడిపాకం టీవి సీరియల్లా జిడ్డుగా నిరంతరం సాగిపోతోంది. అస్తిత్వమంతా ఎందుకనే ప్రశ్నే లేకుండా భారంగా గడిచిపోతోంది. పుట్టడానికి, గిట్టడానికి మధ్య ఎంత కూడబెట్టామనేదే ప్రధానమవుతోంది. రావడానికి, పోవడానికి మధ్య రోజుకెన్నిసార్లు చావడానికి సిద్ధమయ్యామనేదే మన సిద్ధాంతమవుతోంది. బానిసత్వానికి స్వాగతం పలికే ఉదయాల్ని, వర్తమాన వ్యవస్థతో వ్యభిచరించే హృదయాలతో రోజూ కౌగిలించుకొంటున్నాం. సారమంతా ఏదొక సంస్థకు అర్పించి ఉద్యోగం పేరుతో ఊడిగం చేస్తూ, సత్తువంతా ఏదొక శరీరానికి అందించి సంసారం పేరుతో సాగిలపడుతూ నిమిషానికి ఎన్నిసార్లు మరణిస్తున్నామనే నిజాన్ని మరిచిపోవడంకోసం నిత్యం మద్యాన్ని ఆశ్రయిస్తున్నాం. మనకు బతకడం కొత్తగాని బతుకీడ్చడం కాదు. అందుకే రోజూ వేలమంది మత్తుబారిన పడి చిత్తైపోతున్నా, అందినంత అరువు సరుకును కరువుదీరా కుమ్మరించుకొని అర్ధాంతరంగా ఎంతోమంది తనువు చాలిస్తున్నా మనకు చీమ కుట్టినట్లు కూడా లేదు.

మంచికి, చెడుకి కూడా మద్యం తాగి తృప్తిపడే దత్తికి మనం అలవాటుపడి చాలా కాలమైంది. కుదిరినంత ఎరువు మందుని కడుపునిండా నింపుకోవాలనే కుళ్ళు కక్కుర్తి మనల్ని సీసాల స్థాయి నుంచి పీపాల స్థాయికి తీసుకెళుతోంది. పండుగ పబ్బాలకి పదులకొద్దీ సీసాలను ఖాళీ చేస్తూ, సందర్భమేదైనా డబ్బిచ్చి చావును కొనుక్కోవడమే ఆనందమార్గంగా, అసలు పరమార్ధంగా ఈ మందు కొట్టడమనేది భావించబడుతోంది. సంవత్సరానికి ఒకసారేనంటూ తాము మద్యం ముట్టకుంటే కొత్త సంవత్సరం రాదేమోననే బెంగతో అప్రయత్నంగానే మందుకు అలవాటుపడేవాళ్ళు, అప్పుడప్పుడు అందరితో కలిసినపుడేనంటూ అలవాటును గ్రహపాటుగా మార్చుకొందుకు తొందరపడుతున్న వాళ్ళూ, సమయం రావాలే గాని మందుకోసం ముందునుంచి చొంగ కార్చుకుంటూ కొంగల్లా దొంగజపం చేసేవాళ్ళు .... అందరూ ఎవరికి తోచిన భాష్యం వాళ్ళు చెప్పుకుంటూ మందు తాగడంలోనే మహదానందముందనుకుంటూ మత్తులో ములిగితేలుతున్నారు.

పీకలదాకా తాగి తడబడుతూ వాగి ప్రపంచాన్నే జయించి నిలబడినంత సంతోషం పొందేవారు, అర్ధరాత్రి వళ్ళంతా తూలుతుంటే ఒంటరిగా పెళ్ళాం పక్కలో

వాలి ముద్దుగా తలపెట్టుకు పడుకొని తాగుబోతు ప్రేలాపన కావించేవారు, మిత్రులతో కలిసి రంజుగా ఒలికినంతవరకు గొంతులో వంచుకొని కారాన్ని నంజుకుంటూ ఫోన్‌లో ప్రియురాలితో గోముగా ముద్దముద్ద వ్యర్థపు మాటలతో మూలుగుతూ మొనగాళ్ళుగా ఫోజులు కొట్టేవాళ్ళు లోకంలోని కష్టాలన్నీ వాళ్ళకోసమే దేబిరిస్తూ వెంటపడుతున్నట్లు భ్రమచెంది ఆ వ్యధతో కడదాకా కాయాన్ని మద్యానికి తాకట్టు పెట్టే తత్వదిమ్మరులూ కూడా మొదట్లో నూతనత్వంకోసమే బూటకపు మద్యాన్ని అందుకొని చివరవరకు నూతిలోని కప్పల్లా కాలాన్ని గడుపుతున్నవాళ్ళే. నలుగురితో నలగందే నవీనత్వం రాదనుకోవడం మన మూర్ఖత్వం. అందరితోపాటు మందుకొట్టందే ఆధునికత అబ్బదనుకోవడం మన అమాయకత్వం. నాగరికత పేరుతో నురగలు కక్కే ప్రతీ విషాన్ని తెలివితక్కువగా తాగడానికి చూడడం మన మానసిక పైశాచికత్వానికి పరాకాష్ట.

బతకడానికి సంపాదించుకుంటున్న వర్గమొకటి, సంపాదించడానికి మాత్రమే బతుకుతున్న వర్గం వేరొకటి కలిసి కాపురం చేస్తున్న కృత్రిమ వ్యవస్థ మనది. సంసారాన్ని పోషించే స్తోమత లేక కొందరు, సంపాదన ఖర్చుచేసే సమయం లేక మరికొందరు సతమతమవుతున్న సాంఘిక అవస్థ ఇది. ఊహల్లో మేడలు కడుతూ, రాబందు రాజకీయ నాయకుల మాటలకు "ఊ" కొడుతూ ఈనాటికీ గుడ్డి దీపాలతో గుడిసెల్లో గడుపుతున్నవాళ్ళు కొంతమందయితే, మేడపక్కన మేడ కడుతూ ఆ మేడల్ని కూడళ్ళుగా మార్చాలని ప్రయత్నిస్తూ ప్రకాశవంతమైన ప్రపంచానికి మాత్రమే పరిమితమైన పందికొక్కులు ఇంకొంతమంది. పదిరోజులకొకసారైనా కూడులోకి కూరకోసం కాయం చచ్చుపడేలా కష్టపడుతున్న గరీబులొకవైపు, పూటకో పదిరకాల పదార్థాలు కానరానిదే కంచంలో చేయిపెట్టని, కార్లోనుంచి కార్పెట్ మినహా నేలమీద అసలు కాలేపెట్టని అమీరుల్ని మరోవైపు చూస్తూ మీరు మత్తువైపో, మనిషివైపో ఒక్కసారి ప్రశ్నించుకోండి. మీ జీవితం మందుకోసమో, మార్పుకోసమో తేల్చుకోండి.

* * *

ఆర్థికత - ఆధునికత - అనాగరికత

జీన్స్, టీ షర్టులూ వేసినంతలో హఠాత్తుగా నాగరికత ఒంటబట్టి అది జీవించడమైపోదు. సూటూ, బూటేసి టై కట్టినంతలో అకస్మాత్తుగా మన అనాగరికత అంతమైపోదు. బట్టలు మన బాహ్య శరీరాన్ని కప్పుకోవడానికే కాని భౌతిక వికారాలు ప్రదర్శించుకోడానికి కాదు. సినిమాల్లో సగం మెదడు నటుల్ని, సమాజంలో రాజకీయ విటుల్ని చూసి పూటకో కొత్త బట్ట కడితేనే జీవితం సార్థకమవుతుందని తొందరపడే మధ్యతరగతి మెదళ్ళకు ఇప్పటికైనా మార్పునేది పరిచయమైతే మంచిది!

పైత్యం పరిమితి మించితే పిచ్చికి దారితీస్తుంది. సంఘానికి బంగారం గురించిన బెంగ అలాగే పట్టుకుంది. పుట్టిన బిడ్డకి బలవంతంగా పెట్టడంతో ప్రారంభమయ్యే ఈ పసిడి పిచ్చి పెద్దయ్యేకొద్దీ వారి మెదళ్ళని తినేసే ప్రమాదకర రోగ కారక క్రిమి అవుతోంది. బలిసిన దున్నపోతుకి బంగారంతో అలంకరించడంవల్ల ఎంత ఫలితముంటుందో, ఉన్నతంగా ఉన్నామనటానికి చిహ్నంగా మనం ముస్తాబైనా అంతే ఫలితముంటుంది. ఊరపందికి దాంతో రంగరించినా, ఊర్లో మందికి ప్రదర్శించుకోవడంకోసం మనం సింగారించుకున్నా ఒరిగేదేంలేదు!

మనిషి అస్తిత్వాన్ని అంచనా వేసే ప్రతీ అంశంలోనూ ఆర్థికతే అతి ముఖ్యమైనదిగా ఉంటూ, ఒక వ్యక్తిస్థాయిని, హోదాని పసిడిని బట్టే పరిగణనలోనికి తీసుకొని వ్యవస్థలో అతడి స్థానాన్ని క్రమబద్ధీకరించేంతగా ఈ బంగారపు దురద ప్రజల్లో ఉందంటే, అందుకు బాల్యం నుండి వారిపైన పడిన ప్రభావమే ప్రధాన కారణం. ఈ దేశంలో శతాబ్దాలుగా పసిడిగోపురాలకి, పవిత్ర శిలువలకి, పాలరాతి దర్గాలకి పూజలు జరుగుతూనే ఉన్నాయి. అయినా ఏ దేవుడూ జనాల గోడు విన్న పాపాన పోలేదు!

మనింటి ఆడపిల్ల పెద్ద మనిషయితే సిగ్గు లేకుండా మా అమ్మాయి ఎదకు వచ్చిందంటూ ఊరంతా టమకేసుకొని హడావిడి చేస్తూ సంబరాలు చేసుకోవడానికి, కలిసి జీవించడానికి ఇద్దరు ఆడా, మగా సిద్ధమయితే హద్దుల్లేకుండా పెళ్ళిపేరుతో, కార్యంపేరుతో పిచ్చిమోజులన్నిటినీ మొక్కుబడిగా తీర్చుకోవడానికి, మొదట్నుంచి చివర వరకు మంచొచ్చినా, చెడ్డొచ్చినా ఇష్టమొచ్చిన తతంగాలు చేసి మతపెద్దలైన పంతులునో, పాస్టర్‌నో, ముల్లానో మేపడానికి మాత్రమే మన ఆర్థికస్థితి, ఆధునిక గతి పనికొచ్చాయిగాని మరెందుకూ కాదు!

ఈ దేశ విద్యార్థుల సంవత్సరాల చదువు విదేశీ సంస్థల చంక నాకడానికి, ఈ దేశ యువజనుల దశాబ్దాల దీక్ష కార్పొరేట్ కంపెనీల కాళ్ళు నొక్కడానికి, ఈ దేశ మేధావుల తరతరాల శ్రమ దోపిడీ జలగలకు దొంగదారి చూపడానికి మాత్రమే పనికొస్తోంది తప్ప ప్రపంచ పేదరికాన్ని తగ్గించేందుకు మాత్రం కలిసి రావడంలేదు. కళ్ళు తిరిగేలా, కాళ్ళు అరిగేలా కష్టపడి కూడబెట్టి కడకు కదల్లేకా, కాయాన్ని కాటికి పంపేందుకు ఎదురుచూసే చివరి దశలో అంతరాత్మ ప్రశ్నించేవరకు మన జీవితాలకు అర్థం తెలిసి చావడం లేదు!

మరుగుదొడ్లలోని మలమూత్ర మురుగుగుంటలు కూడా బంగారంతోనే చేయించుకుంటున్న మృగాలు ఒకపక్కా అసలు మరుగుదొడ్డి మొహమే చూడకుండా ఒకటికి వెళ్ళాల్సి వచ్చినా, రెంటికి పోవాల్సి వచ్చినా ఈనాటికీ చెంబెట్టుకెళ్ళే వేల గ్రామాల మనుషులు మరోపక్కా మనకు దర్శనమిస్తారు. బాత్రూం బేసిన్లకు కూడా బంగారం వాడే బేకారుగాళ్ళనూ, అసలు బాత్రూములే లేని బికారుల్ని చూస్తూ, చిద్రమౌతున్న బతుకుల్ని పట్టించుకోకుండా, మానసిక అలజడికి మంగళం పాడి మనం మాత్రం కుదిరినంత సుఖంగా సమాజంలో జీవించాలనుకోవడం శవాలవుతున్న జనాల సమాధుల్ని చూస్తూ కూడా స్మశానంలో సంక్రాంతి జరుపుకోవాలనుకోవడం లాంటిది!

మన జీవితాలతో సంబంధం లేకుండానే మన జీవితాన్ని నిర్దేశించే గుదిబండ నిర్ణయాలు తీసుకోబడుతున్నాయి. మన అభిప్రాయలతో అవసరం లేకుండానే మన అంతరాత్మలు అంగట్లో అమ్మకాలకి అనుసంధానించబడుతున్నాయి. దొరికినంత కూడబెట్టి మౌనంగా నిష్క్రమించడమే మర్యాదస్తుడి ముఖ్య లక్షణంగా చూస్తోందీలోకం. చుట్టూ ఉన్న సమస్యల్ని విస్మరించి మనం సంపాదించామనుకుంటున్న స్థాయి జీవితాంత దాస్యానికి దాసోహమయ్యేదే తప్పా తక్కిన జనాల్ని కూడా ఉన్నత స్థితికి చేర్చడానికి దోహదపడేది కాదు!

కుదిరినంత అందంగా, సాధ్యమైనంత శుభ్రంగా, వీలైనంత నూతనంగా కనిపించాలనుకోవడం తప్పుకాదు. అయితే ఆధునికత పేరుతో పట్టినన్ని బరువైన బట్టల్ని, ఒదిగినన్ని విలువైన నగల్ని ధరించడం మన మానసిక దరిద్రానికి దర్పణం. బట్టల ఖరీదు భావాలకు ఔన్నత్యాన్ని చేకూర్చదు. బంగారపు బరువు బుర్రకేమి బుద్ధిని జతచేయదు. ఆదిమ కాలంలో మనిషి తాను వేటాడి చంపిన ప్రాణుల ప్రేవుల్ని, ఎముకల్ని అలంకరించుకొనేవాడు. ఆనాటి అనాగరికత చిహ్నాలే ఈనాటి మన సింగారాలు!

అందరికి ఉపయోగపడని ఆధునికత శుద్ధ వృధా. నలుగురికి పనికిరాని నాగరికత ఉత్త చెత్త, మనమెన్ని కాసుల బంగారంతో బీరువాలు నింపుకున్నా, ఎన్ని కోట్ల నోట్ల కట్టలతో బుర్రలు బాదుకున్నా, మిలమిలా మెరిసిపోయే వస్తువులతో, మెరుపువేగంతో దూసుకుపోయే మోటారు వాహనాలతో మన రోగాల్ని ప్రదర్శించుకున్నా అవన్నీ అనుక్షణం విధ్వంసమవుతున్న ప్రజల సంస్కృతీ, సంప్రదాయాల్ని ప్రతిబింబించేవే కాని మన కుక్కతోక బతుకుల గొప్పతనాన్ని వ్యక్తపరచేవి కావు!

జీవితం సగం చచ్చిపోవడానికి మిగిలింది నిద్రపోవడానికి సరిపోతోంది. ఆర్జించడం అలవాటుగా మారి సంసారిక జ్ఞానం సంపాదన వెనుకే పడుతోంది. సుమారు అరవై ఏళ్ళ మన జీవితంలో అర దశాబ్దం అందరికోసం కేటాయించగలిగితే, కలిసొస్తే సంవత్సరంలో మూడొందల అరవై రోజులూ సరుకులుగా అమ్ముడుపోయేందుకు సిద్ధపడే మనం అరగంట సమయాన్నైనా సమాజంకోసం ఆలోచించేందుకు వినియోగించగలిగితే, మనలా కాలచక్రంతోపాటు బతుకీడ్చే బానిసత్వం భావితరాలకు తప్పుతుంది. కనీసం వాళ్ళైనా మనుషుల్లా జీవిస్తారు. మనుషులుగా మరణిస్తారు.

Only after the last tree has been Cutdown,
Only after the last river has been Poisoned,
Only after the last fish has been Caught,
Only then will you realize that money cannot be eaten"

– The Cree People

"మనం బ్రాహ్మణులకు వ్యతిరేకం కాదని స్పష్టం చేయదలచుకున్నాను. బ్రాహ్మణ వాదానికి వ్యతిరేకులం. బ్రాహ్మణులు కాదు, బ్రాహ్మణత్వ భావజాలం కలిగినవారు మన శత్రువులు. బ్రాహ్మణత్వ భావజాలం కలిగిన బ్రాహ్మణేతరులున్నారు. వారితో మనకు పొత్తు లేదు. బ్రాహ్మణత్వం విసర్జించిన బ్రాహ్మణులు మనకు సన్నిహితులు."

– డా॥ బి.ఆర్. అంబేద్కర్

మద్యపాన వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగస్వాములు కండి

మద్యపానం చేయని వారిని హీనంగా చూసే వ్యవస్థలో ఇప్పుడు మనం ఉన్నాం. ఒకప్పుడు తాగడాన్ని వింతగా చూసే లోకం, ఈ రోజు తాగకపోతే చింతిస్తోంది. ఖరీదైన విద్య, కార్పొరేట్ సంస్కృతిలో తాగడమనేది భాగమేనని బోధిస్తుంటే, కంపెనీ వైద్యం అసలు తాగడమనేది తప్పే కాదని చూపిస్తోంది. ధ్వంసమౌతున్న వ్యవస్థలో విలువలనేవి ఉదాసీనంగా చూడబడడం సహజం. అందులో భాగంగానే, తాగి ఊగిన ప్రతీవారికి విలక్షణమైన వ్యక్తిత్వాన్ని అంటకట్టడము, తాగడాన్ని దైనందిన జీవితంలో తప్పనిసరి కార్యంగా భావించడము జరుగుతోంది. నిరంతరం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల్ని పట్టించుకోకుండా ఉండడానికి, రోజురోజుకి విజృంభిస్తున్న నిరుద్యోగ సమస్యని గుర్తించకుండా చేయడానికి అన్నింటిని మించి సమాజంలో విస్తృతమౌతున్న ధనిక – పేద వర్గాల మధ్య తేడా తేటతెల్లంగా వెల్లడౌతున్నా గమనించకుండా చూడడానికి, ఈ మద్యపానం మందిని మత్తులో ముంచేయడానికి మహోద్భుతంగా ఉపయోగపడుతోంది. విద్యార్థి దశలోనే విస్కీ, బ్రాందీ, బీర్‌లవైపు ఆకర్షింపబడుతున్న బాల్యం, కౌమార దశకొచ్చేనాటికి ప్రాణాల్ని పణంగా పెట్టి మరీ మందుకొట్టే పార్టీల సంస్కృతికి అలవాటు పడుతోంది. సాంఘిక బహిష్కరణకి గురి కావలసిన మద్యపానం సామాజిక హోదాకి చిహ్నంగా భావించబడడం ప్రస్తుత మన అధ్వాన్న స్థితికి నిదర్శనం. కల్తీ కల్లు, కల్లీ సారాల ఫలితంగా భయంకరమైన దుర్గటనలు సంభవిస్తున్న సందర్భంగా, అట్టడుగు వర్గాల ప్రజల్ని మధ్య తరగతి జనాల్ని ఎరగా తీసుకొని మత్తులో వారిని జీవితాంతం చిత్తు చేయడానికి ఆవిర్భవించిన ఆధునిక మద్య తయారీ సంస్థల లాభార్జనలకి నిరసనగా, వాటినే నమ్ముకుని ముందుకు నడుస్తూ "యువత తప్పుదారి పడితేనే మాకు భవిత" అని అనుకుంటున్న ప్రభుత్వ విధానాలకి వ్యతిరేకంగా ఒక బలమైన ప్రణాళికతో కూడిన మద్యపాన వ్యతిరేక ప్రచారోద్యమాన్ని నిర్వహించాల్సిన చారిత్రక కర్తవ్యం మన మీదుంది. ఆంధ్రదేశాన్ని అట్టుడికించిన దూబగుంట మహోద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని జిల్లాల స్థాయి ప్రచారోద్యమానికి నాందీ ప్రస్తావన చేయడం జరుగుతోంది. ఈరోజు ప్రతీ సగటు పౌరుడూ ఎదుర్కొంటున్న సమస్యల్లో మద్యం ముఖ్యమైనది. ఏ ఒక్క వ్యక్తివల్లనో, ఏ ఒక్క పార్టీ ప్రోద్బలం వలనో మద్యంపై పోరాటం సాధ్యం కాదు. ఇది సమిష్టి ప్రయత్నం వల్ల మాత్రమే సుసాధ్యం. అందుకే ఈ అంశంలో అన్ని పక్షాల అభిప్రాయాల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం. అలాగే ఇప్పటికే సంబంధిత సమస్యపై పోరాటం చేస్తున్నవాళ్ళూ, ఈ సరికే చేసిన వాళ్ళని సైతం ఈ కృషిలో భాగం అవమని కోరుతున్నాం. నేడు మద్యం మహమ్మారి ఒక మహావిషవృక్షం. అత్యధిక శాతం ప్రజలపై ఈ విషవృక్ష ప్రభావం ఉందనేది నిస్సందేహం. కావున ఈ విషయంలో తక్షణ ఫలితాన్ని ఆశించడం అత్యాశే అవుతుంది. సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు ఈ నిజాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రయత్నంలో పాలు పంచుకోగలరని ఆశిస్తున్నాం.

మద్యపాన మారణహోమాన్ని వ్యతిరేకించండి

మద్యం కారణంగా రాష్ట్రం రావణకాష్టం అవుతోంది. ప్రతీరోజు మద్యం బారిన పడి జీవచ్ఛవాలౌతున్న వారి సంఖ్య లెక్కకి మించి ఉంటోంది. మద్యం అమ్మకాల్లో యావత్ దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం మన రాష్ట్రంలో 35% తాగుబోతులే ఉన్నారు. నిమ్‌హాన్స్ అనే సంస్థ సర్వే ప్రకారం 1980ల్లో, 28 ఏళ్ళ వయసు దాటాక మద్యపానం మొదలెడితే, 2005 నాటికి 20 సం॥రాల వయసులోనూ, 2012 నాటికి అక్షరాలా 13 సం॥రాల వయస్సులోనే మందుబాబులుగా తయారౌతున్నారు. రాష్ట్రంలో లైసెన్సుడు బ్రాందీ షాపులు 8,685 ఉంటే అక్రమ బెల్టుషాపులు 1,50,000 ఉన్నాయి. ఇంకా మద్యం మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకి ఎక్కడ అందుబాటులో ఉండదోననే బెంగతో కొన్ని కొత్త దుకాణాలకి ప్రతిపాదనలు పిలువడము, అది కూడా కుదరకపోతే ప్రభుత్వమే స్వయంగా బ్రాందీషాపులు నిర్వహించడము జరుగుతోంది. ఈనాటికీ రాష్ట్రంలో మంచినీటి సరఫరా లేక తాగునీరు అందని గ్రామాలు 10,000 ఉన్నాయి. ఇక సాగునీరు పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందంటే కొన్ని ప్రాంతాల్లో రైతులు పంటలు వేయడం మానివేసి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలాంటివన్నీ ప్రభుత్వం పట్టించుకోకుండా జనం ప్రాణాల్ని కూడా లెక్కచేయకుండా రోజుకు రాష్ట్రంలో 32 డిస్టిలరీలు ద్వారా 2,483 లక్షల లీటర్ల బ్రాందీ తయారుచేయడానికి, 6 బేవరీలు ద్వారా 2,000 లక్షల లీటర్లు బీరు ఉత్పత్తి చేయడానికి, ఇవి కాక ప్రతీరోజూ 24 గంటలూ రాత్రింబవళ్ళు పనిచేయిస్తూ అదనంగా కోటి లీటర్లు ఇతర మద్యాన్ని తయారుచేసేందుకు అనుమతులిచ్చింది. ప్రభుత్వ పాఠశాలలు రోజుకి 7 గంటలు, పట్టణాల్లో నగరాల్లో మంచినీటి సరఫరా

3 గంటలు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు 4 గంటలు, పట్టణాల్లో నగరాల్లో మంచినీటి సరఫరా 3 గంటలు, విద్యుత్ 7 గంటలు, మాత్రమే. అందుబాటులో ఉంటే మద్యం షాపులు మాత్రం అధికారికంగా 13 గంటలు అనధికారికంగా 24 గంటలు తెరిచి ఉంటాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకి సంవత్సరంలో 75 రోజులు సెలవులు ఉంటాయి. బ్రాంది షాపులకు మాత్రం 3 రోజులు సెలవు మాత్రమే ఉంటుంది. రాష్ట్రంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కొరత, యువతకు ఉపాధి కొరత, రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత, ఆసుపత్రుల్లో మందులు – పరికరాల కొరత, సామాన్యులకు నిత్యావసర వస్తువులు, రవాణా కొరత కల్పించి, ప్రజా సంక్షేమ పాలనని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన పాలకులు సంవత్సరంలో 365 రోజులు మాత్రం అన్ని మద్యం దుకాణాల్లో "ఫుల్"గా మద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తారు. అందుకే మనకి మద్యం కొరత ఎప్పుడూ ఏర్పడదు. మద్యపానం కారణంగా రాష్ట్రంలో 70% నేరాలు, 60% రోడ్డు ప్రమాదాలు, 50% ఆస్తి – ఆరోగ్య నష్టాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదు. ఒకవైపు మద్యం మత్తులో యువత తోవ తప్పి, తల్లిని – చెల్లిని చెయ్యిపట్టుకుని లాగినా, తండ్రిని – తాతని తన్ని తగలేసినా ఏలినవారికి పట్టదు. కాబట్టి ఈ సమస్యపై అందరం సమిష్టిగా కదలవలసిన అవసరం ఈ రోజు ఎంతైనా ఉంది. ప్రమాదకరమైన ఈ మద్యం మత్తు పట్ల మౌనం వహించడం సామాజిక ద్రోహం. సంబంధిత సమస్యపై మన శక్తిమేరకు స్పందించడం సగటు మనుషులుగా మనందరి బాధ్యత.

ప్రభుత్వానికి ప్రధాన డిమాండ్స్ :

– మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా భావించే ప్రభుత్వ దృక్పథంతో సమూలంగా మార్పు రావాలి. – మద్యాన్ని ప్రజల ఆర్థిక – సాంఘిక – ఆరోగ్య క్షీణతకి ముఖ్య కారణంగా గుర్తించి వెంటనే నిషేధించాలి. – వాణిజ్య ప్రయోజనాలకి పీఠ వేస్తూ, స్వదేశీ, విదేశీ సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థలకిచ్చిన విచ్చలవిడి మద్య తయారీ అనుమతులను రద్దు చేయాలి. – బహిరంగ మద్యపానాన్ని సాంఘిక నేరంగా ప్రకటిస్తూ ధూమపానం లాగానే మద్యపానానికి గాను జరిమానా విధించాలి. – మద్యపాన అనర్థాలపై శ్రీమన్నారాయన కమిటీ, టేక్‌చంద్ కమిటీల సూచనల్ని పరిగణనలోనికి తీసుకొని ఆ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవాలి. – అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ, పాఠశాల్లోనూ ఇతర బహిరంగ ప్రదేశాలలోనూ

మద్యపాన అనర్థాలను గురించి అవగాహన పెంచే హోర్డింగులను ఏర్పాటు చేయాలి. – బాల్యం నుంచే అశ్లీల–అసభ్యకర "పార్టీల" విష సంస్కృతిని అసహ్యించుకునే మనస్తత్వాన్ని పిల్లల్లోనూ, యువతలోనూ పెంపొందించేలా పాఠ్యాంశాలను రూపొందించాలి. – గ్రామ పంచాయితీ కార్యాలయాల్లోనూ, రచ్చబండల వద్ద కనీసం నెలకొకసారి మద్యపాన వ్యతిరేక కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తూ మద్యపాన వ్యతిరేకోద్యమంలో ఈ ఈసరికే కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల సహకారంతో శాశ్వత మద్యరహిత వ్యవస్థకి గాను, అవసరమైన ప్రణాళికను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రూపొందించాలి. – మద్యపాన వ్యతిరేక నిరంతర ప్రచారోద్యమానికి గాను, ప్రభుత్వం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి.

మతమా..? మనిషా....?

మనిషి మతాన్ని సృష్టించుకొన్నాడు గానీ మతం మనిషిని పుట్టించలేదు. మానవుడి మనుగడ మతంతో మొదలవలేదు. మతం మనిషి మానసిక వికారానికి ప్రతీక. ఏ మతమూ కూడా మనిషిని బానిసలా తప్ప మనిషిలా చూడలేదు. మానవుడి ఉన్నతికి తోడ్పాటు నందించనూ లేదు. పైపెచ్చు మనిషి సాగించిన ప్రతీ ప్రయత్నపూర్వక సంఘర్షణనీ అడ్డగించింది. ఆచరణాత్మకమైన ప్రతీ పోరాటాన్ని పూడ్చిపెట్ట చూసింది. అందుకే మతమనేది మనిషి అస్తిత్వానికి ప్రమాదంగా పరిణమించింది. ఈనాడు శాస్త్ర విజ్ఞానం సామాన్యుడికి సైతం అందుబాటులోకి వచ్చిన తరుణంలో మతం తనకి లేని గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ మానవుడికి భక్తి పారవశ్యం పేరుతో భావ బానిసత్వానికి చక్కని దారి చూపెడుతోంది. నేడు బాల్యం నుండి ప్రాయం వరకూ బానిసతత్వాన్ని తల్లితండ్రులు పిల్లలకి బోధిస్తున్నారు. తమ పూర్వీకుల నుంచి అందిపుచ్చుకున్న అజ్ఞానాన్ని అలాగే అప్రయత్నంగా పిల్లలకు అందిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలు మనల్ని మన్నించవు. ముందు పిల్లలకి మనుష్యులుగా మెలగడం, మానవత్వంలో మసలడం నేర్పిద్దాం. మానవత్వాన్ని మించిన మతం లేదు. ఈనాడు మతం పేరుతో అనుసరిస్తున్నది మాయదారి వ్యాపార వాణిజ్యాలే తప్ప వేరు కాదు. అందుకే మన తర్వాత తరాల్ని మతస్తులుగా కాకుండా మనుష్యులుగా తీర్చిదిద్దుదాం.

మద్యపాన రోగులారా...!

మనుషులుగా పుట్టినందుకు జీవితంలో ఒక్కసారయినా మనమున్న పరిస్థితిని నిజాయితీగా ప్రశ్నించుకుందాం!

మద్యం తాగి మృగంగా మారి పిచ్చిగా పరవశిస్తూ సిగ్గు లేకుండా ప్రవర్తించే స్థితి ఎందుకు దాపురించిందో తెలుసుకుందాం!

ప్రతీరోజూ కష్టపడి సంపాదించకపోతే పూట గడవని మనం మద్యానికి అలవాటుపడి మత్తులో జోగడం అవసరమా ఆలోచించుకుందాం!

మానసికంగా పైత్యాన్ని ప్రేరేపించే మతమూ, శారీరకంగా ప్రాణాల్ని హరించే మద్యమూ రెండూ ఒక్కటేనని గ్రహించుకుందాం!

మందు తాగడమంటే మరుగుదొడ్లు కడగడానికి వాడే యాసిడ్‌ని తాగి చావడంతో సమానమని తేల్చుకుందాం!

ఆర్థికంగా మన పతనానికి హార్థికంగా మన ప్రాణాలకి మతం - మద్యం తీవ్రమైన హాని చేస్తాయనే నిజం గుర్తుంచుకుందాం!

దేవుడి పేరుతో మతం మత్తునూ, రోగాల్ని తెచ్చే మద్యం మత్తునూ మనకి అంటకట్టడం వల్ల ఎవరికి లాభమో పరిశీలించుకుందాం!

వ్యవస్థలో హెచ్చుతగ్గులు కప్పిపుచ్చి జనాన్ని బుజ్జగించడానికి మాత్రమే ఈ మతమూ, మద్యమూ పనికొచ్చాయని పరిగణించుదాం!

మతానికి, మద్యానికి అలవాటుపడిన మన బతుకులు మన పిల్లల జీవితాల్ని కూడా అశుద్ధం చేస్తాయని చాటి చెపుదాం!

నిత్యావసర సరుకుల ధరల్ని, కార్పొరేట్ కంపెనీల కుళ్ళుని ప్రభుత్వాల కొవ్వుని గ్రహిస్తారనే భయంతోనే ప్రజల్ని పనికట్టుకొని బానిసల్ని చేయడానికి మత మద్యాలకి అంటగడుతున్నారని ఒంట పట్టించుకుందాం!

ఇప్పటికయినా మతం మత్తునూ, మద్యం చిత్తునూ తొలగించుకొని బుద్ధి బద్ధకాన్ని వదిలించుకొని సమాజాన్ని అర్థం చేసుకొనేందుకు, మత మద్యాల ప్రమాదాల్ని నివారించేందుకు మనస్ఫూర్తిగా ప్రయత్నిద్దాం!

మద్యపాన రోగులారా నిద్రలోంచి మేల్కొందాం!

ప్రియమైన యువ బానిసలారా...!

ఆలోచించండి. వ్యవస్థలో కేవలం కొద్దిమంది మాత్రమే కోటీశ్వరులైన అధికారులుంటే, అత్యధిక శాతం కూటికిలేని బికారులుగానో, మిగిలినవారు మధ్యతరగతి బాపతుగానో ఎందుకున్నారు?

డబ్బనేది సమాజంలో ఏ కొంతమందికో మాత్రమే పరిమితమై కొన్ని వర్గాల వద్దనే ఎందుకు పోగుపడుతోంది?

ఈరోజు చాలినంత అనుభవిస్తూ రాబోయే భవిష్యత్ తరాల బద్ధకస్తుల కోసం మితిమీరి ఆస్తులు కూడబెట్టుకొంటున్నవారికి అసలు ఆ ఆస్తులు ఎలా సంక్రమించాయి?

ఇంతకి ఆస్తి పుట్టుపూర్వోత్తరాలు ఏమిటి?

కష్టపడుతున్నవారే ధనవంతులు అవుతారనే వాదన నిజమైతే, సమాజంలో ఎక్కువ భాగం కూలీ, నాలీ చేసుకొని రోజంతా కష్టపడే కార్మికులూ - శ్రామికులే కాదా?

భగవత్ భక్తి ద్వారానో, పూర్వజన్మ కారణంగానో గొప్పవారవుతారనే విషయం యదార్థమైతే నూటికి 90 మంది ప్రజలు నిత్యం దైవనామ స్మరణ చేస్తూ ఏదో మతాన్ని పాటిస్తున్నవారే కదా?

ఏ జీవజంతుజాలంలోను లేని, ఆదా చేయడమనే అతి ప్రమాదకరమైన జబ్బు మనిషికి ఎలా పరిణమించింది?

భూమిమీద ప్రజలందరికీ కావలసిన ఆహార ధాన్యాలు ఉండి కూడా ఆకలి చావులు ఎలా సంభవిస్తున్నాయి?

ఖాళీ కడుపులతో కోట్లమంది అల్లాడుతుంటే కోట్ల విలువచేసే తిండిగింజలు బకాసురుల చీకటి అంగట్లో ఎందుకు పురుగులు పడుతున్నాయి?

అడుక్కు తినేందుకు ఆత్మాభిమానం అడ్డమొచ్చిన అనేకమంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, అరిగించుకోలేని పదార్థాలను కూడా అతిగా, ఆబగా ఆరగించి అజీర్తికి ఖరీదైన మందులు వాడే అమానుష మృగాలు మన మధ్యనే ఎలా తిరగగలుగుతున్నాయి?

పుట్టుకతోనే పేదరికానికి గురై, విద్యావిధానాలకు దూరం చేయబడిన తరాలు ఇంకా తమ తమ హక్కులను, బాధ్యతలను విస్మరించడానికి అలవాటుపడి పైపైకి సుందరంగా కనపడుతున్న మేడిపండు నగరాల మేడల అందాల్ని కళ్ళతో చూస్తూ కడుపునింపుకోవలసిందేనా?

ప్రజలకోసం ఆలోచిస్తూ జనంలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించాల్సిన యువతరం వెండితెరపై వ్యభిచరించడానికో, బుల్లితెరపై క్రికెట్ భూతానికి బుర్ర అంకితం చేయడానికో, కంప్యూటర్‌కు కళ్ళప్పగించి ఏ బహుళజాతి కంపెనీకో ఒళ్ళు ఎరువివ్వడానికో, ప్రభుత్వానికి చపాతీలు ఒత్తుతూ పాలకులకు గులాంగిరీ చేయడానికో మాత్రమే ఎందుకు ముందుకొస్తోంది?

మతం పేరుతో, ప్రభుత్వం పేరుతో పాలకపతులు, మత గురువులు శతాబ్దాలుగా జనాల్ని పిచ్చివాళ్ళను చేస్తూనే ఉన్నారా?

ఏది నిజం? మత ప్రభుత్వాలు పుట్టించిన గాలి కబుర్లా లేక మనుషులుగా తాకట్టు పెట్టిన మన తలలా?

ఆలోచించండి. కనీసం ఆలోచించడానికి ప్రయత్నించండి!

అజ్ఞానం - విజ్ఞానం

ప్రశ్నించని విజ్ఞానం ప్రస్థానానికి నోచుకోదు. అందువలన అది అప్రయత్నంగానే అజ్ఞానంగా మిగులుతుంది. అజ్ఞానాన్ని ఆరాధించడం ఆరంభిస్తే అది సామూహిక పిచ్చిగా మారి సమాజంలో స్థిరపడుతుంది. అదే మతం. మతమనేది మానవుడి మానసిక రోగానికి బహిరంగ రూపమే. మతమనేది మానవుడి ఆంతరిక జాడ్యానికి ఆచరణాత్మక అంశమే. అందుకే అది ప్రశ్నని నిషేధిస్తుంది. ప్రశ్నించే వైఖరిని వ్యతిరేకిస్తుంది. మానవ వైజ్ఞానిక వికాసాన్ని అడుగడుగునా అడ్డుకుందుకు ప్రయత్నిస్తుంది. మతం మనిషికి పట్టిన పీడ. చరిత్రలో ఈ చీడ కోసం జరిగినన్ని దుర్మార్గాలు, దురాగతాలూ మరి దేని కోసమూ జరగలేదు. మతం మనిషిలో అమానుషత్వాన్ని ప్రవేశపెట్టింది. అజ్ఞానాంధకారాల్ని ప్రేరేపించింది. మనిషిని మృగంగా జమకట్టింది. నరుడ్ని వానరస్థాయిలోనే ఉంచజూసింది. తోటి వ్యక్తిని శత్రువుగా చూడమంది. సాటి మనిషితో సంఘర్షణ చేయమంది. మానవ చరిత్రలో మరే అంశమూ చేయలేనన్ని అక్రమాలు చేసింది. సత్యాన్వేషణ యత్నాలన్నింటినీ క్రూరంగా కాలరాసింది. ఇంకా, ఈనాటికీ మానవుడి అజ్ఞానాన్ని, అజ్ఞాతాన్ని అపరిమితంగా సొమ్ము చేసుకుంటూనే అతడిపై పెత్తనాన్ని చెలాయిస్తోంది. అందుకే మతాన్ని త్యజిద్దాం. మనుషులుగా జీవిద్దాం. అజ్ఞానాన్ని ఎదిరిద్దాం. విజ్ఞానాన్ని ఆహ్వానిద్దాం.

మతాధిపతుల బండారం!

పిచ్చికి రచ్చకెక్కాలనే కుతి సహజం. మత పిచ్చికయితే మరీను. ఈ మధ్య ఇలా రచ్చకెక్కిన మూడు మతాలూ తమలోతాము తన్నులాడుకుని ఎవరిదెక్కువ పిచ్చో తేల్చుకోవాలనే పనిలో పడ్డట్టున్నాయ్. అందుకే సభలూ, సమావేశాలూ కూడా ఏర్పాటు చేసుకొని తమతమ పిచ్చిని గురించిన విశ్లేషణాత్మక చర్చలు కూడా చక్కగా జరుపుకుంటున్నాయి. ఏదో ఒక మతాన్ని పట్టుకువేలాడేవారు, మిగిలిన మతాల్ని కూడా నెత్తికెక్కించుకొనేవారు, ఎన్ని మతాలైనా సహనంతో భరించే విశాల హృదయులు, అన్నిమతాలు ఒక్కటేనన్న విషయం సరికొత్తగా తామే కనిపెట్టినట్లు ఫోజు కొట్టేవాళ్ళు... మొత్తానికి మతస్థులందరూ కలిసి మతం కోసం మొత్తుకున్నట్లు కనిపిస్తున్నారు. వాళ్ళ మధ్యలో దేవుళ్ళకు తప్ప మనిషికి స్థానం ఉన్నట్లే అగుపించదు. వారి మాటలలో మతాలనేగాని, మనుషులను పట్టించుకున్నట్లు కనిపించదు. "చదివేస్తే ఉన్నమతి పోయిందన్నట్లు" ఈ మతాధిపతులు, మతాభిమానులు కలిసి కొత్త రుగ్మతలను ప్రతిపాదిస్తున్నారు.

దేవుడు సంగతేమో కాని, వాడిపేర్లు చెప్పి వీలైనంత అడ్డంగా ప్రజల నుంచి దండుకోవాలనే లక్ష్యంతోనే ఈ మతాధిపతులనే మధ్యవర్తుల ముఠా ఏర్పడింది. ఈ రోజున జనం మతం పేరిట పాటిస్తున్న సాంప్రదాయాల్లోనూ, ఆచార వ్యవహారాలలోనూ, అత్యధిక శాతం ఈ దోపిడీ ముఠాని మేపడానికి ఉద్దేశించినవే. నిజంగా దేవున్ని నమ్మే భక్తులు మరొకరిని దేబిరించడానికి సిద్ధపడరు. ఎవరిని నమ్మాలో తెలియని అయోమయ గందరగోళ పరులే భగవంతునికి, భక్తునికి మధ్య "బ్రోకర్" అవసరమనుకుంటారు. అసలువాణ్ణి అటుంచి, ఈ దొంగలను తృప్తిపరచడమే భాగ్యంగా భావిస్తారు. దేవుడు తరువాత దేవుడంతటివాడంటూ దేవులాడుతారు. "ముస్తాడిపెళ్ళికి వచ్చిందే కట్నమన్నట్లు" ఈ మతాధిపతులు తగునమ్మా అంటూ ప్రతీకార్యంలోనూ ముందుండే ప్రయత్నం చేస్తారు. భగవంతుడి పేరుతో బాగుపడాలని చూసే ఈ మధ్యవర్తుల ముఠా భూలోక దేవుళ్ళుగా చలామణి అవుతూ జనాల్ని దోచుకోవడమే పరమావధిగా పనిచేస్తుంది. పూజారి, పాస్టరు, ముల్లా, పేరేదయినా ఈ మతగురువుల పని పరమార్థమొకటే. "అన్ని వున్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు" విజ్ఞానశాస్త్రం ఎంత పురోగమించినా ఈ మతాధిపతులు మాత్రం

తమకు తెలిసిందే శాస్త్రమని, తోచించే జ్ఞానమని అవాకులు, చెవాకులు పేల్తారు. అందినంత సుఖాన్ని అనుభవిస్తూనే అసలు జీవితం పరలోకంలో ప్రారంభమవు తుందని కబుర్లు చెప్తారు. ఇహలోకపు సుఖాలన్ని వినియోగించుకుంటూనే స్వర్గనరకాల బావనను మనలో ఉద్రేకపరిచి పబ్బం గడుపుకుంటారు. మంచికీ, చెడుకి కూడా ఒకటే మంత్రం జపిస్తూ తమ కుంటి తర్కంతో జనాన్ని బోల్తా కొట్టించగల సమర్థులు ఈ మతాధిపతులు, అప్పటికపుడు ప్రజల మధ్యన చిచ్చుపెట్టి అల్లర్లు రెచ్చగొట్టేది వీళ్ళే, తమదాకా వచ్చేసరికి సర్వమతాలు సమానమంటూ వుత్తుత్తి కూతలు కూసేది వీళ్ళే. అందుకే "అన్ని మతాలు ఒక్కచోటుకే తీసుకెళతాయి అనేవాడు పెద్ద దొంగ. అలా అయితే అసలే మతము లేని మార్గం కూడా అక్కడికే తీసుకుపోవాలి" అంటాడు సాంఘిక విప్లవకారుడు గుడిపాటి వెంకటాచలం.

"వండుకున్నమ్మకి ఒకటే కూరైతే దండుకున్నమ్మకి ఊరెల్లా కూరలన్నట్లు", ఒక్క మతాన్నే పట్టుకు వేలాడడం ఎందుకు అనుకున్నారో ఏమో అన్ని మతాలు ఒక్కటేనంటూ కొత్త నాటకం మొదలుపెట్టారు ఈ మతగురువులు. ప్రపంచంలోని దైవభక్తులు అంతా కలిసి ఈ ముఠాకి మేపే దాంట్లో పదోవంతు ఖర్చుపెడితే అనేక పేద దేశాలలో పరిస్థితి మెరుగుపడుతుంది. దశాబ్దాలుగా దరిద్రానికి దాసోహమౌతున్న దేశాలన్ని దేవుడు పేరుచెప్పి కనీసం సుభిక్షంగానైనా తయారవుతాయి. "కంచే చేను మేసిన" చందాన, ప్రభుత్వాలు ప్రజలను జోకొట్టి పడుకోబెట్టడం కోసం కుదిరినన్ని ప్రోత్సాహకాలు అందిస్తూ ఆధ్యాత్మికత ముసుగులో ప్రజాధనం దోచుకొని దుర్వినియోగ పరిచేందుకు తెరదీస్తున్నాయి. సశాస్త్రీయ ఆలోచనల్ని ప్రేరేపించే విద్యావిధానాలు, వివేకాన్ని మేల్కొలిపే సాంఘిక సాంప్రదాయాలు మాత్రమే ప్రజలలో ప్రశ్నించే వైఖరిని ప్రోత్సహిస్తాయి. అప్పుడిక మనుషులకే గాని, మతాలకు తావుండదు.

"సమాజం మీద లేచిన రాచపుండుల్లాంటివాళ్ళు ఈ బాబాలు. వీళ్ళ పాదాల కింద సమాజం నలిగి నశించిపోతుంది."

– ఎన్‌కౌంటర్ దశరథరామ్

25-2-1983, నాటి సంచిక

ధూమపాన ధూర్తులారా!

సరదాగా చేతబట్టి ఒక్కసారి మొదలెట్టబడిన చుట్ట, బీడి, సిగరెట్ మీ సగం జీవితకాలాన్ని సమాధి చేస్తాయని మీకు తెలియదా?

సమాజంలో హోదాకి పొగ తాగడమే ప్రధానమని నమ్మి రోగాలకి బానిసలైనవారు మీ చుట్టూరా కోకొల్లలుగా ఉన్నారని మీకు తెలియదా?

ఇంట్లో పొయ్యి రాజెయ్యని స్థితిలోనూ, ఒంట్లో బాగోలేని పరిస్థితులలో కూడా గుండెలనిండా పొగబీల్చే గులాములను మీరు చూడడంలేదా?

పొగ తాగడమనే భయంకరమైన అలవాటుకి అంకితమై తోచిన చోటల్లా అప్పులు చేసిన తప్పుడు మనుషులు ఎప్పుడూ మీకు కనిపించలేదా?

చుట్ట, బీడి, సిగరెట్టే శరణ్యమని నమ్మిన ప్రబుద్ధులెందరో పొగతాగడం మూలంగా కుటుంబాలను కూల్చుకున్న ఉదంతాలు మీకు తెలియదా?

అద్భుతమైన వ్యక్తిత్వం కలవారు సైతం ఈ అలవాటు కారణంగా పొగబారిన తమ బతుకులను చూసి ఏడుస్తున్నారనే నిజం మీకు తెలియదా?

జీవితంలో కొద్దో గొప్పో సంపాదించిన డబ్బును పొగ పేరుతో ఊది పారేస్తూ మీ పిల్లల భవిష్యత్తును చీకటి చేస్తున్న విషయం మీరు గ్రహించరా?

ఈరోజు సంతోషంగా మైకంతో తాగిన పొగ రేపు మనకు సెగలు కక్కే నరకాన్ని చూపెట్టి నమిలేస్తుందనే నిజం మీరు గుర్తించరా?

పొగ తాగే అలవాటు బారిన పడిన ప్రతి వ్యక్తి తన జీవితంలో సగటున లక్షల రూపాయలు పొగ రూపంలో కాల్చి విసిరేస్తాడని మీకు తెలియదా?

చుట్ట, బీడి, సిగరెట్‌కి బానిసైన వ్యక్తి చుట్టూరా వున్నవారికి, స్నేహితులకి, కుటుంబ సభ్యులకి ప్రాణాపాయాన్ని కల్గిస్తున్నాడని మీకు తెలియదా?

ఆర్థికంగా, హార్థికంగా, లైంగికంగా, సాంఘికంగా మిమ్మల్ని దిక్కులేకుండా చేసి దివాలా తీయించడంలో పొగదే ప్రధమస్థానమని మీకు తెలియదా?

మీ ఇంటిని, ఒంటిని గుల్లచేసే పొగని ఇప్పటికైనా విడనాడి ధూమపానానికి వ్యతిరేకంగా మీ గళం విప్పండి.

ధూమపాన ధూర్తులారా, దుర్వ్యసనానికి దూరంకండి!

పాన్‌మసాలా బాబులూ పారాహుషార్!

గుట్కా, ఖైనీ, తంబాకు... ఉత్పత్తి ఏదైనా మన ఊపిరిని హరించి జీవచ్ఛవాలుగా మనల్ని మార్చేదే. తిండికిలేని కుటుంబాలెన్నో బతుకీడుస్తున్న ఈ దేశంలో దండగ అలవాట్లను అలవర్చుకోవడం ఆధునికతగా ఎంచబడుతుంది. ఏదో ఒక వెధవలవాటు లేకపోవడం మానవతకు మహా అపచారమని భావిస్తూ కోరి వంకర పనులను పురమాయించుకోవడం జీవితానికి అర్థతగా చూడబడుతోంది.

ఏ పనీ లేక నమలడమే పనిగా పెట్టుకున్నవారు, ఏ పని చేస్తున్నా నమలడం ఆ పనివారు. నోట్లో ఏదో ఒక చెత్త నమలకుండా అసలేపని చేయలేనివారు, నమలడం కూడా ప్రాముఖ్యత కల్గిన పనులలో ఒకటని నమ్మిన పెద్దమనుషులు... అందరికీ ఏదో రకమైన రోగకారక పదార్థాన్ని అదేపనిగా నములుతూ అసహ్యకర ఆ ద్రవాన్ని వీలైతే వీధులలో ఉమ్మడం, లేకపోతే గుండెలలోకి మింగడం దినచర్యే.

ఈ గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్...లు నమలడం మూలంగా నాలుక పెలుసుబారి, మెదడు మొద్దుబారిపోతుంది. పంటి సందులలో విపరీతంగా పెరిగిన బయంకరమైన పురుగులు ఇష్టం వచ్చినట్లు మన నోటి లాలాజలంలో ఈదులాడుతూ, ఈగలు కూడా వాలడానికి అసహ్యించుకునే దానిని భద్రంగా మన కడుపులోనికి పంపించి ప్రమాదకరమైన జబ్బులకు మన శరీరాన్ని శాశ్వత నివాసంగా చేస్తున్నాయి.

క్రమంగా అన్ని ఆరోగ్యకరమైన విధానాలకు దూరం కాబడిన ఈ అశుద్ధం నమిలే అలవాటున్న రోగికి మెల్లమెల్లగా ఆహారంపట్ల అన్నపానీయాల పట్ల విముఖత ఏర్పడి నోరు స్వాధీనం తప్పి రోజంతా నమలడమే జీవితంగా ఎదురుచూసే స్థితి దాపురిస్తుంది. కొద్దో గొప్పో సంపాదించిన దాంట్లో ఎక్కువభాగం ఈ కుళ్ళు పొట్లాల్ని కొనడానికే ఖర్చు చేసే పరిస్థితి వచ్చి నోరు మురికి కాలువగా మారి కంపు గొడుతుంది.

ఈ పొట్లాలు నమిలి నోరు కడుగుకున్న తరువాత సైతం అనేక వేల క్రిములు నోట్లో ఉండిపోతాయి. వీరు తినే ఆహార పదార్థాల వ్యర్థాలు కూడా వాటితో చేరి నోట్లోనే గుడ్లుపెట్టి లక్షల సంఖ్యకు చేరుకొనే ఆ క్రిములు ఇక నిరంతరం ఒక్కొక్కటిగా కడుపులోకి చేరడమే తరువాయి, వివిధ రోగాలు మనకు రావడం ప్రారంభిస్తాయి. ఆస్పత్రులు అందినకాడికి మన పైసలు దోచుకోవడం ఆరంభిస్తాయి.

అందుకే కుదిరినన్ని ఆరోగ్యవంతమైన అలవాట్లను పెంపొందించుకోవడానికి ప్రయత్నిద్దాం. అక్కర్లేని, మనకు అసలేమాత్రం అక్కరకు రాని పిచ్చి అలవాట్లను నెమ్మదిగానైనా విడనాడేందుకు నడుం కడదాం. వ్యవస్థను విచ్ఛిన్నం చేసే ఈ రకమైన వికారపుటలవాట్లకి వ్యతిరేకంగా తోచిన రీతిలో ప్రచారం చేద్దాం. మనల్ని పైత్యపు అలవాట్లకి బానిసల్ని చేసి తమ పబ్బం గడుపుకొనే ప్రభుత్వాల్ని, వ్యాపార సంస్థల్ని నిషేదిద్దాం.

అనగనగా అభివృద్ధి కథ!

ప్ర : అభివృద్ధి కథ ఇప్పుడు ఎందుకు?

జ : ఎందుకంటే, రెండు దశాబ్దాలకి పూర్వమే నూతన ఆర్థిక విధానాల పేరుతో ప్రభుత్వం ఈ అభివృద్ధి కథ చెప్పడం మొదలెట్టింది కాబట్టి.

ప్ర : ప్రభుత్వ అభివృద్ధి కథ ఏమిటి?

జ : పేదరికాన్ని, నిరుద్యోగాన్ని రాత్రికి రాత్రి రూపుమాపదలచడం కోసం విదేశీ పెట్టుబడులను, దేశీ పెట్టుబడిదారులనూ ప్రోత్సహించి అనేక పరిశ్రమల్ని స్థాపించడం.

ప్ర : పరిశ్రమలను స్థాపించడం మంచిదేగా?

జ : కచ్చితంగా మంచిదే. కాకపోతే ప్రజలకి కాదు. ప్రభుత్వానికి, పెట్టుబడి దారులకీ మాత్రమే.

ప్ర : స్పష్టమైన ఉదాహరణ చూపగలరా?

జ : మేం చూపడం దేనికి? మీరే వెళ్ళి చూడండి. అభివృద్ధి అంటూ 80 ఎకరాల మడ అడవులతో కలిపి 1200 మంది మత్స్యకారుల జీవనానికి గండికొట్టి 217 ఎకరాల భూమిని సహజవాయువు నిక్షేపాల వెలికితీత వ్యాపారంకోసం రిలయన్స్ అనే బూచికి కట్టబెట్టిన వైనం మనకి తెలిసున్నదే.

ప్ర : ఆ కార్యక్రమం ప్రగతి పధంలోనే సాగుతోందిగా?

జ : ఎందుకు సాగడం లేదు. వేలమందిని నిరాశ్రయుల్ని చేసి వారి పిల్లలకు తిండి లేకుండా చేసి కుటుంబాల్ని దిక్కులేకుండా చేసింది. తీర ప్రాంతాలలోని మత్స్య సంపదను నాశనంచేసి, కొన్ని వందల చేపల చెరువులనూ, రొయ్యల చెరువులనూ గంగలో కలిపేసి, ప్రకృతిపై ఆధారపడి జీవించే ప్రజల్ని అనాధల్ని చేసే కార్యక్రమం నిరాటంకంగా జరిగిపోతోంది. ఇపుడాచుట్టు ప్రక్కల గ్రామాల్లోని పంటభూములు సైతం కృంగిపోవడం మొదలైంది.

ప్ర : ప్రభుత్వానికి ఈ రకమైన అభివృద్ధి ఎందుకు?

జ : అమ్మమ్మా! ఎంతమాట! అసలీ అభివృద్ధనేది ప్రభుత్వానికీ, పెట్టుబడిదారులకే అత్యంతవసరం.

ప్ర : ఎలాగో వివరణ ఇవ్వగలరా?

జ : పాలకులు అవసరాలు తీర్చుకోవడానికి, నాయకుల అవినీతి నిలుపుకోడానికి, పారిశ్రామికవేత్తల ఆస్తులు పెంచుకోవడానికీ, ఎన్నికలలో జనాలకి శఠగోపం పెట్టడానికి.

ప్ర : అభివృద్ధి కథ అయిపోయిందా?

జ : అసలు కథ ఇపుడే మొదలైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్ని అభివృద్ధి పేరిట సమాధి చేయడానికి శుభముహూర్తం నిశ్చయించిన ప్రభుత్వం, విశాఖపట్నం నుండి కాకినాడ వరకూ తీరప్రాంతమంతా కోస్టల్ కారిడార్ అంటూ ప్రైవేటు సంస్థలికి అప్పజెప్పడానికి గానూ కొత్త కథ సిద్ధం చేసింది.

ప్ర : ఇది మరో కథా?

జ : కాదు, అదే కథ, కథలో కథ, ప్రజల వ్యధ, దాదాపు వెయ్యి కిలోమీటర్ల మేర సహజ వనరుల్ని సర్వనాశనం చేసి మట్టిదిబ్బల్ని మనకి మిగిల్చే ప్రకృతి వనరుల వధ.

ప్ర : కొంచెం వివరంగా చెప్పండి?

జ : రాష్ట్రంలో తీర ప్రాంతాన్నంతటినీ పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తూ, ఆ ప్రాంతమంతా పెట్రో కెమికల్ పరిశ్రమలను స్థాపించేందుకు రంగం సిద్ధమైంది. పి.సి.పి.ఐ.ఆర్. పేరిట ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిస్తోన్న ఈ కార్యక్రమం కొరకు ఎన్.డి.ఎ. పేరుతో ప్రత్యేక సంస్థ కూడా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో నెం.373ను కూడా జారీ చేసేసింది.

ప్ర : మన ప్రాంతంపై దీని ప్రభావం ఎంత?

జ : ప్రత్యక్షంగా మొత్తం 110 గ్రామాలు బూడిద కాబోతుండగా అందులో 21 గ్రామాలు మన జిల్లా పరిధిలోని కాకినాడ, కొత్తపల్లి, తొండంగి మండలాలకు చెందినవి. ఇక పరోక్షంగా సుమారు జిల్లా అంతటా ఈ విషక్రతువు బారినపడి వందల గ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతులకీ, మత్స్యకారులకీ, గ్రామీణులకి ఉపాధి కరువవ్వడమేకాక, భవిష్యత్తులో భూమి, నీరు, తద్వారా పండే పంట, పీల్చేగాలి అన్నీ కలుషితమై ప్రమాదం బారిన పడనున్నాయి.

ప్ర : ప్రభుత్వం ఈ అభివృద్ధి కథని ఏమని సమర్థిస్తోంది?

జ : స్థానిక యువతకీ, నిరుద్యోగ యువతకీ ఉద్యోగావకాశాలు కల్పిస్తాననీ, ఆర్థిక స్వావలింబన చేకూరుస్తామనీ, నిరాశ్రయులకి నివాసయోగ్యమయిన వసతులు ఏర్పరుస్తామనీ కథలు చేస్తోంది.

ప్ర : దీనిపై మీ సమాధానం ఏంటి?

జ : మా సమాధానం వినడం కంటే గత అనుభవంలోకి తొంగి చూడ్డమే ఉత్తమం. ఈ రోజు మనం గర్వంతో చూసి చంకలు గుద్దుకుంటున్న అనేక ప్రసిద్ధ ప్రాజెక్టుల నిర్మాణంలో నిరాశ్రయులుగా మారి వలస వెళ్ళిపోయిన వేల

లక్షలమందిని అనాధల్ని చేసిన ఆవిష్కరణల్ని అభివృద్ధంటూ మురిసి పోతున్నాం మనం. ఇక పరిశ్రమల స్థాపన మూలంగా తమ వృత్తిని కోల్పోయే వారంతా సమాచార సాంకేతిక నైపుణ్యాలున్నవారుకాదు. ప్రకృతినే నమ్ముకున్న వారికి ఏవో ఉద్యోగాలు, అది కూడా చదువుకుని డిగ్రీలు పుచ్చుకున్న వారినే వీలైనంత పరిమితంగా పనిలో పెట్టుకునేచోట కల్పిస్తామనడం ప్రజల్ని మోసం చేయడమే.

ప్ర : అంటే ప్రభుత్వం అబద్దాలాడుతోందంటారా?

జ : అనడం కాదు. అసలు ప్రభుత్వం ఆడేవే అబద్దాలంటున్నాం. అపూర్వమయిన జీవ సంస్కృతుల్ని తుంగలో తొక్కి తిరిగి వారికి ఉద్యోగాలు కల్పిస్తామనడం పచ్చిమోసం. పరిశ్రమలు ఏర్పాటుచేసే నిర్మాణంలో ఏ కొద్దిమందికైనా కూలిపనో, చిన్నా చితకా పనులో కల్పించవచ్చేమో కాని మొత్తంగా అందరికీ ఉద్యోగాలిచ్చేటంత ఉపాధి అవకాశాలు నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే పరిశ్రమల్లో ఉండవన్నది వాస్తవం. పైగా నిర్మాణం పూర్తయ్యాక ఆ ఒకరిద్దకి కూడా పని ఉండదు.

ప్ర : మరి ఇంతటి వినాశకర పరిణామానికి ప్రభుత్వమెందుకు తెరతీస్తోంది?

జ : ముందే చెప్పాం కదా. సమిష్టి ప్రయోజనాలకి తిలోదకాలిచ్చిన ప్రభుత్వం వ్యక్తిగత లాభాలకు వంతపాడుతోంది. పారిశ్రామిక వేత్తల గత్తర సొమ్ముకు అమ్ముడుపోయి, ప్రైవేటు సంస్థలతో సంగమించడమే తన అస్థిత్వానికి ముఖ్యమన్నట్లు ప్రవర్తిస్తూ, పెట్టుబడిదారీ గుత్త సంస్థలపై ప్రేమానురాగాల్ని ఒలకపోస్తూ ప్రజా సంక్షేమమన్న పదాన్నే మర్చిపోయింది.

ప్ర : ప్రస్తుత పరిస్థితుల్లో మన కర్తవ్యం ఏమిటి?

జ : సాధ్యపడినంత లోతుగా, వేగంగా ప్రజానీకాన్ని చైతన్య పరచడానికి శాయశక్తులా ప్రయత్నించాలి. ప్రజల జీవన ప్రమాణాల్ని పెంచే దిశగా అభివృద్ధి పనుల్ని అమలుచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. అభివృద్ధి పేరుతో ఆరంభమయిన ఈ ప్రమాదకర కార్యక్రమాలకి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ విధానాలకోసం ఈ సరికే కృషి చేస్తున్న మానవ హక్కుల వేదిక మొదలైన ప్రజా ఐక్య సంఘాల నేతృత్వంలో ప్రజలందరూ పోరాట పటిమతో, ఉద్యమ స్ఫూర్తితో ఉద్యుక్తులవ్వవలసిన సమయం ఆసన్నమైందని ఇకనైనా అందరూ గ్రహించాలి.

స్థానిక ఆర్థిక రంగాన్ని పటిష్ట పరుచుకుందాం!

అందరికీ ఆర్థిక స్వాలంబన అంటూ దేశాన్ని కార్పొరేట్ కంపెనీలకు అమ్మకానికి పెట్టిన మన ప్రభుత్వం ఆర్థిక సంక్షోభం దెబ్బతో దిక్కుతోచక చుక్కలు చూడాల్సి వచ్చింది. స్వేచ్ఛా వాణిజ్యమంటూ బహుళజాతి సంస్థలకు బడుగు జీవుల బతుకుల్ని తాకట్టు పెట్టిన పాలకులు సొంత లాభాలకు పెద్ద పీట వేసుకుంటూనే విదేశీపెట్టుబడుల్ని ఆహ్వానిస్తున్నారు. ఆర్థిక సంక్షోభం దెబ్బకు దిమ్మ తిరిగి ఇప్పుడిప్పుడే ప్రాంతీయ పరిశ్రమల్ని, స్థానిక సంస్థల్ని బలోపేతం చేసేందుకు నడుం కట్టిన అమెరికా, ఐరోపా దేశాల్ని చూస్తూ కూడా వినాశకరమయిన సామ్రాజ్యవాద విధానాన్ని అనుసరించడానికి మన నాయకులు ఏ మాత్రం సిగ్గుపడడం లేదు. చావు తప్పి కన్ను లొట్టపోయిన వాటి పరిస్థితిని ప్రత్యక్షంగా చూస్తూ కూడా పెట్రో కెమికల్ పరిశ్రమల్ని కోస్టల్ కారిడార్ పేరుతోనూ, ప్రత్యేక ఆర్థిక మండళ్ళంటూ, సెజ్‌ల పేరుతోనూ పచ్చని పంట భూముల్ని బూడిద చేసే పనిలో ఉన్నారు. మెరుగైన విద్య, వైద్య ఉపాధి అవకాశాలు కల్పించడమే పారిశ్రామికీకరణ పరమోద్దేశమంటూ ఆకాయ, పోకాయ కబుర్లు అనునయంగా చెబుతున్నారు. ఆలోచిస్తే ప్రభుత్వాల వాదనలో నిజమెంతో సులువుగానే తెలుస్తుంది. హరిత విప్లవం పేరుతో అవసరానికి మించి సాంప్రదాయ విత్తనాల్ని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా గుత్త పెట్టుబడిదారీ సంస్థలు ఈ రకమైన ప్రకృతి విరుద్ధ విషోత్పత్తుల్ని ప్రయోగించడానికి పూనుకుంటున్నాయి. ఇప్పటికే విశ్వ విపణిలో రోజు రోజుకు దిగజారుతున్న రూపాయి విలువ సామాన్యుడి వీపు విరుస్తూ విజయవిహారం చేస్తుంటే, ఈ విధమయిన ఉత్పత్తులు మొత్తం రైతాంగాన్ని, దేశీయ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీల కాలి చెప్పుగా మారుస్తాయి. అసలు క్రిములకన్నా పంటల్ని ఎక్కువగా నాశనం చేసేటన్ని క్రిమి సంహారక మందులతోనూ, రైతుల రక్తమంతా ధారపోసినా దాహం తీరని రసాయన ఎరువులతోనూ, ఇప్పటికే నేలతల్లి గుండెల్ని పిండేసి ఎండిపోయేలా చేశారు. ఈ కార్పొరేట్ కోరల్లో చిక్కి తినే తిండి, తాగే నీరు, పండే పంట, పీల్చే గాలి, రాలే చినుకు అన్నీ కాలుష్యం బారిన పడుతున్నాయి. మండుటెండలో గొంతు తడిపే గుక్కెడు మంచినీళ్ళని సైతం డబ్బిచ్చి కొనుక్కోవలసిన దుస్థితి దాపురించింది. ఈ పరిస్థితికి కారణాలు తెలుసుకోవడంతో బాటూ, పరిష్కార మార్గాల్ని అన్వేషించడం

కూడా మనుషులుగా మనందరి బాధ్యత. ఈరోజు మనందరం అక్కర్లేని అవాంఛనీయ ఆధునికతని బలవంతంగా అలవరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. జనాభాలో ఎవరయితే అన్ని సుఖవంతమయిన సౌకర్యాల్ని పొందగల స్థాయిలో ఉన్నారో వారిని అనుసరించడానికి అప్రయత్నంగానే అలవాటు పడుతున్నాం. మన నిజ జీవితాలకి విరుద్ధమయిన విలాసాల్ని నిజంగానే మనం ఎల్లప్పుడూ అనుభవిస్తున్నామని సమాజాన్ని నమ్మించడమే నాగరికతగానో, ఆధునికతగానో చలామణీ అవుతోంది. టూత్‌పేస్ట్ దగ్గర్నుంచి డస్ట్‌బిన్ దాకా, ఫేస్ పౌడర్ మొదలుకుని వేస్ట్ పేపర్ వరకూ మనం ఉపయోగించే వస్తువులన్నీ సామ్రాజ్యవాద సంస్థల జేబులు నింపేవే కాని స్థానిక సంస్థల్ని బలపరచి, సామాన్యుడికి సాయపడేవి కావు. మామూలుగా మన వీధుల్లో, చిల్లర దుకాణాల్లో దొరికే సరుకుల్ని కూడా అధిక ధరని వెచ్చిస్తూ అందమయిన, ఆకర్షణీయమైన ప్యాకింగుల్లో కొంటున్నాం. అసలు సరుకుని పిసరు లాభానికి అమ్ముకునే వారికి ఎసరు పెట్టి కొసరు సరుకుని కూడా అధిక మొత్తంలో విక్రయించే కంపెనీలకే మన కాస్త సొమ్మూ కట్టబెడుతున్నాం. ఈ పద్ధతుల మూలంగా ఈసరికే స్థానిక ఆర్థిక రంగం మూలనపడి మృత్యు ముంగిట్లో ఉంది. ఎక్కడో దేశవిదేశాల్లో ఉత్పత్తయ్యే సరుకుల్ని విపరీతమయిన వనరుల్ని వృధా చేస్తూ రోజులకొద్దీ రవాణా చేసి, నెలల తరబడి నిల్వ ఉంచడం కోసం రకరకాల రసాయనాల్ని వినియోగిస్తూ, మనకి రోజువారి జీవితంలో సులువుగా దొరికే వాటిని హేళనగా చూస్తున్నామంటే, మనమే స్థితికి దిగజారామో అర్థం చేసుకోవచ్చు. అక్కడెక్కడో పండే యాపిల్స్‌ని ఆస్ట్రేలియా, ఐరోపా, యూరప్ దేశాల్నుంచి విమానాల్లో తరలించి మరీ కొనుక్కు తినడం అవసరమేమో ఒక్కసారి ఆలోచించండి. ఇటువంటి వస్తువుల్ని భద్రపరచడానికి, రవాణాకీ అయ్యే ఖర్చు, వనరుల వినియోగం ఎంతో ఎప్పుడైనా తెల్సుకునేందుకు మనం ప్రయత్నించామా. నిజంగా అంతంత ఖరీదైన సరుకుల్ని వాడే స్తోమత మన సమాజంలో ఎంతమందికుంది. మొత్తం జనాభాలో 5% ఉన్న ధనిక వర్గాల ఆడంబరమయిన విలాసవంత వికారాల్ని, ఆత్మ పరిశీలననేది చేసుకోకుండా విభిన్నత అనుకుంటూ ఆచరిస్తున్నాం మనం. ఇప్పటికయినా మేల్కొని కర్తవ్యాన్ని గుర్తించడం ముఖ్యం. అందుకుగాను ముందుగా దేశీయ, స్థానిక వనరులతో తయారయ్యే ఉత్పత్తుల్ని, వాటిలో ప్రధానంగా వ్యవసాయాధారిత, ప్రాకృతిక సహజ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేలా శ్రద్ధ తీసుకోవడం, తద్వారా స్థానిక ఆర్థిక రంగాన్ని వీలయినంత పటిష్టపరుచుకుంటూనే, నూతన సృజనాత్మక ఉత్పత్తి మార్గాల్ని

అన్వేషించడం, ఆయా రంగాల్లో యువత ఆసక్తి పెంచుకునేలా చేయడంతో బాటు, ఈ విధమైన జీవనోపాధి క్రమంలో కూడా ఆర్థిక భద్రత, సాంఘిక భద్రత కలవని వారికి తెలియజేయడం, ఇవేకాక ప్రత్యామ్నాయ ప్రకృతి సహజ వనరులయిన బయోగ్యాస్, ఉష్ణ శక్తి, పవన శక్తి మొదలయిన వాటిని వాడడం ద్వారా కూడా విలువైన వనరుల్ని ఆదా చేసుకోవచ్చు. అంతేగాక ఈ పద్ధతుల ప్రకారం నిర్మాణ రంగంలోను, సానిటేషన్, డ్రైనేజి విధానాల్లోనూ నూతన సంస్కరణలు ప్రవేశపెట్టవచ్చును. ప్రకృతి వనరుల్ని సాంప్రదాయ సహజ మార్గాల్లో వినియోగించడం ఆరంభిస్తే, అనేక అపసవ్య పెడధోరణులూ, అనారోగ్య సమస్యలు కూడా తేలికగానే దూరమౌతాయి. అందుకుగాను మనం సాంప్రదాయ ఉత్పత్తుల్ని స్థానిక పరిశ్రమల ఉత్పత్తిలో భాగం చేయడం వల్ల స్థానిక సంస్థల్ని అభివృద్ధిలో అనుసంధానించడంతోబాటు దేశీయ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసిన వారమౌతాం.

నీతి అవినీతి

సంఘంలోని మనిషి సామూహికంగా జీవించడానికి నైతిక క్రమబద్ధీకరణ అవసరం. అదే నీతి. సమాజంలోని ఇతర వ్యక్తులకి భంగం కలిగించకుండా తన అస్తిత్వాన్ని నిలుపుకోవడమే నీతికి ప్రథమ సూత్రం. అలా కాకుండా తానే బాగుండాలనీ, సొంత ఆస్తిని సాధ్యపడినంత మేర కూడగట్టుకోవాలనీ ఆశించడం అవినీతి. ఎందుకంటే మానవత్వానికి మూలం సమిష్టి శ్రేయస్సే కానీ వ్యక్తిగత స్వార్థం కాదు. అనాదిగా సాంఘిక కళ్యాణం కోసం మానవుడు చేసిన ప్రయత్నాలు విజ్ఞానానికి దారితీస్తే, స్వీయ స్వార్థం కోసం చేసిన ప్రయత్నాలు వినాశనానికి దారితీసాయి. సమాజంలోని ఆస్తంతా సమిష్టిగా వుండాలనేది మానవత్వానికి దారితీసే వైజ్ఞానిక ఆలోచన. ఈ విధమైన వ్యవస్థలో నీతికి ప్రాధాన్యత ఎక్కువ, అవినీతికి అస్కారం తక్కువ. అలా కాక సంఘంలోని సంపదంతా జనాల చేతుల్లో కాకుండా కొద్దిమంది సంపన్నులయిన జలగల చేతుల్లో వుండాలనేది బానిసత్వానికి దారితీసే దరిద్రపుగొట్టు ఆలోచన. అందుకే ప్రస్తుతం వ్యవస్థలో వ్యక్తి స్వార్థం ముఖ్యం. మనం ఎంత కూడబెట్టామనేదే ప్రధానం. అవినీతి పునాదిగా ఏర్పడిన ఈ సమాజంలో సంపూర్ణ నీతి సొంత ఆస్తనేదున్నంత వరకూ సాధ్యం కాదు. ప్రజల్ని ప్రజలు కాక ప్రభుత్వాలు పాలించినంతకాలం ప్రగతనేది తథ్యంగా రాదు.

అల్లూరిని స్మరిద్దాం

చస్తూ బతకడం వేరు. బతికి చావడం వేరు. మొదటిది మనకి వర్తిస్తే, రెండోది వర్తించేవారు అరుదుగానయినా చనిపోయి సజీవులుగా వుంటారు. మన సాదా జీవితపు సుత్తి సమయంలో కాస్తంత అలాంటి చిరంజీవుల కోసం తల్చుకోడానికి కేటాయించడం వల్ల నష్టమేమీలేదని అనుకొంటేనే ఈ అక్షరాల్ని చదవండి. చీమూ నెత్తురూ ప్రవహించే శరీరాల్లోని చేవని బలవంతాన చంపుకుని తలలు వంచుకుని, చేతులు కట్టుకు నిలబడ్డం నైజంగా మారిన గిరిపుత్రులు ఒడిదుడుకుల జీవితపు చీకట్ల గుండెల్లో ఒంటరిగా చిచ్చురగిల్చిన వీరుడు గురించి, అధికారపు జలగల చేతుల్లో మగ్గిమగ్గి తమ బతుకుల్ని బూడిద చేసుకుంటున్న అసహాయులయిన ఆదివాసుల చేతుల్లో అఖండమయిన ఆయుధంగా మారి అగ్ని శిఖల్ని కదిల్చిన శూరుడు గురించీ, అడవి బిడ్డల్ని దండుకుంటూ – పుడమి తల్లిని పిండుకుంటున్న పింజారీ మూకల మెదళ్ళలో రైళ్ళు పరుగెత్తించిన యోధుడి గురించీ తెల్సుకోవాల్సిన అవసరం ఈ రోజు రెట్టింపయ్యింది.

ప్రస్తుతం అడివంతటినీ పెట్టుబడిదారీ గుత్త సంస్థలకు కట్టబెడుతూ ప్రకృతిని సైతం ఆకర్షణీయ పేకెట్టుగా మార్చి మార్కెట్‌మాల్స్‌లో పెట్టి ఖరీదైన అంగడి సరుకుగా అమ్ముకుంటున్న ప్రభుత్వాల దుండగ పాత్రని అంచనా వేయాలంటే అల్లూరిని పునర్నిర్మించుకోవాల్సిన అవసరమూ, ఆయన ఆశయాలకు పునరంకితం కావాల్సిన అవసరమూ ఎంతైనా వుంది. ఉదయం నుండి సాయంత్రం వరకూ ఉన్న సమయాన్నంతట్నీ ఊసుపోలు కబుర్లకో ఊకదంపుడు పనులకో పరిమితం చేస్తూ ఉద్యోగం పేర్తో ఊడిగం చేయడానికి అలవాటుపడుతూ, అప్పుడప్పుడు అస్తిత్వం గుర్తొచ్చి అందరి కోసం ఏమీ చేయలేకపోతున్నామని సిగ్గుపడుతూ, ఉన్నతంగా జీవించడమంటే ఉన్నంతలో కూడబెట్టుకోడానికి కక్కుర్తి పడ్డమేననే అర్థంతో మనసుకి సర్ది చెప్పుకుని రోకలిబండ పాకుడునే జీవితానికి స్ఫూర్తిగా తీసుకుని కుదిరినన్ని రోజులూ గోక్కుంటూ గడిపేయడమే నాగరికత నాడిని పట్టుకు వేలాడే ఆధునిక మానవుడి అధమ కథ.

కాలం ఏదయినా కానీండి, జనం కోసం జీవించే నాయకుల బలం, బలహీనత జనమే కాబట్టి వారిని పట్టడం కోసం జనాన్ని పీడిస్తే చాలనేది పాలకుల అభిప్రాయం. చాలా సందర్భాల్లో అది నిజం కూడా. అందుకే అల్లూరి సీతారామరాజు అసలు మనిషే కాదనీ, అతనికి మానవాతీత శక్తులున్నాయనీ, ఆయన్ని పట్టుకోవడం

అసాధ్యమనే ప్రచారాలతోనూ, మిరపకాయ టపాల పేరుతో ముందుగానే సమాచారం చెప్పి మరీ తమని చావుదెబ్బలు కొడుతున్న అల్లూరి తిరుగుబాటుతోనూ దిమ్మతిరిగి తలలు పట్టుకుంటున్న పోలీసులకి తన గురించి ప్రజల్ని హింసించడం సహించలేని అల్లూరి తనకు తానుగా లొంగిపోయేందుకు కబురు పంపగా ఆయన్ని అన్యాయంగా పట్టుకుని అమానుషంగా చుట్టుముట్టి 7-5-1924న కొయ్యూరులో చెట్టుకుకట్టి కాల్చి చంపడం మృగ తృప్తినిచ్చింది. విప్లవకారుల్ని మట్టుబెట్టడంలో ప్రతీ ప్రభుత్వమూ పాశవికంగానే ప్రవర్తించాలనేది అప్పటి నుంచీ అప్రకటితంగానే అమలవుతోన్న అధికార నిబంధన.

వెచ్చటి వెన్నెల వుయ్యాలో
నెత్తురు చిందింది వుయ్యాల
జల జల పారే సెలయేరు
జనమంత సంద్రల కదిలేరు
పుడమి కడుపులో సూరీడు
అడవి తల్లి ఒడిలో కొచ్చిండు
పున్నమి రాతిరి చందురుడు
ఒంటిగా ఊసులు చెబుతుండు
పచ్చాకు పందిట్లో పువ్వులు
మంచీగ విరిసేను వాసనలు
ఆకాశం ఎరుపెక్కి వుయ్యాలో
అల్లూరిని తల్చింది వుయ్యాల.

* * *

"The greatest test of courage on this earth is to bear defeat without losing heart."

– Charles Bradlaugh

గతిని నమ్మండి : తర్కాన్ని కాదు!

ఈ దేశానికి ఎర్రజెండాల తొందరపాటు భావజాలం ముందస్తు ప్రభావాల్ని అందించింది. వ్యక్తి స్వేచ్ఛకి సమాధి కట్టి వర్గ ప్రయోజనాలంటూ ఎంగిలి పదజాలాన్ని వల్లించడం అలవాటయ్యింది. విశ్లేషించదగ్గ అంశమేదైనా పడికట్టు భాషని ప్రయోగించడమే అభ్యుదయంగా చూడబడే దుర్భర పరిస్థితి ఆంధ్రదేశంలో పెరిగిపోయింది. సామ్యవాదాన్ని కమ్యూనిస్టు మత్తులో స్థాపించాలని తపించిన అవాంఛనీయ శక్తులన్నీ చరిత్రలో నయా నియంతృత్వ నైజాలుగా మారిన ఉదంతాలు ఈరోజే చాలినన్ని ఉన్నాయి. గతితర్కం పేరుతో గంగిరెద్దు భావాల్ని ప్రేరేపిస్తూ గానుగెద్దు స్వభావాన్ని పెంపొందిస్తూ తమది కాని మంచికి అడ్డుపడడమో, అదుపుచేయ చూడడమో మాత్రమే కరుడుగట్టిన కమ్యూనిస్టు ఆనవాయితీగా వస్తోంది.

ఊకదంపుడు తత్వానికే ఉన్న అస్తిత్వాన్ని అంకితం చేసి దంచుడు సిద్ధాంతాన్నే ఉన్నతంగా ప్రతిపాదిస్తూ, వంచన వివాదాల్నే ఉద్యోగంగా ప్రదర్శిస్తూ, మన వ్యవహారశైలిని గూర్చో, మనకి నచ్చినవారి వ్యక్తిత్వాల గురించో వీలయినప్పుడల్లా విధిగా దరువేయడమే ధార్మికదృష్టిగల ఉద్యమంగా చలామణీ అవుతోంది. ఏదో ఇంత గప్పుని గబ్బుగా కొడుతూ తమ తప్పుడు వాదాల బలాన్ని నిరంతరంగా నిరూపించుకునేందుకు నిత్యం ఇతరుల మెదడ్ని ఇస్త్రీ చేసేందుకు సిద్ధపడే వానపాములు వ్యవస్థలో చాలానే ఉన్నాయి. వర్షం రావడమే తరువాయి వీళ్ళు తమ తక్కెడ కొలతల జ్ఞానాన్ని తూకపు మాటల మేధస్సును నలుగురికీ చూపించుకుని అకారణమైన మెప్పు పొందడమే ప్రధానంగా మసలుకుంటారు.

సంవత్సరానికొకసారి జయంతి, వర్ధంతుల్ని జరపడమే జనోద్ధారణగా భావిస్తున్న జంగిలి సంఘాలకు సమాజంలో కొదవలేదు. కోతల్లో కొండవీటి చాంతాడుని ఆదర్శంగా తీసుకొని, ఆచరణలో అరజానెడు మొలతాడుని కూడా మించలేని ఈ అంటకత్తెర అభ్యుదయవాదులందరూ స్వఘోష సిద్ధాంతాన్ని పట్టుకు వేలాడుతూ సమాజమంతా తమ సంకరజాతి వాదాన్నే అంగీకరించి తీరాలనే తీటతోనే కాలం వెళ్లదీస్తుంటారు. మార్క్సిజమనే బ్రహ్మ పదార్థం మాకు మాత్రమే తెలుసనే పొగరు అణువణువునా ఈ అమ్యామ్యాల ప్రవర్తనలో కనిపిస్తూనే ఉంటుంది. వీరి భజనా కారక్రమమంతా బావురుపిల్లి రొట్టెముక్క కోసమే కానీ బలహీనుల తరపున నిలబడి పోరాడడం కోసం మాత్రం కాదు.

వ్యక్తి నిబద్ధతకి పార్టీలతో పనిలేదు. సామాజిక చైతన్యానికి సంఘాలతో సంబంధం లేదు. వ్యవస్థ ఔన్నత్యానికి మానుష స్వేచ్ఛని మించిన ప్రమాణం లేదు. సాంఘిక సంఘాలు, శాస్త్రీయ ఆలోచనావేదికలు, రాజకీయ పార్టీలు, విప్లవ సమాఖ్యలు ఉన్న ఆలోచనా క్రమాన్ని ఉన్నతంగా రూపొందించే దిశగా కృషి చేయాలే కాని సభ్యుల సంఖ్యను పెంచుకోవడమే లక్ష్యంగా చంకలు గుద్దుకోవడం సరికాదు. కొద్దో గొప్పో బుద్ధికల ప్రతీ వ్యక్తి తప్పనిసరిగా మన పక్షమే అయ్యుండాలని ఆశించడం మన బుద్ధితక్కువ తనానికి పరాకాష్ట అయితే, మనమున్న పక్షమల్లా మనమున్నందువల్లే బుద్ధిగా ఉందని భావించడం మన బుద్ధిలేనితనానికి నిదర్శనం. మనం మంచిదని భావించినదాన్ని పాటించడానికి అడ్డమైన గుంపుల్లోనూ ఉండాల్సిన పనిలేదు.

లక్ష్యమనేది అలుపుకి చిహ్నం కాని గెలుపుకి కాదు. తోచిన గమ్యాన్ని ఏర్పరచుకుని పయనించడానికి కాలం మన జీవితంతో ఆగిపోయే మజిలీ కాదు. తాను చేయగలిగినంత మేర నిజాయితీగా పాటుపడడమే సామాజిక కార్యకర్తల బాధ్యతకానీ, ధ్యేయాలంటూ దేభ్యపు ఆలోచనల్ని తగిలించుకుని ఆదేశాల కోసం ఎదురుచూసే తత్వం కర్తవ్యలేమికి గుర్తు. తన అస్తిత్వానికి కనీస ప్రయోజనం కలిగించడానికి కూడా యత్నించని మనిషి జీవితం వృధా ప్రయాసయితే, యాంత్రికంగా తన వ్యక్తిత్వానికి బానిసత్వ పాఠాల్నే బోధించడానికి తొందరపడే మానవ జీవనం సదా నిరాశ. మనిషి మార్మికత చేతిలో కీలుబొమ్మ కాదు. మొదట్నుంచి తన విజ్ఞానంతో దానిని హెచ్చరిస్తూనే వచ్చాడు. అది మతమైనా, మార్క్సిజమైనా, మరోటైనా!

"సముద్రం ఒకడి కాళ్ళ దగ్గర కూర్చుని మొరగదు
తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు
పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు
నేనింతా ఒక పిడికెడు మట్టే కావచ్చు
కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది"

– శేషేంద్ర

* * *

వ్యక్తి – వ్యవస్థ – వ్యవసాయం

ఈ దేశపు రైతుల వ్యవసాయం అప్పులతో మొదలై ఆత్మహత్యలతో ముగుస్తుంది. అక్కరలేని చిక్కుల్ని అంటకట్టే పని స్వయానా ప్రభుత్వాలే నెత్తికెత్తుకోవడం మూలంగా ప్రైవేటు సంస్థలు ప్రజల చేతికి బ్లేడిచ్చి గుండు గొరికే పని సులువుగానే సాగిపోతుంది. విషయం వ్యవసాయం కాబట్టి విత్తనాల నుంచి మొదలుపెట్టడం సబబని ఎవరైనా భావిస్తే పప్పులో కాలేసినట్లే. సాంప్రదాయ విత్తుల్ని అటకెక్కించిన ఆరంభ శూరత్వం మనల్ని కార్పొరేట్ హైబ్రీడ్‌లమీద, బహుళజాతి బీటీలమీద చచ్చినట్లు ఆధారపడేలా చేసింది. చివరికి విత్తనాల కోసం విచ్చలవిడిగా విజృంభించే పోలీసు లాఠీలకు శరీరాన్ని అప్పజెప్పి ప్రాణాలను పణంగా పెట్టడం అన్నదాతలకు ఆనవాయితీగా మారి అంపశయ్యపై పంటతల్లిని పడుకోబెట్టింది.

మనిషి విజ్ఞాన ప్రయాణానికి విత్తనమొహ ప్రమాణం, వ్యవస్థని వ్యవసాయం నుంచి విడదీసి చూడాలనుకోవడం, కళ్ళుండీ కబోది కావాలనుకోవడం లాంటిది. గడిచిన చరిత్ర తాలూకు ఘటనల దగ్గర్నించి రాబోయే భవిష్యత్ తాలూకు గణాంకాలదాకా మానవ ప్రస్థాన గమనాన్ని మూల్యాంకనం చేయడానికి పనికొచ్చే ముఖ్యమైన సాధనం ఆయాకాలాల్లో అతడు ఏయే పంటలు పండించి జీవించాడన్న అధ్యయనమేనన్న విషయాన్ని విస్మరించడం వినాశనంతో సమానం. యుగయుగాలుగా భారతదేశపు రైతు జీవితంలో భాగమైన వ్యవసాయాన్ని అతడికి దూరంచేసి, అగ్రరాజ్యాల దోపిడి కంపెనీలపై అన్నదాత ఆధారపడేలా చేయడం కసాయివాడి నుంచి కన్నబిడ్డల కళేబరాల్ని కొనుక్కోడంతో సమానం.

ఇల్లలకగానే పండగవనట్లు విత్తులు చల్లగానే వ్యవసాయం అవ్వదు. ఇంతా చేసి విత్తులు అసలువో నకలువో పంటొస్తేగాని తేలదు. ఒకవేళ సిసలువే అయితే దళారి దోపిడీకి ధారపోసి, మార్కెట్టు మాయావికి హారతి చేయగా మిగిలిన దాంతో చక్కభజనలు చేసుకోవాలి. నకిలీవైతే ఉసూరుమంటూ ఏడ్వనైనా ఏడ్వాలి లేదా నవ్వుతూనే ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాలి. తమ పాలనా చలవ కారణంగానే అసలు విత్తనాలు ఇంకా పూర్తిగా తుడిచిపెట్టుకుపోకుండా అరుదుగానైనా అడపా దడపా దొరుకుతున్నాయని ప్రభుత్వాలు డబ్బా కొట్టుకోవడం పూర్తిగా అబద్ధం కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలుగా, భావిభారత పౌరులుగా మనమందరం ఇందుకుగాను బాధ్యతగా కనీసం రోజుకు వందసార్లు గర్వపడాల్సిన అవసరం ఎంతయినా వుంది.

ప్రభుత్వాల పుణ్యకార్యాల్ని విత్తనాల వరకే పరిమితం చేయడమంటే అభివృద్ధి పనుల్ని కావాలని అల్పంగా చూపినంత పాపంతో సమానం. దేశంలోని ప్రతీ మారుమూల గ్రామంలోకీ కూడా రంగురంగుల పురుగు మందుల్ని అందుబాటులోకి తెచ్చిన పరమపురుషులు కూడా మన నాయకులేనన్న నిజం ఇందుమూలంగా గుర్తుపెట్టుకోవాలి. అయితే అత్యధికంగా అవి అన్నదాతల ఆత్మహత్యల్నే ప్రేరేపిస్తున్నాయన్న విషయం పెద్దగా పట్టించుకోదగ్గది కాదు. దశాబ్దాలుగా ప్రభుత్వ పాలకులు – రాజకీయ నాయకులు పెట్టుబడిదారులతో కలసి చేస్తున్న అభివృద్ధి మహాయజ్ఞంలో సమిదలుగా సామాన్య జనాలు, ప్రమిదలుగా సాధారణ ప్రజలు మాత్రమే మృత్యుమోహం చూడటం పౌరులుగా వారి త్యాగ నిరతికి నిదర్శనమని భావించాలి.

రకరకాల కీటక నాశనులకి, రసాయన ఎరువులకి అమ్యామ్యాలకోసం అడ్డదిడ్డంగా అనుమతులిచ్చి రైతన్నలకి ముక్తిని ప్రసాదించిన ఘనత నిక్కచ్చిగా మన అమాత్యులకే దక్కడం ముదావహం. వ్యవసాయాన్ని వ్యాపారంగా చేసి, మార్కెట్టు మేడల్లో, కార్పొరేట్ గాజు గోడల్లో మాత్రమే వ్యవసాయం చేసేందుకు విదేశీ సంస్థలకు అనుమతులిచ్చే (అ) శుభఘడియ మరెంతో దూరంలో లేదు. ఇప్పటికే గుత్త పెట్టుబడిదారులతో కలిసి మన పాలకులు పుడమితల్లిని పంచిపెట్టేశారన్న వాస్తవం, అంతా మనమంచికే ననుకునే మనం పట్టించుకోకపోవడమే ఉత్తమం. ఎందుకంటే, ఇప్పటికే వ్యవసాయం పేరుతో కుమ్మక్కైన కంపెనీలన్నీ మన ఒడిదుడుకుల బతుకులపై దండయాత్ర మొదలెట్టేశాయి.

దండకారణ్యాలు మొదలుకొని పల్లెసీమల వరకూ ప్రతీ ప్రకృతి వనరునీ సొమ్ము చేసుకోవడం కోసం అప్పనంగా దండుకుంటున్న దగాకోరు సంస్థలన్నీ ఈ దేశ ఆదివాసుల్ని, గిరిజనుల్ని అనాధల్ని చేస్తున్నాయి. ఆకాశం నుంచి ఆరంభించి సముద్రం దాకా సర్వం దోచుకుంటూ, కడలి కడుపుని నమ్ముకు జీవించే మత్స్యకారుల జీవనాన్ని బుగ్గిపాలు చేసే బృహత్తర కార్యక్రమాల్ని తమ లాభాల కోసం లాంఛనంగా నెత్తికెత్తుకుంటున్నాయి. మన ప్రయోజనాలకి భంగం కలగనంత వరకూ పక్కవాడి పొట్ట ఎవరు కొడుతున్నా, మన బతుక్కి ఢోకా లేనంత వరకూ భూగోళం తగలడుతున్నా, కదలకుండా వుండడానికి మనం అలవాటుపడి చాలా కాలమైంది కాబట్టి రాబోయే రోజుల్లో ఈ వాతావరణ విధ్వంసం వల్ల తలెత్తే ఫలితాల ప్రభావం అందరం అనుభవించాలనేది అంగీకారంతో పనిలేని చేదు వాస్తవం.

క్లాడ్ అల్వారిస్ అన్నట్లు, "మానవస్పర్శ ఎరుగని ప్రకృతి కన్యకు అభివృద్ధి పేరుతో మానభంగం జరుగుతోంద"ని మనం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. పారిశ్రామిక విప్లవం మొదలుకుని 1960లో హరిత విప్లవం, 1970లో శ్వేత విప్లవం, తర్వాత నీలి విప్లవం, అటు పిమ్మట అడవుల పెంపకం. ఈ మధ్య ఊపందుకున్న ఆర్థిక సరళీకరణ విధానాలు, అభివృద్ధి నిర్మాణాలు, అన్నీ కూడా జనాభాలో కొంత మందిని కుబేరులుగా నిలబెట్టడం కోసం ధనికదేశాలు వర్ధమాన దేశాలపై బలవంతంగా రుద్దుతున్న వినాశనానికి ప్రధానాంగాలేకాని, అంతిమంగా సమాజానికి పనికొచ్చేవి కావు. పచ్చని పల్లెల్ని ఎండకట్టడానికి మొదలెట్టే ప్రతీ లుచ్చాపనినీ అభివృద్ధి పేరుతోనో, ఆధునిక విప్లవం పేరుతోనో సమర్థించుకోవడం మన బచ్చాగాళ్ళకి అలవాటే.

వారి వూహా ప్రపంచంలో ఎక్కడా పొరబాటున కూడా ప్రకృతి కానరాదు. పచ్చదనం అనే మాట తలంపే లేదు. అంతా కంప్యూటర్ల, కార్ల ప్రపంచం, నింగిలో విమానాలు తప్ప నేలమీద ఒక్క వృక్షం కూడా లేని వృధా కృత్రిమ వాయు విశ్వం. ఆహారం, నిద్రా, దాహాలన్ని మరిచి అంతా హైటెక్‌లో ఐక్యమయ్యే అపురూపం. అమ్మా – నాన్న, అక్కా – చెల్లీ, అన్నా–తమ్ముడు, సంబంధాలన్నీ సాఫ్ట్‌వేర్‌లుగా రూపుదిద్దుకున్న యాంత్రిక జగం. ఇళ్ళూ, ఒళ్ళూ, ప్రేమా, పిల్లలూ అన్నీ ఇంటర్నెట్‌లోనే సాక్షాత్కరిస్తున్న టెక్నికల్ విశ్వం. మరణించబోతున్న వ్యవసాయానికి సంతాపం ప్రకటిస్తూ, అంతమవబోతున్న పుడమిపై ప్రకృతిని చూస్తున్న చివరితరంగా భూదేవి చావుకి మౌనం వహిస్తున్నాం.

సామ్రాజ్యవాదం జిందాబాద్ – మానవత్వం ముర్దాబాద్
కార్పొరేట్ అమర్ రహే – ఆమ్ ఆద్మీ కిదర్ హై
పానీ చాహేతో సోజావో – ఖానా చాహేతో మర్‌జావో

జై హైటెక్ జై జై కార్పొరేట్ జైజైజై కంప్యూటర్

సెల్‌ఫోనో శ్రీకృష్ణార్పణో హరి!
మార్కెట్టే మహారాజపోషక సిరి!!
గ్లోబలైజేషనో గోవిందో సరి!!!

భావవాదం - భౌతికవాదం

(చార్వాకలోకాయతోద్యమ సంక్షిప్త పరిచయం)

ముందు భావం అంటే, ఎవరో చేసిన ఆలోచన ద్వారా ఈ ప్రపంచం పునికిలోకి వచ్చిందనేది భావవాదం. అలా కాకుండా, ముందుగా పదార్థం అనేది పుద్భవించి జీవమనేది పరిణామ క్రమంలో మానవ మస్తిష్కంగా రూపుదిద్దుకున్న తర్వాత మాత్రమే ఆలోచననేది జనించి అభివృద్ధి సాధ్యమైందనేది భౌతికవాదం. ఈ విశ్వానికి కర్త అనేవాడున్నాడని నమ్మేది భావవాదమైతే, ప్రకృతి స్వతస్సిద్ధ నియమాలనుసరించే సాగుతోంది తప్ప దీనిని ఎవరూ పుట్టించలేదని చెప్పేది భౌతికవాదం.

భావవాదం ప్రకారం ఈ జగత్తంతా ఎవరో దేవుని భావాల ఆధారంగా నడుస్తుంది. దీంట్లో మనిషి ప్రాణమున్న బొమ్మతో సమానం. భౌతికవాదం మనిషినే ప్రమాణంగా తీసుకుంటుంది. చరిత్ర విధాత, ప్రపంచ నిర్మాత మానవుడేనంటుంది. భావవాదం మతాల్ని పునాదిగా చేసుకుని భిన్న అలౌకిక అంశాలను ప్రకటిస్తే భౌతికవాదం మనిషిని ప్రామాణికంగా తీసుకుని వివిధ లౌకిక ప్రతిపాదనలు చేసింది. భావవాదాన్ని అప్రయత్నంగా అనుసరిస్తూ ఏదో మతాన్ని తలకు రుద్దుకునే వారందరూ ఆస్తికులయితే, భౌతిక పదార్థ వాదాన్ని నమ్ముతూ మానవత్వాన్ని పాటించేవారు నాస్తికులు.

ఆస్తికత్వానికి అనుకరణే శరణ్యమయితే నాస్తికత్వానికి ఆలోచనే ప్రదానం. ఆస్తికత్వం మతతత్వానికి దారితీస్తే నాస్తికత్వం మానుషత్వానికి మార్గమవుతుంది. చరిత్రంతా ఆస్తికులు మతోన్మాదంతో నాస్తికుల్ని హింసించి కావించిన హత్యాకాండలే కనిపిస్తాయి. కానీ నాస్తికులు ఏనాడూ అక్రమంగా ఆయుధాలు చేతపట్టిన దాఖలాలు లేవ్. ఈ రోజుకీ జరుగుతున్న నేరాల్లో కరుడుగట్టిన హంతకులంతా ఏదో మతాన్ని అవలంభించే ఆస్తికులే కాని నాస్తికులు కారు.

మన దేశంలో బౌద్ధం ఆవిర్భవించి హిందూ మతాన్ని చావు దెబ్బ కొట్టకముందే, చార్వాక లోకాయతాలు సనాతన ధర్మపు టెంకె పగలకొట్టాయి. ఆనాటి దేశీయ వారసులయిన చార్వాక లోకయతుల ప్రశ్నలకి, తర్కాలకీ బెంబేలెత్తిన మతోన్మాదులు వార్ని చిత్రహింసలు పెట్టి చంపడమే కాకుండా, వారిచే రచింపబడిన అనేక అద్వితీయ అపూర్వ గ్రంథాల్ని క్షుద్ర ప్రవృత్తితో నాశనం చేసినట్లు తెలుస్తోంది. సత్యాన్వేషకులపై తుచ్చుల వైఖరి ఏ కాలంలోనయినా ఏకరీతిగానే వుంటుందనడానికి ఇంతకి మించిన దాఖలా అవసరం లేదు.

చార్వాకం అంటే బాగా తియ్యగా ప్రియంగా మాట్లాడడమని అర్థం. నిజాల్ని నిర్భయంగా చెప్పినందుకు ఈ పదం వాడుండవచ్చు. ఇక లోకాయతం అంటే లోకమంతా నిండి వున్నదని భావం. ఉద్యమ విస్తరణకి భయపడి మతోన్మాదులు తగిలించిన పదం కావచ్చు. చార్వాక లోకాయతాలు శుద్ధ భౌతికవాదాలు. సామాన్యుల్ని మత క్రతువులంటూ, కర్మకాండలంటూ దోచుకుతింటూన్న మతగురువులపై ఇవి తిరుగుబాటు ప్రకటించాయి. మత అహంకారాన్ని తుత్తునియలు చేసి చీల్చి చెండాడాయి.

మతాలన్నీ తమని నమ్మని వారిపై కర్కశంగానే ప్రవర్తించాయి. ఆంక్షాల అవసరం లేకుండానే అవిశ్వాసులందరినీ అంతమొందించమనే బోధించాయి. మతాలకతీతంగా మనిషనేవాడు వుండకూడదనే వికారం వాటిది. అందుకే పురాణాల్లో చార్వాకుల్ని అనరాని మాటలంటూ క్రూరంగా చిత్రించడం జరిగింది. బానిసత్వానికి ప్రేరకమయిన భావవాదాన్ని ఆనాడే వణికించి మతానికి ముచ్చెమటలు పట్టించిన నాస్తికులయిన, అతి ప్రాచీన ఉద్యమకారులూ విప్లవ కాముకులయిన చార్వాకలోకాయత భౌతికవాదుల్ని మనసారా స్మరిస్తూ మతాతీత మానవత్వంలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను.

సత్యం - అసత్యం

అస్తిత్వంలోనున్నది సత్యం. అస్తిత్వంలో ఉన్నవనుకుని చేసే అభూతకల్పనలన్నీ అసత్యం. సత్యానికి శాస్త్రవిజ్ఞానం ప్రాతిపదిక, అసత్యానికి అజ్ఞాన అనాలోచనలే ఆధారం. గతంలో మానవుడు చేసిన అనాలోచన ఫలితంగా మతం ఉద్భవించింది. మనిషి మనసుని అజ్ఞానాంధకారాలతో ఆక్రమించింది. దేవుడనే ఒక అనస్తిత్వ అంశాన్నే సత్యమంటూ నమ్మమని మనిషిని భక్తికి బానిసను చేసింది. అసత్యాన్ని సత్యంగా ప్రచారం చేయడంవలన సత్యశోధన కుంటుపడి పిచ్చి బోధనలు పెరుగుతాయి. వాటి పరిమితి మితిమీరితే అది ఉన్మాదంగా మారుతుంది. ప్రస్తుతం మతాలన్నీ ఆ స్థితిలోనే ఉన్నాయి. మనిషి మనిషిలా జీవించడానికి మానుషత్వం కావాలి. మనిషి బానిసలా జీవించడానికి అతడికి ఇప్పటికే పశుత్వము, దైవత్వమూ రెండూ పరిధికి మించి అందుతున్నాయి. అందుకే మతస్థులుగా, మృగస్తులుగా కాకుండా మనుషులుగా జీవిద్దాం. అసత్యాలు, అర్ధ సత్యాలతో సరిపుచ్చుకుని సోమరిగా బద్ధకం భావనలకి తావివ్వకుండా సత్యాన్వేషకులుగా సాంఘిక గతికి ప్రేరణ కావిద్దాం.

భగవంతుడికి ఒక బహిరంగ సవాల్!!

ఓనా ప్రియాతి ప్రియమైన ప్రీతిపాత్రమయిన పరమగౌరవనీయుడివయిన పూజనీయుడినయిన బోడి దేవుడా,

నీ కోసం నిరంతరం దేవులాడి దేకులాడి పాకులాడుతున్న కోట్లాదిమంది బోకు భక్తుల పీకులాటల్ని పట్టించుకోకుండా ఉదయం లేచిన దగ్గర్నించి నువ్వేం ఊడబొడుస్తుంటావన్న ధర్మసందేహంతోనే ఈ ప్రశ్నావళిని ప్రారంభిస్తూ సందేహాల్ని నీకు సమర్పించుకుంటున్నాను స్వామీ.

ఎక్కడో ఇరుకుబొక్కల్లో దాక్కుని నువ్వు సృష్టి-స్థితి-లయల్ని నడుపుతుంటావన్న నగ్నమయిన అసత్యాన్ని అక్షరబద్ధంగా బద్దలుకొట్టి నీ పేరుతో జరుగుతున్న బురిడీల్ని, దోపిడీల్ని నివేదించడమే తప్ప ఎవరినీ కించపరిచేలా నినదించడం నా భావం కాదు ప్రభూ.

ఈ ప్రపంచాన్ని ఎప్పుడు ఎలా ఎందుకు దేంతో చేసావ్ దేవుడా? ఇదంతా చేయక మునుపు నువ్వెక్కడుండేవాడివి దేవుడా? అక్కడేం పీకే వాడివి దేవుడా. ఇంతకీ నువ్వెప్పుడెక్కడెలా పుట్టావ్ దేవుడా? నీకు నువ్వే పుట్టావా ఇంకెవరికయినా పుట్టావా దేవుడా?

ఆడా-మగ లేకుండా సృష్టి సాధ్యం కాదని తెలిసే చచ్చినట్లు నువ్వు కూడా ఉభయలింగాల్ని మొదట వునికి లోనికి తెచ్చావా దేముడా? ఇంతకీ నువ్వు ఆడా? మగా? రెండూ కానివాడివా స్వామి? ఈ మూడు కాకుండా మరేదయినా అయితే సెలవివ్వు భగవాన్?

నువ్వు మనిషిని మాత్రమే సృష్టించావా లేక మనసుని కూడా సృష్టించావా? మనిషిని మాత్రమే సృష్టిస్తే అతనికి నచ్చినట్టు అతడుంటాడు. మధ్యలో నీ ప్రమేయం దేనికి దేవుడా? లేక మనసుని కూడా నువ్వే చేస్తే అతడి మంచి చెడులన్నీ నువ్వు చేయిస్తున్నట్లే కదా బాస్?

వందల ఏళ్ళ క్రితం మా చార్వాకులు అడిగిన ప్రశ్నలు మొదలుకుని వందేళ్ళకు పూర్వం మా గురజాడ గిరీశం నిన్ను కడిగేసిన ఉదంతం వరకూ నీ ముఖాన సున్నం కొట్టి నీ నెత్తిన మొట్టికాయ్ మొట్టిన మహనీయులెందరో పుట్టిన పవిత్రమయిన గడ్డ ఇదని నీకు తెలియదా బ్రదర్?

కులాలనేవి నీ కుటిలత్వమా లేక దోపిడిదారుల కుహనత్వమా కనిష్టా? మతాలనేవి నీ మానసిక జాడ్యాలా లేక మానవ వైకల్యాలా వివక్షా? ఆకారమేలేదని

వాదించే నీకిన్ని వికార ప్రాకారాలెందుకు ప్రభూ? సర్వవ్యాపకుడివయిన నీకిన్ని సొగసులెందుకు స్వామి?

సమాజంలో ఆకలి, అసమానతలు, అంటరానితనం అన్నీ మా ఆచారాలా మీ పైత్యాలా గురువర్యా? సర్వశక్తివంతులయిన మీకు చెడుని లేకుండా చేయడం సాధ్యం కావడం లేదా సార్? మంచినీ, చెడునీ కూడా మీరే సృష్టించడం జరిగిందా దేవుడుగారు?

అలా అయితే అసలు చెడనేది లేకుండా మంచినే సృష్టించొచ్చు కదా బ్రదర్? అలా కాక చెడుని కూడా మీరే చేస్తే వారు చేసే పనులకి చెడ్డవార్ని బాధ్యుల్ని చేయడం ఎంతవరకు సబబు సార్? ఇష్టమొచ్చినట్లు మమ్మల్ని పుట్టించి ఆడించే అధికారం నీ కెవరిచ్చార్రా?

వేల సంవత్సరాలుగా వున్నవాడిని ఇంకా వున్నవాడిగా లేనివాడిని మరింత బికారిగా మధ్యతరగతి ప్రజల్ని చచ్చు అవకాశవాదులుగా చేసి తమ పబ్బం గడుపుకుంటున్న మత గురువులకీ, రాజకీయ జలగలకీ, అండగా ఉంటూ పెట్టుబడిదారుల గత్తర సొమ్ముకు అమ్ముడుపోవడమే నీ పనా మాలిక్. నీకు సిగ్గూ, ఎగ్గూ వుంటే ఇప్పటికయినా మనుషుల్ని స్వతంత్రాలోచనా పరుల్ని చేసి సమానత్వ సాధనకి సన్నద్ధుల్ని చేయి స్వామీ.

శ్రమేజనాః సుఖినోభవంతు!

Human Society is born in the shadow of religions fear, and in that stage the suppression of heresy is a sacred social duty. Then comes the rise of a priesthood, and the independent thinker is met with punishment in this world and threat of eternal domination hereafter. Even today it is from the religions side that the greatest danger to freedom of thought comes. Religion is the last thing that man will civilise.

– Chapman Cohen

మదర్ థెరిసా కాదు మాయదారి మైసమ్మ!

మదర్ థెరిసాగా పేరు మార్చుకున్న ఏగ్నెస్ గోనెగ్జీ బొజాహు 1910లో యూరప్‌లోని మాసిడోనియాలో గల ఉస్కుబ్ పట్టణంలో పుట్టింది. 15వ ఏటే కేథలిక్‌గా మారి ఐర్లాండ్ వెళ్ళింది. కొన్నాళ్ళలో ఇండియావచ్చి టీచర్‌గా పనిచేసి తర్వాత స్వచ్ఛంద సంస్థను స్థాపించింది. ఆమె దివ్యమయిన చేతిస్పర్శతోనే అనేక దీర్ఘకాలిక మొండి వ్యాధులు నయమయ్యాయని మనల్ని నమ్మించే ప్రయత్నం చేసే ఆమె భజన సంఘాలు, ఇంతకీ ఆమె చేసిన సేవ ఏపాటిదో, సమాజానికి దానివల్ల వొనగూడిన దేపాటిదో చెప్పవు. మొదట్నుంచీ మనం వ్యక్తుల్ని మహాత్ముల్ని చేయడానికే అలవాటు పడ్డాం కానీ మనుషులుగా చూడడానికి ఇష్టపడలేదనడానికి థెరిసా జీవితమే ఉదాహరణ!

ప్రపంచంలోనే ప్రముఖ వైద్య విజ్ఞాన పత్రిక 'లాన్సెట్' సంపాదకులయిన డాక్టర్ రాబిన్ ఫ్యాక్స్ 1991లో థెరిసా ధార్మిక సంస్థల్ని కలకత్తాలో సందర్శించాడు. అక్కడి హాస్పత్రుల్లో పిల్లలకు నొప్పుల్ని తగ్గించడానికి వాడే అత్యవసరమైన మందులతో సహా కనీసం స్టెరిలైజ్ చేసిన సిరంజీలు కూడా లేకపోవడం చూసి విస్తుపోయాడు. ఇదేంటని మదర్‌ని ప్రశ్నిస్తే అన్ని జబ్బులనూ తాము ప్రార్థనలతోటే నయం చేస్తామని చెప్పిందామెగారు. 1983లో ఒకసారీ, 1989లో మరోసారి ఆమెకి గుండెపోటొచ్చినప్పుడూ, 1991లో నిమోనియాకి గురయినపుడూ, 1997లో చేతి ఎముక చిట్లినప్పుడూ కలిసొచ్చిన ప్రార్థనల్ని కాదని ఖరీదయిన కార్పొరేట్ వైద్యాన్ని ఈమె ఎందుకాశ్రయించిందో మరి!

మదర్ థెరిసా వద్ద సుమారు పది సంవత్సరాలు పనిచేసిన సుసాన్ షీల్డ్స్ అనే ఆవిడ అనేక విస్మయకర వాస్తవాలను వెల్లడించింది. మదర్ థెరిసా అక్రమాలను గురించి వులెన్ వెబర్ అనే ఆయన 1997లో 'స్టెర్న్' అనే జర్మన్ పత్రికలో కథనాలు ప్రచురించాడు. మదర్ థెరిసా బోధనలూ, ప్రేరణలూ అన్నీ మత మార్పిడికి సంబంధించినవేనంటూ భారత్‌కి చెందిన ధీరుషా రాసాడు. సునంద దత్తా అనే జర్నలిస్టు కూడా థెరిసా అన్యాయాలపై అనేక వ్యాసాలు రాసాడు. అరూప్ చటర్జీ అనే ఆయన 2003లో విడుదల చేసిన 'అంతిమ తీర్పు' అనే తన పుస్తకంలో మదర్ స్వచ్ఛంద నిధుల నిర్వాకాల్ని తీవ్రంగా దుయ్యబట్టారు!

ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని సిగ్గులేకుండా సమర్థించిన థెరిసా, అందుకు బదులుగానే భారతరత్న పొందింది. తమ దేశపు బ్యాంకులలో అపారమయిన ధనాన్ని

దాచుకున్నందుకు అమెరికా ఆమెకి 1998లో గౌరవ పౌరసత్వాన్ని కూడా ప్రసాదించింది. ప్రపంచ వ్యాప్తంగా ఆమె పొందిన విరాళాలు వేటికీ ఈనాటికి కూడా లెక్కాపత్రం లేవు. ఉద్యోగుల పాలిటి యముడయిన మెగా పబ్లిషర్స్ అధిపతి రాబెర్ట్ మాక్స్‌వెల్ ఆఫ్రికా హైతిదేశపు నియంతయిన జీన్‌క్లాడ్ దువాలియర్, 1980లో 200 కోట్లు ప్రజల సొమ్ము మింగేసినందుకు శిక్షపడితే మదర్ వెనకేసుకొచ్చిన చార్లెస్ కీటింగ్‌లు థెరిసా ధార్మిక సంస్థలకి శాశ్వత నిధి ప్రదాతలన్న నిజం మనం మర్చిపోకూడదు!

బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో పాకిస్తాన్ సైనికులచేత మానభంగాలకి గురికాబడిన గర్భవతులయిన లక్షలాది మహిళలు గర్భస్రావం కొరకు ఆమెని ఆశ్రయిస్తే అవి దైవ ప్రసాదితాలంటూ చెప్పిందీ టక్కులాడి. భోపాల్ విషవాయువు ప్రమాదం జరిగిన వెంటనే ఆఘమేఘాల మీద థెరసా అక్కడ కెళితే ప్రజల కోసమేననుకున్నవారంతా ఆమె వెళ్ళింది ఆ దుర్ఘటనకి కారణమయిన కార్బైడ్ కంపెనీ నీచుడ్ని కాపాడడానికని తెలిసి ముక్కున వేలేసుకున్నారు. చనిపోయేనాటికి ఒక్క న్యూయార్క్ బ్యాంక్‌లోనే 50 కోట్ల డాలర్లు పోగుచేసిన ఈ కిలాడీపై క్రిస్టోఫర్ హిచెన్స్ అనే విలేఖరి తారీఖ్ అలీతో కల్సి ఒక లఘుచిత్రాన్ని కూడా నిర్మించాడు.

1994లో నవంబర్ 8న బ్రిటన్‌లోని ఛానల్-4లో మొట్టమొదటిసారిగా ప్రదర్శింపబడిన ఆ సంచలన చిత్రం పేరు "నరకం యొక్క దేవత!"

(హేతువాదం పత్రికలో వచ్చిన వ్యాసం,
రేషనలిస్ట్ వాయిస్ పత్రికా రచనల ఆధారంగా)

"ప్రశ్నించడానికి వీలులేనిది ఒకటి వుందనుకోవటం మూఢ నమ్మకం... ఆ దృష్టి భగవంతుడి పట్ల వున్నా ఒకటే, హేతువాదం పట్ల వున్నా ఒకటే, సైన్సు పట్ల అయినా సరే. ఉండకూడనిది మూఢ నమ్మకం - నమ్మకం కాదు."

- గోపీచంద్
పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా

వైద్యులకో విజ్ఞప్తి

వైద్యమనేది వ్యాపారంగా మారిన తర్వాత వైద్యుడికి రోగికి మధ్యగల అన్యోన్య సంబంధాలు అప్రయత్నంగానే ధ్వంసమయ్యాయి. ఈ రోజు అవి ఒక వ్యాపారస్తుడికీ – వినియోగదారుడికీ నడుమకల బంధాలుగా మాత్రమే నిర్వచించవీలౌతాయి. పరిణామ క్రమంలో పరిణితి పెంపొందించుకుని మనిషి సముపార్జించిన శాస్త్రాలలో వైద్యం ప్రముఖమైనది. ఎన్నో పురాతన పరిశోధనలూ, ప్రమాదకరమయిన ప్రయోగాలు వైద్యవృత్తిని పవిత్రతకి ప్రతీకగా భావించేలా చేసాయి. ముఖ్యంగా మన దేశంలో వైద్యున్ని నారాయణుడిగా చూసే సంస్కృతి వుంది. అంతటి మహోనీయమయిన వైద్య చరిత్రకి ఈనాటి దుస్థితి దేనికి దాపురించిందనేది ఆలోచించాల్సిన అవసరం మనందరి మీదా ఉంది. "రోగం అనేది భాగ్యవంతుల అభినయం మాత్రమే. రాజకీయ అర్థశాస్త్రాన్ని అనుసరించి ఆ విలాస పదార్థంపై వీలైనంత ఎక్కువ సుంకం వసూలు చేస్తూ వుండాలంటాడు" ప్రేమ్‌చంద్ కథల్లోని ఒక దళారీ వైద్యుడు. ఈనాటి మన వైద్యులు భాగ్యులు – అభాగ్యులనే బేదం లేకుండా తమ దగ్గరకొచ్చిన రోగిని బాదేయడమే పనిగా పెట్టుకున్నట్లు తోస్తోంది. గతంతో పోలిస్తే అభివృద్ధి చెందిన అత్యాధునిక వైద్య విధానం సమాజంలోని ధనిక – పేద తేడాల్ని మరింత స్పష్టంచేసి కలవారి కొమ్ముకాస్తూ సామాన్యుల్ని ముంచేసిందనేది యదార్థం. మన దేశంలోని గ్రామీణ గిరిజన ప్రాంతాల్లోను, పట్టణ, నగర మురికి వాడల్లోను జీవిస్తోన్న అత్యధిక శాతం మందికి కనీస వైద్య సదుపాయాలు లేవు సరికదా వారిలో 95% పోషకాహార లోపం, దోమకాటు జ్వరాలతో మరణిస్తున్నారంటే నాగరిక వైద్య ప్రక్రియలు ఎవరికోసం రూపొందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. స్వదేశీ, విదేశీ వైద్య కళాశాలలు భావివైద్యుల్ని మందికి సేవ చేయడానికి బదులు మందుల కంపెనీల దళారులుగా వ్యవహరించేలా తయారుచేస్తున్నాయేమోననే ప్రశ్న ఊరికనే తలెత్తింది కాదు. ఎందుకంటే ఆధునిక వైద్యుల అర్హత అతడు రాసిన మందులలోనూ, సూచించిన ఎక్స్‌రే – స్కానింగ్‌లలోనూ, చేయించిన షుగరు–బీపి–ఇతర రక్త పరీక్షల్లోనూ, పంపించిన ఇతర వైద్యుల నుంచీ అతడి కందిన కమీషన్ల ఆధారంగా మాత్రమే నిర్వచించగలుగుతున్నాం. అందుకే, "గతంలో రోగికి డాక్టరు అందించే సేవపై అతని నిపుణత, హోదా ఆధారపడి వుండేది... ఇప్పుడు డాక్టరు వసూలు చేసే ఫీజు ననుసరించి అతని హోదా నిర్ణయమవుతోంది. ఖరీదైన ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవడం సామాజిక హోదా (Status Symbol) కు చిహ్నంగా మారిపోయిందం"టారు. ఎస్.ఎస్. తినైకత్.

స్వీయ నియంత్రణనేది లోపించడం ఏ గౌరవనీయ వృత్తికయినా ఆత్మహత్యా సదృశ్యం. వైద్యవృత్తి కూడా అందుకు మినహాయింపు కాదు. ఇదే విషయాన్ని వివరిస్తూ "ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA) వంటి వృత్తిపరమైన సంస్థలు ప్రధాన సమస్యల్ని పట్టించుకోకుండా ఔషధ తయారీ పరిశ్రమలతో కుమ్మక్కై పనికిమాలిన వైద్య సదస్సుల నిర్వహణ పట్ల మాత్రమే ఆసక్తిని కనబరుస్తున్నాయంటారు" అరున్‌బాల్. మెడికల్ రిప్రజెంటేటివ్‌లు కంపెనీల లాభార్జన కోసం హుందాగా ఆంగ్లంలో అప్పజెప్పుతున్న అత్తెసరు జ్ఞానానికి డాక్టర్లు ఎరగా మారవలసిన దౌర్భాగ్యస్థితి ప్రస్తుతం నెలకొని ఉంది. అంతే కాకుండా తన వద్దకి వచ్చిన రోగిని గౌరవించాల్సిన వైద్యుడు అతడ్నొ జీవచ్ఛవంలా చూడడం సాధారణమైపోయింది. చికిత్స జరుగుతున్నంత కాలమూ, బహుశా జీవితకాలంలో కూడా తనకొచ్చిన రోగం, దాని నియంత్రణకి అనుసరించిన పద్ధతులు, పరిష్కార మార్గాలపై కనీస అవగాహన కూడా రోగికి ఉండడం లేదనేది స్పష్టం. "బానిసలకు వైద్యం చేసే డాక్టరు తన రోగికి సంబంధించిన ఏ సమాచారాన్ని చెప్పడు. అతడు ఒక కర్కశ నియంతలా మాత్రమే ఆదేశాలు జారీ చేస్తాడు. అదే స్వేచ్ఛా జీవులకి వైద్యం చేసే డాక్టరయితే సదరు జబ్బు విషయమై క్షుణ్ణంగా చర్చించిన పిదపే చికిత్సకు పూనుకుంటాడని "శతాబ్దాల క్రితం తత్వవేత్త ప్లేటో మాటల్ని పోల్చి చూస్తే మనం జీవిస్తోంది బానిస వ్యవస్థలోనా లేక ప్రజాస్వామ్య సమాజంలోనా అనే సందేహం తప్పక వస్తుంది. నాగరిక సమాజంలో వైద్యవృత్తిని స్వీకరించడం వ్యక్తిగత లాభాపేక్షతో సొంత ఆస్తిని మితిమీరి పెంచుకుందామనే కాంక్షతోనే కాని, ఏ మాత్రం సామాజిక స్పృహతో కాదన్నది నిరూపితమవుతోన్న వాస్తవం. నార్మన్ బెతూన్, కొట్నిస్ లాంటి అసాధారణ వైద్యరంగ యోధుల్ని గురించి చరిత్రలో చదివి మర్చిపోవడం మినహా మన విద్యార్థులు తీసుకునే స్ఫూర్తి మృగ్యం. అలాగే తన వైద్య విద్యని అట్టడుగు వర్గాల సంక్షేమానికి వినియోగించడమే కాకుండా వ్యవస్థకి సైతం చికిత్స చేసేందుకు జీవితాన్ని త్యజించిన చేగువేరాలాంటి యువ వైద్య ధీరుల గురించి సైతం మన వైద్యులు తెలుసుకున్నది శూన్యం. సాంఘిక చైతన్యానికి చిరునామాగా ఉండవలసిన వైద్యవృత్తి, విద్యార్థి దశలోనే వెర్రితలలు వేసే విదేశీ వికార సంస్కృతి వైపు పరుగులు తీయడం ప్రగతిని కుంటుపరిచి వినాశనం దిశగా వ్యవస్థని తీసుకెళ్ళడానికేకానీ వేరు కాదు. నిజంగా ప్రభుత్వాలకీ, ఇతర వైద్యులకీ ప్రజారోగ్యంపై అంత శ్రద్ధే ఉంటే ఈ రోజు ప్రతి పట్టణంలోనూ పదుల సంఖ్యల్లో పుట్టగొడుగుల్లా ప్రై'వేటు' ఆసుపత్రులు అవతరించేవే కావు. అందుకే "దశాబ్దాల వైద్యరంగం పూర్తిగా

వ్యాపారస్తుల చేతుల్లోకి వెళ్ళి సామాన్యులకు అందని మామిడిపండుగా మారటం వల్లనే పేదలు తండోప తండాలుగా స్వస్థత సభలను, స్వామీజీలను ఆశ్రయిస్తున్నారంటాడు" ఒక వేత్త. సాటి మనిషి ప్రాణాల్ని కాపాడే అద్వితీయ నైపుణ్యం మీ సొంతం, ఆ విద్యని ఏ మేరకు మీరు సఫలీకృతం చేస్తున్నారో మీ అంతరాత్మని అడుక్కుంటే మంచిది. "వైద్యమనేది ఫక్తు వ్యాపారంగా అతి తక్కువ కాలంలోనే లాభాలను ఆర్జించి పెట్టే పరిశ్రమగా రూపొందింది. మంచోచెడో డబ్బు సంపాదనే ప్రాధమిక సూత్రమైపోతోంది. డాక్టర్ దగ్గరికి వెళ్ళడానికి పీడిస్తున్న జబ్బుకన్నా ఎక్కువగా రోగి భయపడాల్సి వస్తోందని" సాక్షాత్తూ మహారాష్ట్ర రిటైర్డ్ జడ్జి జస్టిస్ సురేష్ సెలవిచ్చారంటే పరిస్థితి తీవ్రత సులువుగానే అర్థమవుతుంది. వైద్య వ్యాపారంపై Market, Medicine and Malpractice అనే పుస్తకంతో ధ్వజమెత్తిన అమర్ జెసాని సైతం, "మెజారిటీ డాక్టర్లు కేవలం మెడికల్ రిప్రజెంటేటివ్‌ల మీదనే ఆధారపడాల్సి వస్తోంది... మందుల కంపెనీల మస్కాకు లొంగిపోయే డాక్టరు తాను పేషెంటుకు సూచించే మందు ధరెంతుంటుందో తెలుసుకోకుండా రాసేస్తున్నాడు. మందుల వాడకానికి డాక్టర్ దగ్గర ఎటువంటి హేతుబద్ధమైన ప్రమాణాలు ఉండడం లేదు" అంటూ తన విచారాన్ని వ్యక్తం చేసారు. ఇక గతంలోలా కుటుంబ వైద్యుడు (Family Doctor) ని నిలుపుకునే అవకాశం కూడా రోగికి తారుమారైపోతోంది. అందుకనే "కుటుంబ వైద్యుడికి – పేషెంట్లకి మధ్య వున్న సంబంధాలు ప్రస్తుతం కనుమరుగైపోతున్నాయి. ఈ స్థానంలో వ్యాపార దృక్పధం, వ్యక్తిగత సంబంధాల స్థానే డబ్బు సంబంధాలు, పరాయితనం, భౌతిక భోగలాలసత్వం డాక్టర్లలో ప్రబలుతున్నాయి" అంటారు. N.H. అంత్యా. ఇది ఇలాగే కొనసాగితే 'Poets are liers' అన్నట్లు "Doctors are Dangerous" అనే అభిప్రాయానికి జనశ్రేణులొస్తే అది వారి తప్పనుకోవడం మన తప్పు. కాబట్టి ఒక్కసారి ఆలోచించండి. వైద్య విద్యార్థిగా మీ స్థితీ, ఇప్పటి మీ ఆస్తి అంతరాత్మతో అంచనా వేసుకొండి. నిత్యావసరాలు మొదలుకుని నిత్యం బతుకే భారమయిన మాకు ఉత్తి పుణ్యానికే మిమ్మల్ని నిందించడం పనికాదని తెలుసుకోండి. మీ జీవితకాలంలో నిస్వార్థంగా ఎన్ని జీవితాల్ని నిలబెట్టి ఉంటారో ఆలోచించుకోండి. బాధల్ని తప్పించినందుకో, ప్రాణహాని తొలగించినందుకో రోగి సంతోషంతో సమర్పించుకునేదానికన్నా, ఎన్నిసార్లు పీడించి వసూలు చేసే ఫీజు భవిష్యత్తులో ఏదో రూపంలో మిమ్మల్ని హెచ్చరిస్తుందని తెలుసుకోండి. మీ లాభాలకర్థం ప్రజల రక్తమేనని గుర్తించండి. యదార్థ జీవన దృశ్యాన్ని చూడలేని మీ విజ్ఞత వ్యర్థమని గమనించండి. మారండి.

శంకర్‌గుహ నియోగి

"ప్రజల్ని నడిపించే వ్యక్తికి ప్రత్యేక నిర్వచనమంటూ ఏమీ లేదం"టాడు హోవర్డ్ ఫాస్ట్ 'స్పార్టకస్" అనే అద్భుతమైన నవల్లో. నిర్వచనాలు నాయకులకే పరిమిత మౌతాయి. అందుకే అసామాన్యులందరూ అనిర్వచనీయులుగానే ఉంటారు. అలాంటి అసాధారణ వ్యక్తి గురించి తెలుసుకోవడానికి కూడా తెగువుండాలి. భావాల బిగువుండాలి. మానవాళి మంచిని కాంక్షించే తీవ్రమైన తపనుండాలి. ఒక మనిషి మహనీయుడిగా మారితే ఎలా వుంటుందో మూర్తీభవించిన 'శంకర్‌గుహ నియోగి' వ్యక్తిత్వం గురించి వింటుంటే సరిగ్గా అలానే ఉంటుంది.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో డార్జిలింగ్ వద్ద జుల్పాయిగురిలో 18.09.1942న పుట్టిన శంకర్‌గుహ నియోగి తల్లి మరణానంతరం 1961లో మేనమామ ఇంటికి దుర్గ్ వచ్చాడు. చిన్నా చితకా ఉద్యోగాలు చేస్తూ డిగ్రీ పూర్తి చేస్తే భిలాయ్ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం దొరికింది. అక్కడే బ్లాస్ట్ ఫర్నేస్ యాక్షన్ అనే కార్మిక సంఘాన్ని స్థాపించి పోరాట పటిమను రచించాడు. ఫలితంగా ఉద్యోగం ఊడింది. అనేక నిర్భందాలు, చిత్ర హింసలు ఎదురొచ్చాయి. 1968లో మొదటిసారి అరెస్టయిన నియోగి ఎమర్జెన్సీ సమయంలో 13 నెలలు జైల్లో ఉన్నాడు. కార్మికుల ప్రయోజనాల కోసం అహర్నిశలూ తపిస్తూ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ చత్తీస్‌ఘడ్‌లో అనేక వెనుకబడిన ప్రాంతాలు తిరిగాడు. వ్యవసాయ కూలీగా, మట్టి పనివాడిగా, చేపలు పట్టేవాడిగా, గొర్రెల కాపరిగా, పశువుల వ్యాపారిగా అనేక అవతారాలెత్తాడు. ఆదివాసీ గిరిజనులకి అత్యంత ఆత్మీయుడైనాడు. దల్లీ రాజ్‌హరా పట్టణంలో మార్చి 3, 1977లో చత్తీస్‌ఘడ్ మైన్స్ శ్రామిక సంఘ్(సి.ఎం.ఎస్.ఎస్) ని స్థాపించాడు. సాంప్రదాయక ట్రేడ్ యూనియన్లలా కాక దీన్నొక ప్రత్యామ్నాయ ప్రజా సంక్షేమ సంఘంగా నిర్మించాడు.

1982లో చత్తీస్‌ఘడ్ ముక్తి మోర్చా (సి.ఎం.ఎం.)ని స్థాపించి మద్యపానానికి వ్యతిరేకంగా ఉద్యమం నడిపాడు, "సంఘర్ష్ ఔర్ నిర్మాణ్", "విరోధీ నహీ వికల్ప్" అనే నిర్మాణాత్మక సూత్రాల్ని క్రమబద్ధీకరించి 1977 జూన్ 3న అక్కడ జరిగిన కాల్పుల్లో మరణించిన 11 మంది అమరుల జ్ఞాపకార్థం "షహీద్ హాస్పటల్"

(అమరుల ఆస్పత్రి) నిర్మింపజేసాడు. నియోగి ఆచరణ విస్తృతమౌతున్న కొద్దీ ప్రజాపీడకుల అణవేతలు కూడా అధికంగా కొనసాగాయి.

1968 మొదలుకొని 1991 వరకు 23 సంవత్సరాల కాలంలో 25 సార్లు నియోగిని జైల్లో నిర్భందించడం జరిగింది. ఈలోగా ఉద్యమం రాజ్‌నంద్‌గావ్, దుర్గ, దనిటోలా, గడ్చి రోలి ప్రాంతాలకు విస్తరించి భిలాయ్ చేరుకుంది. ప్రజల్ని నిద్రలేపే వారిని శాశ్వతంగా నిద్రబుచ్చడమే పెత్తందారుల ప్రధాన విధి. 'గ్రీన్ & రెడ్ ఫ్లాగ్ మూమెంట్'గా రూపొందిన నియోగి కార్యక్రమాల తాకిడికి గుత్త పెట్టుబడిదారులు వెర్రెత్తి పోయారు. ప్రభుత్వం జాతీయ భద్రత చట్టం క్రింద అరెస్టు చేయడమే కాక చత్తీస్‌ఘడ్ నుంచి నియోగిని బహిష్కరించింది.

విడుదలైన నియోగి, శత్రువు ఇక 'బుల్లెట్లతో మాట్లాడతాడని' చెప్పడమే కాక తనను హత్య చేయడానికి పధకం వేసిన వారి పేర్లను కూడా బహిరంగంగా ప్రకటించి అంతిమ సందేశాన్ని విడుదల చేసాడు. 1991 సెప్టెంబర్ 28న తెల్లవారుజామున 3 గం॥లకు సి.ఎం.ఎస్.ఎస్. కార్యాలయంలో నిద్రిస్తున్న నియోగిపై ఆరుగురు కిరాయి గూండాలు మెషీన్ గన్నులతో విరుచుకుపడి శరీరాన్ని జల్లెడపట్టారు. చత్తీస్‌ఘడ్ చరిత్రను కంటిచూపుతో శాసించిన శంకర్‌గుహనియోగి దారుణంగా హత్య కావించబడ్డాడు.

సహజ సంపదలు, ప్రకృతి వనరుల కోసం తలెత్తిన ఉద్యమాలు రాటుదేలిన యోధుల్ని జనాలకందించాయి. గురుగైసీదాస్, కబీర్‌పంత్, రమానంద్ పంత్ మొదలగు వారు భావోద్యమాల్ని ప్రచారం చేస్తే, వీర్‌నారాయణసింగ్, గుండాధుర్ భౌతిక విప్లవోద్యమాల్ని నిర్మించారు. ఈ రెండు మార్గాల్ని సమన్వయం చేయడానికి కృషి చేసిన అవిరామ ధీరుడు శంకర్ గుహ నియోగి. చత్తీస్‌ఘడ్ ఉద్యమాన్ని అన్నీ తానై అదిలించిన చుక్కాని అతడు. విధ్వంసంతో బాటు వినిర్మాణంపై, ప్రతికూలతతో పాటు ప్రత్యామ్నాయంపై పట్టు సాధించిన అద్వితీయ తాత్వికుడతను.

అందుకే పెట్టుబడిదారుల వొత్తిడికి ఏమాత్రం లొంగలేదు. కోటీశ్వరుడయ్యే అవకాశాలు పుష్కలంగా ఉండికూడా పొట్టకూటి కోసం తడుముకుంటూనే పోరాటం చేసాడు. ఒక రాష్ట్ర రాజకీయ భవిష్యత్తుని నిర్దేశించగల సమయంలో సైతం సగటు మనిషిగానే జీవించాడు. బహుశ అందుకేనేమో చనిపోయి చాలా సంవత్సరాలైనా సమాజంలోని జనాల్లో ఇంకా సజీవంగానే ఉన్నాడు. నియోగి ఒక వ్యక్తికాదు. ఒక ఆలోచనా ప్రవాహం. వ్యక్తుల్ని నిర్మూలించడం ద్వారా వాళ్ళ భావాలు నశిస్తాయి అనుకోవడం అలలకి వల వేసి సముద్రాన్ని చంపాలనుకోవడం లాంటిది.

ఆలోచించండి

మనిషి జీవితానికి మనమిచ్చే అర్థం బండెడు చదువు. బస్తీ ఉద్యోగం, బ్యాంక్ బాలెన్స్ మాత్రమేనా? మంచి జీవనమంటే మన దృష్టిలో కంప్యూటర్, కలర్ టివి, కార్లు, మొబైల్ ఫోనులేనా? అందరికీ అలవాటయిపోయిన రోగాల్ని అప్రయత్నంగా అనుసరించడమే మన ఆధునికతా? అంగీకరించబడిన పైత్యాల్ని ముక్కు మూసుకుని మూకుమ్మడిగా పాటించడమే మన నాగరికతా? బతకడానికి కావలసిన అవసరాలకి తిలోదకాలిచ్చి బహుళజాతి సంస్థల లాభాల కోసమే ఉత్పత్తి చేస్తున్న అవాంఛనీయ విలాస వస్తువుల అపరిమిత వినియోగాన్ని విపరీతంగా తలకు రుద్దుకోవడమే మన భవితా?

అనుక్షణం అంగాంగ అశ్లీల ఆకర్షణీయ ప్రకటనల్ని చొంగ కార్చుకుని వీక్షిస్తూ, జీవితాంతం కంపెనీల సరుకులు కొనడానికి మాత్రమే పనికొచ్చే గల్లాపెట్టలమా మనం? మనలో అమాంతంగా పెరిగిపోయిన అవినీతి స్వార్థాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం మనలోని చెడుకి మరొకరి తోడును కూడా కలగలిపి ఎవరిచేతో ఉద్ధరించబడతామని ఎదురుచూసే విరిగిపోయిన యంత్రాలమా మనం? భగత్‌సింగ్ ఉరి కంబమెందుకెక్కాడో, నేతాజి దేనికి నేలకొరిగాడో, అల్లూరి ఎవరి కోసం అంతమయ్యాడో పెడచెవిని పెట్టి ఫలానా సినిమా హీరో పిర్రలెలా ఊపాడో, హీరోయిన్ పిక్కలెలా చూపిందో తెలుసుకోవడమే మన పనా?

ఎదురింటి కంటె ఎత్తయిన డాబా ఎప్పుడు కడదామని, పక్కవాడి పొట్ట ఎలా కొడదామని, సాయం పొందిన వాడి పరువు ఎక్కడెక్కడ తీద్దామని, మనకంటే మంచివాడ్ని ఎలా చులకన చేద్దామని పైకి దేభ్యపు మొహం వేసుకొని ఇంకెంత కూడబెడదామని, అందరికోసం ఏదో అలౌకికమైంది, ఊడబొడుస్తున్నట్లు పనికిమాలిన ఫోజు ఎలా కొడదామని తీరిగ్గా ఆలోచించుకునే మనం, సమాజంలోని సమస్యలకి చరమగీతం ఎలా పాడాలో, వ్యవస్థలోని విషపు వికారాలను ఎలా విచ్ఛిన్నం చేయాలో, మన మానసిక రుగ్మతలను ఎలా రూపుమాపాలో జనంలోని సామాజిక జాడ్యాలకి జవాబెలా చెప్పాలో ఎన్నడైనా ఆలోచించామా?

ఈసారి జీతంలో పక్కకెంత తియ్యాలో, ఈ రాత్రి పక్కమీత సంతృప్తి ఎలా పొందాలో, ఈ మాటు పండక్కి బంగారమెంత కొనాలో, ఈ పూట మేతకి ఏ గడ్డి కరవాలో నిక్కచ్చిగా లెక్కలేసుకుని చచ్చిపోయే మనం ఈ రోజు నుంచి సమాజంతో కొంత సమయం గడపాలనో, ఈ రోజు నుంచి నిజాయితీగా బతకాలనో ఎందుకు కచ్చితంగా నిర్ణయించుకోకూడదో ఎప్పుడైనా ఆలోచించామా? లేదా తీరుబడిగా పుస్తకాలు కూడబెట్టుకునే మే'తా'వులుగా ఖరీదైన వస్తువుల్ని వీలైనంత ఎక్కువ పరిమాణంలో వినియోగించడమే వ్యవస్థలో మన 'హోదా'కి ప్రమాణంగా మనం భావిస్తున్నామా? ఆలోచించండి.

కూల్‌డ్రింక్స్ బారి నుండి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం!

తల్లి కడుపులో పిండంగా ఉండగానే కంపెనీ మందులకు అలవాటు చేసే ప్రక్రియ, అంతిమంగా వ్యవస్థలో వినియోగదారుల్ని తయారుచేసే వినిమయ సంస్కృతిని పెంపొందించడానికి పనికొస్తోంది తప్పితే మానవీయ కోణంగల వ్యక్తులుగా మనల్ని మలిచేందుకు కలిసిరావడంలేదు. ప్రజలకి అవసరమైన వస్తువుల్ని తయారుచేయడం ఎన్నడో మానేసిన కార్పొరేటు సంస్థలు, అవి ఉత్పత్తి చేస్తున్న చెత్త సరుకులు ప్రజలకి అవసరమని నమ్మించే వ్యాయామం ప్రసారమాధ్యమాల ద్వారా ఆకర్షణీయంగా చేస్తున్నాయి. **"వంకలేనమ్మ డొంక పట్టుకు వేలాడినట్లు"** అందరికి త్రాగునీరు అందించలేని ప్రభుత్వం కొన్ని కోట్ల మిలియన్ లీటర్ల భూగర్భ జలాల్ని ఈ కంపెనీలు తరలించుకుపోతున్నా కిక్కురు మనదు. రకరకాల పేర్లతో రంగురంగుల సీసాల్లో లభ్యమయ్యే ఈ దిక్కుమాలిన శీతలపానీయాల్లో ప్రమాదకరమైన పురుగు మందుల అవశేషాలు, భయంకరమైన రసాయన ఆమ్లాలు ఉన్నాయని తేలింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (హైద్రాబాద్), సెంటర్ ఫర్ సైన్స్ & ఎన్విరాన్‌మెంట్ ఇండియా (న్యూఢిల్లీ), కన్యూమర్స్ ఎడ్యుకేషన్ & రీసెర్చ్ (అహ్మదాబాద్), మొదలగు సంస్థలు ప్రయోగశాలల్లో కూల్‌డ్రింక్స్‌ని పరీక్షించి వాటిల్లో అనేక రోగకారక బ్యాక్టీరియా క్రిములున్నట్లు గుర్తించాయి. **"దబ్బిచ్చి జబ్బుల్ని కొనుకున్నట్లు"** మనం కొని త్రాగే, ఒక చిన్న కూల్‌డ్రింక్ సీసాలో మన ఇంట్లో బాత్‌రూమ్ టాయ్‌లెట్ శుభ్రం చేయడానికి సరిపోయే యాసిడ్ ఉంది. మన కడుపులు మరుగుదొడ్లు కాదు కాబట్టి, ఎవరికైనా ఇంకా అనుమానంగా ఉంటే ఆ డ్రింకులతో టాయ్‌లెట్ కడిగి చూడండి. ఒక్క సంవత్సరంలో ఆరువేలకోట్లు దండుకుంటున్న ఈ దోపిడీ సంస్థలు అబద్ధపు ప్రచారాల కోసమే నాలుగు వందల కోట్లు వెచ్చిస్తున్నాయి. వీటి దొంగ సొమ్ములకి అమ్ముడుపోయే సినీ, క్రీడాతారలు మాత్రమే సిగ్గులేకుండా ఈ విషాన్ని త్రాగమంటూ ప్రకటనల్లో నటిస్తున్నారు. కూల్‌డ్రింక్స్ తయారి సంస్థలు తమ పరిశ్రమ ద్వారా విడుదల చేస్తున్న వ్యర్థాల కారణంగా విపరీతమైన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. కూల్‌డ్రింక్స్ త్రాగడం వలన ఎముకలు చచ్చుబడటం, కాళ్ళ వాపు, షుగర్, గ్యాస్ట్రిక్, చిగుళ్ళు కుళ్ళిపోవడం, పళ్ళు పుచ్చిపోవడం, చర్మరోగాలు, స్థూలకాయం, అజీర్తి, వివిధ రకాల గుండెజబ్బులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, కేన్సర్ బారినపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఇప్పటికైనా నిజాలు గ్రహించి కూల్‌డ్రింక్స్ ముందు మనం మానేసి తరువాత ఇతరులతో మాన్పించి, దేశీయ చలువ పానీయాలైన, మజ్జిగ, పాలు, పెరుగు, లస్సీ, కొబ్బరినీరు, చెరుకురసం, నిమ్మరసం, తాటి ముంజులు, ఇతర ఫలరసాలతో వేసవి తాపాన్ని పారద్రోలుదాం. మనకి, మన పిల్లలకి హానిచేసే కూల్‌డ్రింక్స్‌ని స్వచ్ఛందంగా బహిష్కరిద్దాం.

విలేఖరులకో విజ్ఞప్తి - పాత్రికేయులకో పరామర్శ

"జర్నలిజం అంటే ఒక లక్ష్యంతో కథనాన్ని చెప్పడం వంటిది. ఆ లక్ష్యం ఏమిటంటే ప్రజలు ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన సమాచారాన్ని అందించడం"

– బిల్ కోవాక్, ది ఎలిమెంట్స్ ఆఫ్ జర్నలిజం

పూర్వం ప్రజలకు నిజాలు తెలియజేయడం కోసం ప్రాణాల్ని లెక్కచేయని సమాజ ప్రేమికుల్ని జర్నలిస్టుగాలుగా పిలుచుకునేవారు జనం. కానీ, ఈ రోజు జనాలకు నిజాలు తెలియకుండా చేయడం కోసం సమస్త భోగాలు అనుభవిస్తూ కుదిరినంతా కూడబెట్టుకునే ప్రజా విద్రోహుల్నే విలేకరులుగా చూడాల్సిన స్థితి వచ్చింది. వీలైనంత అధిక ధరకు అమ్ముడుపోవడమే విలేకరులకి ఉండాల్సిన ప్రాథమిక అర్హతగా చెలామణీ అవుతున్న వర్తమాన లోకంలో, ప్రజలు సమాజంలోని యదార్థాలను ఎన్నటికీ గ్రహించకుండా ప్రపంచాన్ని అపార్థం చేసుకోడానికి గాను తమ వంతు పాత్రను పోషించడం పాత్రికేయుల జీవిత పరమార్థమైపోయింది.

"జర్నలిస్టు అసమ్మతివాది, ఆక్షేపకుడు, సలహాదారు... వెయ్యి బయినేట్ల కంటే నాలుగు శత్రుపూరిత పత్రికలకు భయపడాలంటాడు" నెపోలియన్. ఈ రోజు పరిస్థితి తారుమారైంది. రిపోర్టర్లంతా 'పోర్టర్లు'గా తయారై, పత్రికా సంపాదకులకి సంపాదనే ముఖ్యమై మొత్తంగా జర్నలిజాన్ని 'జనరలైజ్' చేసి పాత్రికేయ వృత్తిని అవకాశవాదానికి పర్యాయపదంగా మార్చేయడం జరిగింది. అందుకే జర్నలిజాన్ని "SURVIVAL OF THE VULGAREST" (బ్రతకడం కోసం పాడు పనులు చేసే) వృత్తిగా నిర్వచించిన ఆస్కార్ వైల్డ్, "With regard to modern journalists, they always apoligize to one in private for what they have written against one in public" అంటూ జర్నలిస్టుల్ని దుమ్ము దులిపాడు.

"అధికారంలో వున్నవాడిని కాకా పట్టి పనులు చేయించుకోవడం రాజకీయంగా చెలామణీ అవుతూ వుంటే, అధికారంలో వున్నవాడి మీద బురదజల్లి వాడి ప్రత్యర్థి చేత పనులు చేయించుకుదొబ్బడం 'సంచలన జర్నలిజం'గా అమలవుతోందంటూ" నిజాన్ని మొహం పగిలేలా మూడు దశాబ్దాల క్రితమే చెప్పారు "ఎన్‌కౌంటర్ దశరధరామ్ బండారం" పుస్తక రచయిత. విజ్ఞాన సాంకేతిక విప్లవం లెక్కలేనన్ని న్యూస్ ఛానళ్ళని ప్రవేశపెట్టి, ప్రజల్ని పీడించే వాద్యాలుగా సమాచార మాధ్యమాల్ని మార్చివేసి పీడకుల్ని సమర్థించడమే మీడియా లక్ష్యంగా పనిచేయబట్టే ఈ మధ్యొక పత్రిక తెలుగు న్యూస్ ఛానళ్లనన్నింటినీ కట్టగట్టి "ఆర్మ్‌స్ట్రా బృందాల"తో పోల్చడం జరిగింది.

"Man is essentially a rational being. His basic urge is not to believe, but to question to know" అంటాడు ఎం.ఎన్. రాయ్. పాత్రికేయులు ప్రజలకి ప్రశ్నించడం నేర్పాలి, అనుసరించడం కాదు. మానవత్వాన్ని రగిలించాలే కాని బానిసత్వాన్ని కలిగించకూడదు. చాప్‌మెన్ కోహేన్ అనే ఆయన మతానికి సవాలు (Challenge to Religion) అనే తన రచనలో చెప్పినట్లు, సమాజంలో ఆలోచనాపరుల సంఖ్య ఎప్పుడూ అల్పంగానే ఉంటుంది. ఎందుకంటే "అత్యధిక శాతం మంది ఆలోచించరు. వంతపాడతారంతే. "(The majority do not think, they merely repeat only)

అలాంటి నిద్రావస్తలో మగ్గుతున్న వ్యవస్థని జాగృతపరచడమే జర్నలిస్టుల ధ్యేయం. సమాజంలోని ఆలోచనచాపరుల సంఖ్యను గణనీయంగా పెంచడానికి ప్రయత్నించడమే నిజాయితీ గల జర్నలిస్టులకుండాల్సిన నిజమయిన లక్ష్యం. అందుకే "Journalism is the present day world is more a mission than a profession' అంటారు ఆర్.ఎస్. మూర్తి. తన "An introduction to Journalism" పుస్తక ముందు మాటలో. "సృష్టిలో మనిషి ఉత్తమ పరిణామ స్థాయిని చేరే వరకు ప్రజలకు మహానుభావుల నాయకత్వం తప్పదన్న శేషేంద్రశర్మ గారి మాటలు ప్రజాపక్షం వహించే ఉత్తమ జర్నలిస్టులకు అన్వయించుకోవడం తప్పుకాదేమో.

"ఈ దేశంలో పక్కవాడి పేపరడుక్కుని చదివే ప్రతీ ఒక్కడూ పరాన్నభుక్కుడే" నంటూ సగటు పౌరుడ్ని గురించి చెప్పిన ప్రజాకవి ప్రభాకర్, "స్వయంగా శవాలే రాబందుల వద్దకి నడిచొస్తుంటే అంతకంతకూ పెరుగుతున్న అజ్ఞాన పర్వతం చిన్న బ్యాలెట్ పెట్టెలో యిమిడిపోతే, మళ్ళీ కోటీశ్వరుడి పుట్టలోంచి బుసకొట్టేదే ఈ దేశపు ప్రజాస్వామ్యమంటూ" గర్జించాడు. ఇటువంటి వ్యవస్థలో సగటు మనిషి ఆలోచనల్ని గాడిలో పెట్టవలసిన ప్రధానమైన బాధ్యతను భుజాన వేసుకోవలసిన జర్నలిజం, జంగిలి నాయకత్వానికి భజన చేయడానికి సిద్ధపడుతుండడం సాంఘిక అనారోగ్యానికి చిహ్నం.

"The magnitude of financial operations of the newspaper is turning journalism upside down" అంటూ 1897లోనే చెప్పిన లింకన్ స్టీఫెన్స్ ఈనాటి పాత్రికేయ వ్యాపారాన్ని చూస్తే బిక్క చచ్చిపోయేవాడనడంలో అతిశయోక్తి లేదు. "ఇతిహాసపు చీకటికోణం అట్టడుగునపడి కనిపించని కధల్ని", వెలికితీసేటంత స్ఫూర్తి, ఈరోజు ఏ పాత్రికేయుడి జీవితం నుంచైనా సామాన్యుడు పొందగలడా అని ప్రశ్న. 'మీడియా మాయాజాల' మనే పుస్తకంలో నోమ్‌చామ్‌స్కీ, ఎడ్వర్డ్ ఎస్. హెర్మన్లు అన్నట్లు "పక్రీకరించబడిన సమాచారాన్ని క్రమపద్ధతిలో ప్రజలపై కుమ్మరిస్తున్న" ఆధునిక జర్నలిస్టులకది అసాధ్యం.

నిజమైన జర్నలిస్టు నిరంతర విద్యార్థి, ప్రజా ప్రేమికుడు, సమాజ సేవకుడు అయి ఉండాలి. నిజాల్ని ప్రజలకి తెలియజెప్పే క్రమంలో ఎటువంటి ఒడిదుడుకులైనా సులభంగా ఎదురుకునేవాడు కావాలి. ఉన్న విషయాల్ని ఉన్నట్లు ప్రజలకి చెప్పడం కోసం ఎన్ని అవాంతరాలెదురైనా ఆగిపోకూడదు. ప్రగతిశీలమైన భావాలతో ప్రజాస్వామిక విలువల్ని సమూలంగా కాంక్షించే వ్యక్తిత్వం కావాలి. "Were it left to me to decide whether we should have a government without news paper or news papers without Government, I shall not hesitate a moment to prefer the later" అంటాడు జెఫర్‌సన్.

చరిత్రలో జర్నలిజానికి మనిషి ఇచ్చిన విలువ అమూల్యమైనది. అందుకే "The history of journalism is the story of man's long and arduous struggle for personal liberty and political freedom" అంటాడో వేత్త. మౌలికంగా మనిషి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం జరిపిన పోరాటాలతో ముడిపడి మాత్రమే జర్నలిజం చరిత్ర ఉంటుందనేది యదార్థం. "పత్రిక అంటే ఏమిటని అడిగాను, అప్పుడు ధ్వనించిందో అద్భుతమయిన స్వరం, నాలో సమస్త మానవ విజ్ఞాన సర్వస్వం నిబిడీకృతమవుతుంది. నేను భూతభవిష్యత్ వర్తమాన కాలాల దివ్యవాణిని, నేననుకుంటే వాటిని నిశ్శబ్ద విస్మృతి పధంలో సమాధి చేయగలను. నేను సంరక్షించినది ఎన్నటికీ నశించదు, నేను త్యజించినది ఎప్పటికీ లభించదు" అంటూ వ్యాఖ్యానిస్తాడు మౌంట్ గోమరి.

బహుశా "The spectator of all time and of all existence" అనే తత్వవేత్త ప్లేటో పేరడీ పత్రికకు సరిగ్గా సరిపోతుందేమో. పత్రికా స్వేచ్ఛను గురించి చెబుతూ "కాళ్ళు, చేతులు బాగానే పనిచేస్తున్నాయి కానీ మెదడు మాత్రం యింకా బానిసత్వంలోనే మగ్గుతోంది ("The work of arms and legs is free, but that of the brain is under tutelege") అంటాడు కార్ల్‌మార్క్స్ ఒకచోట. ఆధునిక జర్నలిజాన్ని అస్తిత్వం కోసం అడ్డమైన పనులు చేసేదానిగా అభివర్ణించిన ఆస్కార్‌వైల్డ్ రాతల్ని గుర్తుకుతెచ్చే ఈ వాక్యాన్ని నిజం చేసేలా ప్రవర్తిస్తూ వ్యవస్థలో నిష్క్రియాపరత్వాన్ని పెంచి పోషిస్తారో, లేక అభినవ జర్నలిస్టులుగా అవతరించి సమాజాన్ని స్పందింపజేస్తారో మీ యిష్టం.

చరిత్రను శాసించేవి త్యాగాలే కాని ద్రోహాలు కాదు!

మరో మాట

సరే. ఇవన్నీ నేను రాసిన కరపత్రాలు, వాటికథా చిత్రాలు. మరి నాపై వచ్చిన ఆరోపణల గురించి ప్రస్తావించకుండా ఈ అంకం పూర్తి కాదు. ఎందుకనంటే, అసలీ కరపత్రాల్ని అహంకారంతోనో, ఆర్థిక లావాదేవీల కోసమో ముద్రించాననే ప్రచారం ఒక వర్గం బలంగా చేస్తోంది. ఆ వర్గమే నా వ్యక్తిగత జీవితం గురించీ, నా సాంఘిక కార్యకలాపాల గురించి తోచిన పుకార్లు వ్యాప్తి చేస్తోంది. కచ్చితంగా ఈ వివరణ వాళ్ళకోసం కాదు. ఇది నా వాళ్ళకోసం. అందరికోసం అంకితమయిన అక్షరాలకి కష్టాలొచ్చినప్పుడు ఆదుకోవడానికి ముందుకొచ్చిన రక్షకుల కోసం. ప్రజాస్వామ్య పరిరక్షకుల కోసం. "ధైర్యమూ, నీతీ రచయితకు రెండు నేత్రాలు. నీతికి ధైర్యం, ధైర్యానికి నీతి పరస్పర పరివర్దకాలు. ఇవి లేని రచయిత గుడ్డివాడు ఏమి వ్రాస్తాడు? అతడి వ్రాతలు లోకానికి ఏ ఉపకారం చేస్తాయి?" అంటారు శేషేంద్ర శర్మ తన రక్తరేఖలో. వివేచించి రాయడమే కానీ – అకారణంగా ద్వేషించడం నా అక్షరాలకి తెలీదు.

"ప్రపంచంలో తమదంటూ ఏమీ లేనివాళ్ళకు ఇతర్లను ద్వేషించడానికి వ్యక్తిగత కారణాలు ఏమీ లేకపోవచ్చునుగానీ ప్రేమించడానికి హృదయమే సముద్రమై పుప్పొంగుతుంటుంది. ముఖ్యంగా తమలాంటి దరిద్రుల్ని, శ్రమజీవుల్ని ప్రేమించడానికి" అంటారు ఆలూరి భుజంగరావుగారు 'దిక్కుమొక్కులేని జనం' అనే తన నవల్లో. వ్యవస్థీకృతమయిన భావాలకి దాసులుగా వుంటూ, అనుస్యూత అభిప్రాయాలకి కట్టుబడినవారికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ప్రతిబంధకాలుగానే కనిపిస్తాయి. సదాచారవంతమైంది సాంప్రదాయమవుతుంది కాని శాస్త్రం కాదు. ఆచారాల్ని అంగీకరించింది అజ్ఞానమా, అర్థహీనజ్ఞానమో అవుతుందే కాని వాస్తవిక జ్ఞానం అవదు. "Orthodoxy means not thinking - not needing to think. Orthodoxy is unconsciousness" అంటాడు ఆర్వెల్. అందుకే, విజ్ఞానానికి వారసత్వ అనుకరణనేది గుడ్డిగా ఆపాదించేందుకు కుదరదు. బలవంతంగా రుద్దడం హేతుసహిత విజ్ఞానానికి విరుద్ధం.

"జిజ్ఞాసువుగా వుండటంలోనే జీవితానికి అర్థం, సార్థక్యం ఉన్నాయం"టాడు జాన్‌లండన్. నిరంతర యోచనాశీలతే మానుష ఔన్నత్యానికి ప్రతీక. వ్యవస్థీకృతమయిన ఆలోచనల్ని పాటిస్తున్న వ్యవస్థలో స్వతంత్ర జ్ఞానం ప్రమాదకరం. అందుకే, "it is very nearly impossible to become an educated person in a country so distrustful of the independent mind." అంటాడు జేమ్స్ బాల్డ్విన్. అదీకాక అధికార పాలనా యంత్రాంగం విషయంలో ఇది ఇంకా నిజం. లోక విరుద్ధంగా యదార్థాల్ని గురించి ఆలోచించేవాడెప్పుడూ లొంగి వుండడానికి అర్హుడు కాడు. Knowledge makes a man unfit to be a slave అంటాడు ఫ్రెడరిక్ డగ్లస్. దాని అర్థం ఇదే. జరుగుతున్నదానికి భిన్నమయిన దానికోసం శోధించడం అన్ని కాలాల్లోనూ సాహసంగానే చూడబడింది. నిబద్ధత గల అన్వేషకులు అందుకోసం పెద్ద మూల్యమే చెల్లించాల్సి వచ్చింది. "It is dangerous to be right in matters on which the established authorities are wrong" అంటాడు వోల్టేర్.

ఇంతకీ ఇదంతా ఎందుకంటే, మనం అంగీకరించని భావాల్ని కూడా ఆహ్వానించే స్వభావం మనం తప్పనిసరిగా కలిగి వుండాలన్న భావన తెల్పడానికే. ఎందుకంటే అత్యధిక శాతం మంది ఇతరుల అభిప్రాయాలకి బానిసలు. ముందు తరాలకి మూకీ నటులుగా తమనితాము జీవిత రంగంపై ప్రదర్శించుకుంటారు. "Most people are other people. Their thoughts are someone else's opinions, their lives a mimicry, their passions are quotations." అంటాడో వేత్త. ప్రజలు తమ స్వతంత్రాలోచనాశక్తిని పెంపొందించుకునేంతవరకూ, పాలకులు వ్యాప్తి చేసిన ఆలోచనల్నే తమ అభిప్రాయాలుగా భ్రమ చెందుతుంటారు. సమాజంలోని జనమంతా ఒకేలా ఆలోచిస్తున్నారంటేనే అసలు అందులో ఎవరూ ఆలోచించట్లేదని అర్థం. "If everyone is thinking alike, then no one is thinking" అంటాడు బెంజిమన్ ఫ్రాంక్లిన్.

ఈ కరపత్రాల సంకలనం వెలువరించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో నాపైనా, కుటుంబ సభ్యులపైనా అక్రమ కేసులు బనాయించారు. నేను ముందే సూచించిన వర్గంవారు నాపైనా కుటుంబంపైనా అవాస్తవాలతో కరపత్రాలు రాయించి పంపిణీ చేసారు. అనేకమంది భక్తితో పూజించే దేవుళ్ళని కించపరుస్తూ, సాక్షాత్తూ పరమేశ్వరుడినే ధిక్కరించానని రాసారు. మదర్ థెరీసానూ, ఆమె సేవనూ తూలనాడానని ఆరోపించారు. అవి మాత్రం నిజం. ఆనాడు ఆ భావాల్ని నేనలా వ్యక్తీకరించిన మాట యదార్థం. అయితే, మౌలికంగా ఈనాటికీ ఆ అభిప్రాయాలతో నేను విభేదించనప్పటికీ అప్పటి నా భాషాశైలిపట్ల వ్యక్తిగతంగా నాకే వ్యతిరేకత వుంది. "In our corrupt society the written world is always a lie" అంటాడు బెట్రాండ్ రస్సెల్ తన స్వీయ చరిత్రలో.

అంకిత భావం కలిగినవారి విషయం పక్కనపెడితే అమ్ముడుపోయేందుకే అంకితమయ్యే వ్యక్తిత్వాలకి కూడా సమాజంలో కొదవలేదు. అందులో భాగంగానే, నాపైనా కుటుంబంపైనా ఒక క్రమపద్ధతి ప్రకారం కుట్రపన్ని అణిచివేసే ప్రయత్నం చేసారు. ఇందులో ఆశ్చర్యపడాల్సిందేం లేదు. ఎందుకంటే, "క్రూరంగా వుండడం ద్వారానే పిరికితనం శక్తివంతంగా వుండగలదన్నాడు" కార్ల్‌మార్క్స్. తమ అస్తిత్వాన్ని అన్యాయానికి తాకట్టు పెట్టడానికి అలవాటుపడిన అక్రమార్కులకి అంతిమంగా సంపాదనే ధ్యేయమవుతుంది. ఆత్మిక సంబంధాలకంటే కూడా ఆర్థిక సంబంధాలే వారిని శాసిస్తుంటాయి. "మొత్తానికి సంపాదనే లక్ష్యంగా చూసుకునే మనుషులు ఎక్కువైన కొద్దీ వాతావరణమే దుర్భరమవుతుంది. సంపాదన ముందు తక్కిన విలువలు తేలికైననాడు జీవితం వూపిరాడదు" అంటాడు చలం.

చేసిన వాటిల్లోని తప్పుల్ని ఒప్పుకునే స్వభావం కలవారికి చేయని వాటిని చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంపై స్పందించే చేవ వుంటుంది. Who loves truth and liberty expects nothing, fears nothing, asks nothing and limits its ambition to cultivation of the letters అంటాడో వేత్త. అనుకున్నదానిని నిజాయితీగా ఆచరణ రూపంలో పెట్టడానికి గానూ ఆలోచించడానికి ప్రయత్నించే క్రమంలో వైరుధ్యాలు సహజం. అవి వైఫల్యాలు కావు. ఈ రోజుకీ ప్రత్యేకంగా ఏ వాదానికి నేను కట్టుబడిలేనని మొత్తుకుంటున్నా ఏదోక కుతిని నాకాపాదించే తత్వంగల వాళ్ళు ఎంతో మందున్నారు. నా అక్షరాలకి నాది కాని అర్థాన్ని జోడించి తమకి నచ్చిన పదాలతో నా గురించిన అపార్థాలకి తోవ చేస్తున్న వారికీ కొదవలేదు. "A stupid man's report of what a clever man says can never be accurate, because he unconsciously translates what he hears into something he can understand" అన్న రస్సెల్ మాటలు ఈ సందర్భానికి తగినవి.

ఈ రకమయిన ఆపదల్లో కూడా ఆదుకుని అన్ని విధాలా నాకు సహాయసహకారాలందించిన శ్రేయోభిలాషులు, ధైర్యం చెప్పి ప్రోత్సహించిన ఆత్మీయులు అందరికీ మనస్ఫూర్తిగా హృదయపూర్వక కృతజ్ఞతల్ని తెలుపు కుంటున్నాను. "ప్రవక్తలు విలువల్ని బోధిస్తారు, పేదలు విలువలతో జీవిస్తారు" అంటారు కళ్యాణ్‌రావు 'అంటరాని వసంతం'లో. అలా ఉంటూ, కష్టాలకి అలవాటు పడ్డమంత సుఖం మరోటి లేదు. అలాంటి సుఖంలో నాతోబాటు పాలుపంచుకోడానికి ముందుకొచ్చిన అందరికీ నా అభినందనలు. – ప్రేమతో, **గౌరవ్**

అనుబంధం

సత్యాన్వేషణంటే గుత్తాధిపత్యం కాదు!

"అన్యాయానికీ, పీడనకు గురయినవాళ్ళ దృక్పథంలో అనివార్యంగా హేతువాదం, వాస్తవవాదం, భౌతికవాదం ఎంతోకొంత చోటు చేసుకుంటాయి. భావవాదం, ఆధ్యాత్మికం, పీడకులకు ఇటూ చెందక, అటూ చెందక తప్పించుకు తిరిగే మధ్యరకపు ధన్యులకు మాత్రమే సహజం."

– బాలగోపాల్ 'ఏడు తరాలు' సమీక్షలో

'సత్యాన్వేషణ మండలి' తాత్విక దృక్పథాన్ని గత కొంతకాలంగా గమనిస్తూ, కుదిరినప్పుడు సురేంద్రబాబుగారితో చర్చిస్తూ వస్తున్నాను. ఆ మధ్య వారు హేతువాద పునరుజ్జీవన ప్రయత్నాల పేరుతో ఆలోచనా విధానానికి సిద్ధాంత చట్రాన్ని బిగించేందుకు అప్పటికే నిర్ణయించుకున్న విషయంపై అభిప్రాయాలు అడగగా 'హేతువాదం సిద్ధాంతం ఎందుక్కాదు' అనే పేరుతో వ్యాసం రాసే యత్నం చేసాను. అందులో కొంత భాగాన్ని హేతువాది, వివేకపథం పత్రికలకు పంపగా అవి రెండూ ప్రచురించాయి. ఈ లోపులో అనుకోకుండా అక్రమ కేసులో ఇరుక్కుని ఇబ్బందుల్లో పడ్డాను. అయినా మళ్ళీ ఆ రెండు పత్రికలకూ రెండో వ్యాసం పంపాను. వివేకపథానికయితే నేనే పనిగట్టుకు వెళ్ళి అందజేసాను. ఈ లోపులో కుదిరినంత సమయాన్నయినా సద్వినియోగం చేసుకునే దృష్టితో హేతువాదానికి సంబంధించిన భావజాలాన్ని పునర్నిర్మాణం చేసుకునే పనిలో పడ్డాను. వెంకటాద్రిగారికీ – సురేంద్రబాబుగారికీ జరిగిన వివాదానికి చెందిన పాత వివేకపథం పత్రికలన్నీ చూసాను. అప్పుడే సురేంద్రబాబు వ్యక్తిత్వంపై 'తొందరపడి' ఒక అంచానాకొచ్చి అభినందన లేఖ కూడా వ్రాసాను. తొందరపడి అని ఎందుకంటున్నానంటే, ఇప్పుడిప్పుడే ఈయనగారి అసలు స్వరూపం తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాను కాబట్టి. 'వివేకపథం'లో నా వ్యాసాన్ని లేఖగా పేర్కొన్న సురేంద్రబాబుగార్ని అనుసరిస్తూ రాజేంద్రప్రసాదు గారు రాసిన స్పందన ఏమిటంటే, నేరుగా సురేంద్రబాబుగార్ని సంబోధిస్తూనే రాయొచ్చు కదా, దాపరికమెందుకనీ, ఇక నేను రాసింది చాలా భాగం ఆయనకు అర్థం కాలేదనీను. అర్థం కానిదానికి నేనిక్కడ వివరణ ఇవ్వడంలో ఎలాగూ అర్థం లేదు కానీ, ఆయనకి తెలీని విషయమేమిటంటే, నేనా వ్యాసాన్ని సరాసరి సురేంద్రబాబుగారికే అందిచ్చాను. ఈ విషయం రాస్తూ, నా కేసుల విషయం సురేంద్రబాబుగారు ఎరిగున్నందున జరుగుతున్న చర్చలో కచ్చితంగా భాగం

పంచుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో నాకు భారమనీ, అయితే ఆ విషయాలన్నింటినీ వివేకపథం పాఠకులకి వివరించడం అనవసరమూ, అసందర్భమూ కాబట్టి చిన్న విజ్ఞప్తి ప్రకటన పత్రికలో చేయమనీ చెప్పాను. దానికాయన సుముఖంగా స్పందిస్తూ తప్పనిసరిగా ప్రచురిస్తాననీ, పాఠకులందరికీ సంజాయిషీ ఇచ్చుకోవలసిన పని నీకు లేదంటూ, ముందు లీగల్ చిక్కుల్లో నుంచి బయటపడే ప్రయత్నం చేయమనీ ధైర్యం చెప్పారు.

సురేంద్రబాబుగారికీ నాకూ పరిచయమయి కొద్దిరోజులే అయినా వీలయినప్పుడల్లా ఆయనతో చర్చించే ప్రయత్నం చేసాను. అనేక విషయాలపై అభిప్రాయాలు పంచుకున్నాను. భిన్న సమస్యలపై ఆయన విశ్లేషణలు విన్నాను. అయితే, ఈ లోపులో ఏమయ్యిందో తెలీదు కానీ 'వివేకపథం' సంచికలో నా వ్యాసం, ప్రకటనా రెండూ లేవు. పైగా పరోక్షంగా హేతువాదంపై కనీస జ్ఞానం లేనివాడిగా నన్ను పేర్కొంటూ, హేతువాద పునరుజ్జీవనోద్యమ ప్రయత్నాల్ని కొంత కాలంగా గమనిస్తూ అంటీ ముట్టనట్లుంటున్నాననే అపనిందకూడా అందులో వుంది. అది చూసి ఇదేంటని విభ్రమ చెంది సురేంద్రబాబుగారికి ఫోన్ చేసి అడిగితే 'దూకుడుగా మాట్లాడొద్దనీ, మొదటి వ్యాసానికి బాధ్యత వహించి ప్రతి పదానికీ, ప్రతి వాక్యానికి' అర్థం చెప్పేటట్లయితేనే ఆ వ్యాసం ముద్రిస్తాన'ని అన్నారు. పాఠకులకి కనీస సమాచారం కోసం నేనిచ్చిన నాలుగు ముక్కల ప్రకటనకీ, నే రాసిన ప్రతి పదానికి అర్థాలు వెతకమనడం ఏం సబబని అడిగేలోపే సురేంద్రబాబు పరుషంగా మాట్లాడుతూ ఫోన్ పెట్టేసారు. ఈయన 'శాడిజం' గురించి ఈ విధంగా స్పందించాల్సి వచ్చింది. దశాబ్దాలుగా 'సాగు'తున్న ఈయన 'నిర్భంద తర్కాన్ని' గురించి నా కథనమిది, చదవండిక.

× × × ×

"The whole problem with the world is that fools and fanatics are always so certain of themselves, and wiser people so full of doubts." - Bertrand Russel.

తటస్థ వైఖరి తాత్విక పురోగమనానికి చిహ్నం కాదు. ఎటువైపుకయినా దూకగలిగే పిల్లిది అవకాశవాదమే అవుతుంది. తర్కంతో తైతక్కలాడటం, పదాలతో గారడీలు చేయడం, వాక్యాలతో లొక్కాన్ని ప్రదర్శించడం వంటి సరళంతా వ్యక్తి ప్రత్యేకతవుతుందే కాని ప్రామాణిక సత్యాన్వేషణ అవదు. అందుకే 'సత్యాన్వేషణ మండలి' తర్కాన్ని ఏ సత్యాన్వేషి కూడా ఒప్పుకోలేదు. సత్యాసత్య వివేచనా

పద్ధతులలోని హేతుబద్ధ ప్రయోగ రీతుల్ని అలవరచుకోడానికి ఎవరికీ ఎటువంటి సందేహాలూ ఉండక్కర్లేదు. అదే సమయంలో సైద్ధాంతిక తాత్విక భాషకి అంగీకృత అర్థాల్ని కూడగట్టాలనే వ్యర్థప్రయాసా, అంతిమంగా అజ్ఞాతవాదాన్ని అప్రకటితంగా ప్రచారం చేయాలనే వృధాపెడాశ అందులోనుంచి మినహాయించబడాలి.

ఒకనాటి తాత్విక క్షేత్రంలో విప్లవాత్మకమయిన మార్పులకు కారణమయిన భావాలన్నీ తదనంతరం నూతన తరం నుంచొచ్చే విమర్శలకు సిద్ధపడినట్లయితేనే సమాజంపట్ల వాటి నిబద్ధత తేలుతుంది. అయినప్పటికి ఒక తరాన్ని ప్రభావితం చేసిన అంశాలు అదే స్థాయిలో, అంతే పరిమాణంలో అన్ని తరాల్ని ప్రభావం చెయ్యాలన్న నియమం లేదు. దేవుడి అస్తిత్వాన్ని నిరాకరించినవారే నాస్తికులనే భావన ఆనాటి సమాజానికి లేదు. "These inquiries have nothing to do with things as they are, with the realities we know; they are not concerned with the law of life; they do not make for right conduct; they do not conduce to the absence of lust, to freedom from passion, to right effort, to insight, to inward peace" అని బుద్ధుడన్నట్లు పొత్తపథసుత్త అనే బౌద్ధ గ్రంథం చెబుతుంది. "తత్వవేత్తలు ప్రపంచాన్ని వివిధ రకాలుగా నిర్వచించారు. కానీ అసలు విషయం దాన్ని మార్చడమనే" మార్క్స్ భావనని స్థూలంగా బుద్ధుడు ఆనాడే చెప్పాడనుకోవచ్చు. ప్రసిద్ధ బౌద్ధ తత్వవేత్తయిన ధర్మకీర్తి కూడా,

"వేద ప్రామాణ్యం కస్యచిత్ కర్తృవాదః
స్నానే ధర్మేచ్ఛా జాతి వాదాప లేపః
సంతాపారమ్భః పాపహానాయ చేతి
ధ్వస్త ప్రజ్ఞానాం పంచలింగాని జాడ్యేః"

వేదాల్ని ప్రమాణాలుగా స్వీకరించడం, ఈశ్వరుడనే కర్త ఒకడున్నాడనడం, స్నానాలు చేసి పుణ్యాన్ని సంపాదించాలనుకోవడం, కులాన్ని చూసుకు అభిమానపడడం, పాప పరిహారార్థం ఉపవాసం చేయడం బుద్ధిహీనుల జడత్వానికి నిదర్శనాలని ప్రకటించాడు తప్పితే నాస్తికుడ్ని టమకేసుకోలేదు. సాంఘిక విప్లవకారుడు పెరియార్‌లాగా,

There is no god
There is no god
There is no god at all
He who invented god is a fool

He who propagates god is a scoundrel

He who worships god is a barbarian

(దేవుడు లేడు, దేవుడు లేడు, అసలు దేవుడనేవాడే లేడు. దేవుణ్ణి కల్పించినవాడో మూర్ఖుడు, దేవుణ్ణి ప్రచారం చేసేవాడు దుర్మార్గుడు, దేవుణ్ణి ఆరాధించే వాడొక అనాగరికుడు) అని అందరు నాస్తికులూ గొంతులేమీ చించుకోలేరు కదా!

క్రీ.పూ. 482-414 లోనే "About the gods, I am unable to know whether they exist or do not exist, nor what they are like in form : for there are things that hinder sure knowledge - the obscurity of the subject and the shortness of human life" అంటాడు ప్రోటాగరస్ అనే ప్రసిద్ధ తత్వవేత్త. "Believe those who are seeking the truth. Doubt those who find it." (సత్యాన్వేషణకుల్ని నమ్ము, సత్యాన్ని కనుగొన్నామనేవార్ని కాదు) అని ఆండ్రోగిడ్ అన్నా, I do not believe in god and I am not an Atheist. (నేను దేవుణ్ణి నమ్మను, అయినా నేను నాస్తికుడ్ని కాను) అని ఆల్బట్ కేమూ అన్నా అవి సత్యాన్వేషణ స్ఫూహతోనే నన్నది స్పష్టం. అసలు నాస్తికత్వాన్ని దేవుడు లేడని నమ్మేవాదంగా మాత్రమే ప్రచారం చేసింది ఒక్క పండితులే కాని వైజ్ఞానికులు కాదు. "To the true cynic nothing is ever revealed" అంటాడు ఆస్కార్ వైల్డ్. హేతువాద – నాస్తికత్వాల్ని సత్యాన్వేషణ రూపాలుగా కాక నిర్లాయక సిద్ధాంతాలుగా అర్థం చేసుకున్న మూకలన్నీ తమ లేకితనం చుట్టూతా అజ్ఞాన కథలల్లుకున్నాయి. అలాటి కథల్నే సంవత్సరాలుగా ప్రచారంలో పెడుతున్నాయి. పరిణామవాదానికి మూల పురుషుడయిన డార్విన్ స్వయంగా, "The Mistery of the beginning of all things is insoluble by us ; and I for one must be content to remain an agnostic." అని వ్యాఖ్యానిస్తాడు. ఇక అజ్ఞాతవాదాన్ని ధైర్యంలేని నాస్తికత్వంగా జమకట్టిన టెర్కిల్, "you happen to be talking to an agnostic. You know what an agnostic is? A cowardly atheist" అంటాడు.

అంటే, అజ్ఞాతవాదనే వాడు నాస్తికుడిగా చెప్పుకోలేని పిరికివాడనేది స్పష్టం. దీన్నే ఏంగిల్స్ వర్ణిస్తూ, "Thus, as far as he is a scientific man as far as he knows anything, he is a materialist; outside his science, in spheres about which he knows nothing, he translates his ignorance into Greek and calls it agnosticism." అంటాడో సందర్భంలో అజ్ఞాతవాదం అజ్ఞానానికి అనువాదమే. అయినప్పుడల్లా ఆస్తికులు, అజ్ఞాతవాదులూ, అప్పుడప్పుడు కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, రాయిస్టులు సంకుచితంగా చూపించేందుకు ప్రయత్నించేది నాస్తికత్వం అనే పదమే కాని నాస్తికత్వం కాదు. "If god did not exist, it would be necessary to invent him" అన్న వోల్టేర్ భావనకు "If god really existed, it would be necessary to abolish him." అనే బకూనిన్ సమాధానం ఆధునిక నాస్తికత్వంలో అభివృద్ధి చెందిన ఒకానొక భాగం మాత్రమే. అయినా చెట్టు ముందా విత్తుముందా, కోడి ముందా గుడ్డిముందా అనేవాటికి జవాబు వెతకడమే అర్థరహితం. పదార్థ పరిణామాన్ని ప్రతిపాదిస్తున్నామంటేనే చలనశీలమైన మార్పును గుర్తిస్తున్నామని గ్రహించాలి. అలాంటప్పుడు కోడైనా, గుడ్డైనా, చెట్టైనా, విత్తైనా పరిణామంలోంచి జనించిన ఫలితాలే. దేవుడనే పదార్థాన్ని వుందనేవాడు నిరూపించాలే కాని, లేడన్న వాణ్ణి ఎలా లేడో, ఎందుకు లేడో, లేడనే నిర్ణయానికి ఎలా రాగలిగాడో నిరూపించమనడం వెఱ్ఱితనం. ఏదో ఉందని ఊగుతున్నవారు, ఉందో లేదో అని తూగుతున్నవారు తేల్చుకోవలసిన విషయానికి నాస్తికుల నిరూపణ అవసరం లేదు. ప్రశ్నించడమనేది అలవడ్డానికి, ప్రార్థనలు చేయడానికి తేడా తెలిస్తే ఈ సంగతి సుళువుగానే గ్రహించవచ్చు. ఏదీ తేలలేదనే ఏటిగట్టు వైఖరికి స్వస్తి చెప్పవచ్చు. నాస్తికత్వం ఒక సమగ్రమయిన వైఖరికల ఆలోచనా విధానం. "Atheism is more than just the knowledge that god do not exist, and that religion is either a mistake or a fraud. Atheism is an attitude, a frame of mind that looks at the world objectively, fearlessly, always trying to understand all things as a part of nature" అంటాడో వేత్త. అలాగే "The philosophy of atheism represents a concept of life without any metaphysical beyond or divine regulator. It is the concept of an actual, real world with its liberating, expanding and beautifying possibilities, of against an unreal world, which, with its spirits, orcles, and mean contentment has kept humanity in helpless degradation" అంటుంది ఎమ్మాగోల్డ్‌మెన్. నిజానికీ అంశం కొత్తదేం కాదు. అనేక సంవత్సరాలుగా నా రచనల్లో స్పష్టం చేస్తూనే వస్తున్నాను. నిజానికి రాష్ట్రంలో హేతువాద నాస్తిక

వాదాలు ఏ సిద్ధాంత ముసుగులోను పనిచేయాల్సినవసరం లేదని నొక్కి చెప్పిన రచనలు నావి. సుమారు దశాబ్ద కాలంగా భిన్న తాత్విక విషయాలపై జరుగుతున్న ప్రగతిశీల ప్రయత్నాలు నావి. మాట్లాడితే వెంకటాద్రి చంకనెక్కి హేతువాద దృక్పథాన్ని తిలకించాలని చూసే సురేంద్రబాబుకి తెలుగు నేలలో హేతువాదులనుకునేవారికి హేతువాదం గూర్చి సమాచారమంతా 90% వెంకటాద్రి రచనల నుంచే అందుతోందనే అపూర్వ విషయం తట్టింది. (ఇంకా నయం, సత్యాన్వేషణకి సంబంధించిన సమాచారమంతా సురేంద్రబాబు నుంచే అందుతోందన్లేదు) ఒక యువకుడి స్వతంత్రశీలతని ఒప్పుకోడానికి అహం అడ్డొచ్చిన ఆయన విజ్ఞతకి నా రచనా ప్రజ్ఞే ప్రతిబంధకమైంది. ఇక్కడో సంగతి ప్రస్తావించుకోవాలి. మొదట్నుంచీ నాది వ్యక్తిగత కార్యాచరణే. ఏదో కొద్దిపాటి విషయాల్లో తప్ప సమిష్టి కార్యక్రమాలు కుదిరేవి కావు. అయినప్పటికీ వీలైనంతలో నా కార్యాచరణని క్రమబద్ధం చేసుకుని నే చేయగల్గింది చేస్తున్నాను. భౌతికవాద – లౌకికవాద తాత్విక పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా అనేక సంఘాలపేరుతో, సమాఖ్యల పేరుతో భావ ప్రచారోద్యమం కావిస్తున్నాను. హేతువాద నాస్తికోద్యమాల విషయంలో నాది దాదాపు దశాబ్ద కాలం నుంచి కొనసాగుతున్న ఒంటరి కృషి. అందుకు ఎవరి భావాలయినా, ఆచరణయినా నాకు స్ఫూర్తినందించాయే కాని శాశ్వత దడికట్టుకోలేదు. నిజానికి వెంకటాద్రి గారి రచనల్తో నాకు పరిచయముంది కానీ మొన్నమొన్నటి దాకా పుట్టాగారి పేరు కూడా నే విన్లేదు. అయినా అదేం తప్పుకాదు లెండి. అందరూ అందరికీ తెలియకపోవచ్చు. నా నాస్తికత్వానికి ఈ ఇరువురివీ కాని – వేరెవరివో కాని భావాలు ప్రమాణం కావు. ఆరంభంలో అనార్కిస్టు హేతువాదిగా మొదలయిన నా క్రమం మెల్లగా అందులో నుంచి బయటపడింది. కొద్దోగొప్పో నా భావాలు పరిచయం గల వారికెవరికైనా ఇవి ఎరిగిన విషయాలే. కానీ సత్యాన్వేషణ మండలి మా పరిచయంలోకి వచ్చిన వెంటనే వారికి మా కార్యక్రమాలకి సంబంధించిన ప్రచురణలన్నీ పంపినా ఇప్పటికీ ఏమీ తెలీలేదు. లేక తెలియనట్లు నటిస్తున్నారా? అసలు హేతువాద నాస్తికత్వాలపై వెంకటాద్రిగారిదీ, సురేంద్రబాబుగారిదీ, దాదాగిరి ఏంటి? వెంకటాద్రి రాయిస్టు హేతువాదం, సురేంద్ర ఫాసిస్టు హేతువాదం తప్ప మాకు ఆలోచనా స్వేచ్ఛా, హేతుబద్ధ తర్క పిపాస లేవా? హేతువాద నాస్తికత్వాలేం మీ నూతుల్లో నీళ్ళు కావు మీ జాగీర్దారీ హక్కును ప్రకటించడానికి. "Each generation imagines itself to be more intelligent than the one that went before it, and wiser than the one that comes after it" అంటాడు

George orwell అనే ఆయన. మీ తరం నిద్రలోంచి బయటపడి ఈ తరంలో జరుగుతున్న మేల్కొలుపు ప్రయత్నాల్ని హృదయపూర్వకంగా హర్షించండి. కుదిరితే వెన్ను తట్టండి కాని నోరు నొక్కకండి.

నాస్తికత్వం సిద్ధాంతం కాదంటూ దాన్నొక జీవన విధానంగా మలుచుకునేందుకు యత్నించేవారంటే అజ్ఞాత వాదులకు ఎంత అలుసో గతంలోని నాస్తిక – హేతువాదులకి పరిచయమే. అందుకే, "The agnostic does not simply say, "I do not know". He goes another step, and he says, with great emphasis, that you do not know. He insists that you are trading on the ignorance of others, and on the fear of others. He is not satisfied with saying that, you do not know, he demonstrates that you do not know, and he drives you from the field of fact - he drives you from the realm of reason - he drives you from the light, into the drakness of conjucture - into the world of dreams and shadows, and he compels you to say, at last, that your faith has no foundation in fact." అంటాడు ప్రసిద్ధ నాస్తిక తత్వవేత్త Robert G. Ingersoll. ఆంధ్రదేశంలో అంతంత మాత్రంగా నున్న అజ్ఞాతవాదులు అప్పుడప్పుడు అడిగే ప్రశ్నలూ, సత్యాన్వేషణ మండలి తెరతీసే చర్చలూ సరిగ్గా పై కోవకి చెందినవే.

ఇక్కడ అభ్యుదయవాదులు గమనించాల్సిందేమిటంటే, సమాజంలోని మానసికమయిన ఆలోచనా ధోరణులను వ్యవస్థ జీవన ప్రమాణాలు పెంపొందించే విధంగా వృద్ధి చేసేందుకు ప్రయత్నించే అన్ని ప్రశ్నాత్మక వైఖరుల్ని ఆహ్వానించాలి. అదే సమయంలో పురోగామి భావాల్ని, తిరోగమన భావాల్ని ఒకే గాటిన కట్టే దొంగల్ని ద్రోహులుగా గుర్తించాలి. I am a agnostic; I do not pretend to know what many ignorant men are sure of." అంటాడు clarence dawwos. ఇంతకంటే రస్సెల్ మాటలు మరింత స్పష్టంగా ఉన్నాయి. "As a philosopher, if I were speaking to a purely philosophic audience I should say that I ought to describe myself of an agnostic, because I do not think that there is a conclusive argument by which one can prove that there is not a god. On the other hand, if I to

convey the right impression to the ordinary man in the street I think that I ought to say that, I am an Atheist, because, when I say that I cannot prove that there is not a god, I ought to add equally that I cannot prove that there are not the Homeric gods." అంటాడాయన. అజ్ఞాత వాదానికయినా, సత్యాన్వేషణకయినా ఇంతకంటే స్పష్టమయిన సార్వత్రిక దృష్టాంటుందని నేనైతే అనుకోను. "సమస్త సోదర ప్రాణకోటి సుఖ సంతోషాలకు జీవితాన్ని వ్యయించడం కంటే మన జీవితానికి సాఫల్యం వేరే ఉందనుకోవడం మూర్ఖత్వం" అంటారు చార్వాక రామకృష్ణ తన 'నాస్తికత్వ సిద్ధాంతం' అనే గ్రంధంలో.

జ్ఞాన భాగంలో ఆస్తికులకంటే, నాస్తికుల కంటే ఉన్నత స్థాయిలో ఉన్నామంటూ భ్రమచెందడం మినహా సత్యాన్వేషణ తత్పరతకి సరైన తాత్పర్యం లేదనుకోవడం పుట్టావారి అమాయకత్వం. అంతిమంగా అది సామాన్యుల ముందు కుప్పిగంతు లేయడానికి పనికొస్తుందే కాని మరెందుకూ కాదు. దశాబ్దాలుగా వారి రుద్దుడు సమాజ చైతన్యానికి ఎంత వరకూ వుపకరించిందనేది సాధారణ ఆలోచనాపరులుగా మనందరికీ రావలసిన ప్రశ్న. హైందవులు వేదం చదివారా, క్రైస్తవం హిబ్రూ భాషొచ్చా, ఇస్లామ్ అరబ్బీ వొచ్చా అని దబాయిస్తుందని ఈయన 'సృష్టివాదమా పరిణామవాదమా?' అనే పొత్తంలో ప్రశ్నించి, ప్రమాణాలు ప్రమాణ క్షేత్రాలంటూ తర్క భాషాలో దబాయిస్తుంటాడు. వారే కాదు, అలాంటి ఊకదంపుడు తత్వాన్ని వ్యవస్థ తలపై ఉంచడానికి సిద్ధమవుతున్న వారందరి భవిష్యత్తూ కూడా తప్పనిసరిగా భంగకరమే. దాన్నే "For thousands of years people have been trying to force other people to think their way. Did they succeed. No? will they succeed? No. why? Because brute force is not an argument" అంటాడో వేత్త.

ఎంతటివార్నయినా చులకన చేసే స్వభావంతో అందర్నీ చూట్టూ కూర్చోబెట్టుకుని నోరు తిరిగిన నాలుగు సంస్కృత శ్లోకాల్ని ఒప్పచెబుతూ పదాలూ, అర్థాలూ, వాక్యాలూ, దీర్ఘాలూ, తర్కాలూ, మంత్రాలూ... ఇదంతా ఆధునిక అగ్రహారాల్ని, సాంప్రదాయక గురుకులాల్ని లేక వెనకబడిపోయిన భక్తి సంస్థల్ని - భజన సంఘాల్ని నూతనంగా నిర్మించే ఆలోచనే తప్ప ఇంకేదయినా అంటే మాత్రం

నమ్మడం కష్టం. తమ స్వాధీనంలోకి వచ్చిన ఆలోచనాపరుల్నీ, సామాజిక వేత్తల్ని సత్యాన్వేషణ మండలి హింసించే పద్ధతి గురించి పెట్టే తిప్పలు గురించి ఎన్ని వాదాలు, వివాదాలు తలెత్తినా అదంతా తమ గొప్పతనమే ననుకునే సురేంద్రకి "your mind is totally controlled, it has been stuffed into my mold. And you will do as you are told, until the rights to you are sold" అనే జఫ్ఫా మాటలు సరిగా సరిపోతాయి. ఎలాంటి చైతన్యం వికసించినట్లు కనబడ్డా చర్చపేరుతో, తర్కం పేరుతో దానిని చిదిమేసేవరకూ తృప్తి పొందనివారికి మౌలికంగానే సవాలు చేస్తూ జవాబిస్తున్నాను.

నిజానికి 'we agree to disagree' అనేది ఏ ప్రజాతంత్ర సంవాదానికయినా అవసరమయ్యే ప్రధాన సూత్రం. విచారణా విధానంలోని ప్రజాస్వామిక దృక్పథాన్ని, భిన్నత్వాన్ని ఆహ్వానించే ఆకాంక్షని ఉన్నతంగా వ్యవస్థపరిచే పద్ధతది. అలాకాక ఎదుటివార్ని పట్టి, పీడించి, నొప్పించి, నోరు నొక్కడం పూర్వం ఆస్థానాల్లో వోడిపోయిన పండితులను తీవ్రంగా అవమానించి, గేలిచేసి సాగనంపే కుసంస్కారానికి సంబంధించింది. రాజ సంస్థానాల్లో తర్కశాస్త్ర పండితులు ఇతర రాజ్యాల పండితుల్ని కించపరచడం కోసం, ముందుగానే భయపెట్టడం కోసం తమ తిక్కపైత్యాన్నంతా రంగరించి వర్తమానాలు పంపుతుండేవారు. ఓడిపోయిన పండితుడ్ని ఘోరంగా పరాభవించేవారు. అసలు అటువంటి నిర్భంద విచారణ విధానాలే క్రూరమయినవి. అన్నివైపుల నుంచీ చుట్టుముట్టబడిన జీవి తన చివరి క్షణాల్లో వేటగాడి కారుణ్యం కోసం వెంపర్లాడిన విధంగా, తర్కం పేరుతో అన్నవాడే నిరూపించాలన్న' అశాస్త్రీయ అంశాన్ని అందరి తలకు రుద్దాలన్న వ్యర్థ ప్రయత్నమే సత్యాన్వేషణ మండలి శుష్క తర్కానికి ప్రమాణం. "Nothing was your own except the few cubic centimetres inside your skull." అంటాడొకాయన. కాబట్టి అన్ని విషయాల్ని అన్నవాడే నిరూపించడం అసాధ్యం. నిరూపితమయిన అంశాల్నే ప్రచారం చేయాలన్న నియమం పాక్షికంగానే సరైంది. శుద్ధంగా సొంతమైనదనే భావనే మానవ సమాజంలో ఉండదు. "It is not cleverness of learning that makes the philosopher; it is a certain spirit; openness of mind, throughness of work, and hatred of superficiality" అంటాడు Bernard Bosanquet ' The Essentials of Logic' గ్రంధంలో. ఇదంతా లోపించిన సత్యాన్వేషణ మండలి

దృక్పథం, "A completely new vision of life may cause a man to be thought mad" అనే చందంగా తయారయింది.

సురేంద్రబాబుగారూ! అర్థమవుతోందా? సమాజంలో ఎక్కువమందికి మీకుండేంత తీరికా, స్తోమతా, వోపికా, వనరులు వుండవు. నా వరకూ నాకు లేవు. అందుకే అనేక సందర్భాల్లో మీరు సంధించిన ప్రశ్నలకి ఇప్పుడు జవాబిస్తున్నాను. ఒక నిర్దిష్టమయిన నిర్మాణాత్మక ఉద్యమ తాత్వికతకి కట్టుబడి వుండకుండా ఎదురొచ్చిన అన్ని సంఘాలతో కలిసి కార్యక్రమాల్లో 'పాలు పంచుకోవడం' నా 'పనిలేనితనం'గా భావించారు మీరు. నిజానికి కడుపునిండా తిని సొల్లు కబుర్లాడడం, శుష్క వాదాలు చేయడం, తోచిన వూసులు రాయడం మీ సత్యాన్వేషణ మండలి' పనిలేనితనం. నాది కాదు. కాని అలాంటి నోటి తత్తర జవాబిచ్చే స్థాయికి (మీ స్థాయికి) నేనెదగలేదు. సమాజంలో వుండకూడని దానిపై స్పష్టతకల వ్యక్తులు, సంస్థలు వుండవలసిన దాని గురించి చర్చించుకుని కలిసి పనిచేయడం మంచిదని మొదట్నుంచీ నా భావం. అందుకే ఇప్పటిదాకా నాకు పరిచయమయిన ప్రతి మిత్ర సంస్థతోనూ కుదిరినంత స్నేహపూర్వక సంబంధం నెరుపుతూ వాటి నుంచి నేర్చుకునే ప్రయత్నం చేస్తున్నాను. మారిన సామాజిక వాతావరణంలో కార్యకర్తనేవాడి కర్తవ్యం, కార్యాచరణ బహుముఖంగా వుండాలనేది నా భావం. మళ్ళీ ఈ భావంపై మీ దిక్కుమాలిన అభిప్రాయం ఏంటంటే, అసలు నేనే సంఘంతోనూ కలిసి పనిచేయడం లేదనీ, ఇదేం దౌర్జన్యం? నేను చేసిన పని గురించి తీర్పులిచ్చే అధికారం మీకెవరిచ్చారు. మీకంటే – మీ సంస్థకంటే బాగానే పనిచేస్తున్నాననే భావన నాకుంది. ఇందాక దిక్కుమాలిన అభిప్రాయమన్నానని కోపమొచ్చిందా? అది మీ పదమే సుమండీ! 'మతానికి మరణ శాసనం...' రచనలోని అన్ని భావాలతోనూ ముద్రించేనాటికి అనారోగ్యం కారణంగా అస్పష్టతకి నేనే కారణమై వున్నానని ప్రకటిస్తే దాన్ని దిక్కుమాలినదంటూ గేళి చేసిన మీ శాడిజాన్ని ఎలా మర్చిపోగలను.

పదపదార్థ జ్ఞానం లేనివానికి వాక్యార్థ జ్ఞానం వుండదన్న మీ అభిప్రాయం నాకు అంగీకారం కాదు. నిజానికి ఈ రకమైన ధోరణి 'పోస్టు మోడర్నిజం'లో ఒక భాగంగా చూడవచ్చు. 'చర్చ' ద్వారా గుర్తింపు 'నిర్మించబడుతుందని' ఈ తరహా వ్యక్తులు భావిస్తారు. అందుకే భాషని 'విప్పడం' (de-construct) చేయడంపై దృష్టి

పెడతారు. అయితే ఇందువల్ల మనం ఖచ్చితమని చెప్పదగ్గ భౌతిక వాస్తవమేదీ ఉండదని, విషయవాదం (subjectivism) యొక్క ఒక అత్యంత తీవ్రరూపం ఇదని చర్చిస్తారు ప్రముఖ సామాజిక రచయిత అనురాధా గాంధి. 'స్త్రీవాద తాత్విక ఉద్యమం' గూర్చిన తన పుస్తకంలో. సాధారణ దైనందిన జీవితంలోనే కాదు, తాత్విక సైద్ధాంతిక చర్చలలో కూడా ముఖ్యమైన పదాలకి వ్యాఖ్యాత, రచయిత తీసుకున్న అర్థాల్ని అతడు వాడిన సాంకేతిక శాస్త్ర వ్యాకరణం రీత్యా ఇవ్వగలిగితే మంచిదే కాని, అదేం భాషా నియమం కాదు. పదాలకి పరిపూర్ణ అర్థాలు తెలుసుకోందే వాక్యాలు పూర్తిగా అర్థం కావనడం సరైంది కాదు. సంఘంలో ఎక్కువమందికి వీటి గురించి పాక్షిక జ్ఞానమే ఉంటుంది. సామాన్యంగా వాడే పదాలన్నీ తాత్వికతను జోడించగానే పారమార్థికమయిపోవు. ఇక ఒక తాత్విక భావన గురించి అందరూ ఒకటే నేర్చి, ఒకటే కూర్చి, ఒకేలాగా ఒప్పజెప్పడానికి ఇదేం ఎక్కాల పుస్తకం కాదు. ప్రాపంచిక దృక్పథాలకి సంబంధించిన సిద్ధాంత నిర్వచనాల్లో భిన్నత్వాన్ని సమర్థించడమే సరైన ప్రజాస్వామిక దృక్పథం. సత్యాన్వేషణకి గాను ప్రయత్నిస్తున్న భావాల్లో విభిన్నతని విచ్ఛిన్నం చేసేస్తే ఇక సత్యానికి అర్థమూ ఉండదు, అన్వేషణా ఉండదు. వివిధ సత్యాన్వేషణ శాఖల మధ్య ఆరోగ్యకరమయిన సంవాదం ద్వారానే ఉన్నతమైన వ్యవస్థ గురించిన భావనలు మేధోవంతుల్లో స్పష్టతను సంతరించుకుంటుంటాయి. అటువంటి క్రమాల్ని ప్రజాతంత్రవాదులు కొనసాగించడమే ఆరోగ్యకరమయిన వ్యవస్థకి హేతువు.

ప్రమాణాలు – ప్రమాణ క్షేత్రాల పేరుతో మీరు ప్రజలపై రుద్దాలనుకుంటోంది ద్వేషాన్నే, కాని ప్రేమను కాదు. అత్యధిక శాతం మందితో విభిన్న తాత్విక అవగాహనపరులతో మీ తార్కిక చ(ర)ర్చ అప్పటిదాకా ఆలోచనాత్మకంగా వారు చేసిన కృషిని మరుగుపర్చి అన్ని విషయాల్ని అనిర్ధారితాంశలని తేల్చి గేలిచేయడానికే కాని సామరస్యతకల సైద్ధాంతిక సంవాదం కొరకు కాదు. ప్రేమకు ప్రమాణం కావాలా? ఇన్ని సంవత్సరాలుగా మీతో చర్చిస్తూ 'ఎందుకొచ్చిన జిడ్డు గొడవ'నుకుని వెళ్ళిపోయినవాళ్ళనీ, 'నోరు మూసుకుని మీకు లొంగిపోయినవాళ్ళనీ', 'ఇదెక్కడి చావొచ్చిందిరా బాబూ' అనుకుంటూ గింజుకుంటున్న వాళ్ళనీ అడిగితే బాగా చెబుతారేమో. కాదంటారా? రాష్ట్ర వ్యాప్తంగా కుదేలుపడిన ఐక్యవేదికల సభ్యుల్నడిగితే మీ ఆవు కథ మరింత బాగా చెబుతారేమో!

ఆవుకథ ఏమిటంటారా? ఆవు వ్యాసం బట్టీ పట్టిన పిల్లాడు పరీక్షలో ఏం అంశంపై వ్యాసం రాయమని అడిగినా ఆవు గురించే రాసి ముగించినట్లు, ఎక్కడెప్పుడెవరే వేదిక ఏర్పరిచినా పొరపాటున మీ మండలి వుంటే చాలందులో. మొహమాటానికి పేరేం పెట్టినా మొత్తానికి అర్ధమయ్యేదంతా లక్షణ ప్రమాణ విద్యనే పదమొక్కటే. అసలు రాష్ట్రంలో తాత్విక రచయితలు, హేతువాద నాస్తిక యువ కార్యకర్తలు ఏం చదవాలో ఎలా చదవాలో ఎలా ఎత్తిరాయాలో నిర్దేశించమని నిన్నడిగిన మహానుభావుడెవరసలు? మమ్మల్ని తట్టుకునే చేవుంటేనే (ఆరోజు మీరు వాడిన పదం Power) సత్యాన్వేషణ మండలిపై విమర్శకి సిద్ధపడమని అన్నారు. నా చేవ సంగతెందుగ్గానీ మీ పవరుకి మాత్రం తుమ్మ జిగురు, జీడిపాకం, బంకమన్నూ ఆదర్శం అనుకుంటాను. మూడూ కూడా ముట్టుకుంటే అంటుకుంటాయని దూరం జరిగేవే. బహుశా అందుకేనేమో రాష్ట్రంలో సామాజిక శ్రేయోభిలాషులందరూ మీపై వ్యాసం రాస్తున్నాననగానే నా ఈ ప్రయత్నానికి 'మూర్ఖుడికి చెప్పడం మూర్ఖత్వమే'ననే విధంగా ముక్తాయింపునిచ్చారు. నేను చేసిన ఈ విమర్శంతా 'గుణదోష విచారణ' క్రమంలోనే చేసాను. అసలు మీతో అక్కర్లేని గొడవెందుకన్న అభిప్రాయం, ఊరుకుంటే నాకే ప్రయోజనం అనుకున్న భావన మొదట్లో కలిగాయి. కాని ఇప్పటికే కుర్రాళ్ళ మాటకేం, పెద్దలు కూడా మీ ప్రవర్తనవల్ల, రాతల వల్లా జడుసుకునే స్థితి వుంది. ఇప్పటికైనా మీ వ్యవహారశైలిలో మార్పొస్తే అది అందరికీ మంచిదనే ఉద్దేశమే నాది తప్ప మరోటి కాదు. తాత్వికక్షేత్రం సత్యాన్వేషణ మండలి జాగీరు కాదు.

విభేధాలొస్తే అంశం పక్కకు పెట్టాలే కాని వ్యక్తుల మధ్య స్పర్ధలు పెరగడానికి తావివ్వకూడదనే మీ వ్యక్తిత్వ సూత్రం ఆచరణలో విఫలమయిందని నా ఈ ప్రయత్నంతో మరోసారి రుజువయింది. మీరన్నారు. సమాజాన్ని బాగుచేయడానికి నువ్వేం ఉద్దారకుడివా అని. అప్పుడేం జవాబు చెప్పానో గుర్తులేదు. ఏదోటి చెప్పినా అది దాటవేతకోసమే చెప్పుంటాను. అంతదాకా వస్తే నే చెప్తున్న జవాబు, అవును. ఉద్దారకుడ్నే. ప్రశ్నించడానికి ప్రయత్నించాల్సిన చైతన్యం ఒక తరంలో ప్రజానీకం అనుసరించేదాన్ని అంగీకరించినప్పుడు మరో తరానికి ప్రశ్నను పరిచయం చేసే ప్రత్యామ్నాయం నేను. ఇదేదో అహంకారంతోనో, అల్లరిమాటగానో చెప్తున్నది కాదు.

"I have no absolute faith in any person. Such a faith would be fatal to my reason, to my liberty, and even to the success of my

undertakings; it would immediately transform me into a stupid slave, an instrument of the will and interests of others." అన్న సామాజిక తత్వవేత్త బకూనిన్ "It is the characteristic of privilege and of every privileged position to kill the mind and heart of men. The previleged man, whether politically or economically, is a man depraved in mind and heart." అని సరిగ్గా ఈ సందర్భానికి తగ్గ మాటలంటాడు. కేవలం మీ ప్రత్యేకతను ప్రదర్శించుకుందుకు, మీ ఆధిక్యతను నిరూపించుకుందుకు, సమావేశాలు, ఐక్యవేదికలు ఏర్పర్చిన క్రమం ఇప్పటిదాకా ఎంత మంది కార్యకర్తలు వెనకడుగు వేసేందుకు కారణమైందో కదా!

ఇప్పటిదాకా చాలామందిని చూసిన మీకు, ఇతరుల్ని చూడడం వేరు నన్ను చూడడం వేరని చెప్పడమే నా ఉద్దేశం. ఎంత గొప్ప మేధావయినా అసాధారణ వ్యక్తి కాడనేది మీరు చెప్పేదే. కొంతమంది కంటే మనకి కొంత ఎక్కువ తెలుసు, కొంతమందికంటే తక్కువ తెలుసు. కొంతమందితో సమానంగా తెలుసు. మరి అంత తెలిసిన మీరు వెంకటాద్రిగారు, మీరూ కలిసి పనిచేయడం మంచిదని భావిస్తున్నానని నేను చెబితే, 'నీ వయసెంత, నువ్వు మా గురించి మాట్లాడేంత వాడివా' అంటూ 'మంచిమాట చిన్నపిల్లవాడు చెప్పినా వినాలన్న' (యుక్తియుక్త ముపాద్దేయం వచనం బాలకాదపి) మీ సంస్థ తాత్వికతకి మీరే తిలోదకాలిచ్చారు. Men become old, but they never become good అనే పెద్దాయన మాటలకర్థం ఇదేనేమో!

ఇప్పటికయినా మించిపోయింది లేదు. అందర్నీ మార్పుకి సిద్ధపడమని చెప్పే మీలో మార్పొస్తే ఇప్పటికీ మీ శ్రేయోభిలాషిగా సంతోషించేవారిలో నేనొకణ్ణి. అదికాక గౌరవ్ వ్యక్తపరచిన భావాలకి అతనే బాధ్యత వహిస్తూ చర్చకి సిద్ధపడాలనీ, పదపదార్ధ జ్ఞానమనీ... వాక్యార్ధ జ్ఞానమనీ, తిప్పి రాయమని, ఆంగ్ల కొటేషన్లు అధికమయ్యాయని 'అధ్రువ మవిపినే హేరం డోపి దృమాయతే'లా మిడిసిపడితే (అర్థం మీకు బాగానే తెలుసనుకుంటా) నేను చేసేది కూడా ఏం వుండదు. మోతాదుకు మించి ఎరువు మాటల్ని ఉదహరించి గందరగోళం సృష్టించడం, పాండిత్యాన్ని ప్రదర్శించుకోవడం నా భావం కాదుగానీ, నేను చెప్పాలనుకున్న అభిప్రాయాల్ని ఈసరికే మరొకరు బలంగా వ్యక్తం చేసినప్పుడు, వాటిని వారి మాటల్లోనే వ్యక్తీకరించడం సబబనుకుని

మాత్రమే ఆంగ్ల కొటేషన్లను ఇచ్చాను. అది కూడా ప్రస్తుత చర్చకు సంబంధించిన అభిప్రాయాల్ని మాత్రమే స్వీకరించి విషయానుగుణంగా ఉపయోగించుకున్నాను తప్పితే, ఆయా భావాల్ని వ్యక్తపరచిన వారందరి ఇతర అభిప్రాయాలతో అనివార్యంగా నేను ఏకీభవిస్తున్నానని అనుకోనక్కర్లేదు. రాసిన వాటికి ఒక్కొక్క అర్ధం చెప్తూ కూర్చునేటంత ఖాళీగా ఏ సామాజిక తత్వవేత్తా వుండడనీ, ఒకవేళ నేనున్నా మీతో కూర్చోననీ ముందే చెప్పాను కదా. హేతువాదం గురించి రాసిన రెండో వ్యాసంలోనూ, మనం కలిసిన ప్రతీసారీ సాంఘిక అభ్యుదయానికి వుపకరించే ప్రతీ ప్రయత్నంలోనూ కుదిరినంతలో పాలు పంచుకుంటాననీ మీతో చెప్తూనే వస్తున్నాను. వివేచనాపరుడికి వుండాల్సిన ముఖ్యమయిన లక్ష్యం వ్యవస్థలో వీలైనంతమంది వివేచనాపరులను తయారు చేయడమనే విషయం కూడా చెప్పాను, రాసాను. అయినా మీ బుద్ధి ఎందుకో నా మిత్రత్వాన్ని ఒప్పలేదు. 'మిత్రస్యాహం చక్షుషా సర్వాణి భూతాని సమీక్ష్యే (మిత్రుడు కళ్ళతో లోకాన్ని చూడాలన్న) ఇంగితం మీలో ఇంకా ఇంకలేదు. అందుకే, మీరరుస్తూ నన్ను వినమంటూ పైగా నేనే దూకుడుగా మాట్లాడుతున్నా నన్నారు. పైగా ఎవరైనా ఏవైనా అంటే వాళ్ళు రాసిందానిపై నేను కామెంట్ మొదలుపెట్టబోతున్నాననే బెదిరింపొకటి.

అర్ధమవుతోందా నేనంటున్నది. మన పరిచయం అయ్యాక కొద్దిరోజులుగా నా రచనలన్నింటిపై మీ కొక్కి గీతల్ని చూపిస్తూ అందులో వ్యంగ్యం లేకుండా తిప్పిరాయమని, వాక్యాల్ని, అభిప్రాయాల్ని ఎత్తి రాయమనీ, మీ 'కామెంటు'కు సిద్ధపడమనీ... కొద్దో గొప్పో ఆలోచించే వాడు దొరికితే కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్లే భావించే మీ అహంకారం నా పట్లే ఇలా ఉంటే ఇక మీ బ్లాక్‌మెయిలింగ్ బారిన పడ్డ మిగిలినవారి విషయం చెప్పనక్కర్లేదు. నే రాసిన ప్రతీ అక్షరం బాధ్యతాయుత మైందే. అయితే, అది సమాజానికి. సత్యాన్వేషణ మండలికి కాదు. భావవికాసోద్యమ తాత్విక క్షేత్రంలో సత్యాన్వేషణ మండలి సముద్రంలో నీటి బొట్టుతో సమానం. నీటి బొట్టులో నీరెంతో నీ సంస్థలో సత్యమంతా. నవ్వుతూనే ఎదుటివాడ్ని హింసించే మీ ద్వంద్వ స్వభావంపై అసహ్యమే నన్నీ పనికి పురికొల్పింది. నిజానికి తాత్విక అంశాలపై జరిగే ఏ చర్చైనా హుందాగా ఉండాలి. పరస్పర గౌరవనీయ వైఖరిని అవలంభించుకోవాలి. అభిప్రాయ వ్యక్తీకరణనేది అంతరిక భావాల సంవాదనకు వేదికవ్వాలేకాని, వైయక్తిక ధూషణకు కారణం కాకూడదు. కాని మీ వ్యక్తిగత నడవడికే

నన్నీ ఘాటైన వ్యాసానికి ప్రేరేపించింది. భావ వికాసోద్యమ క్షేత్రంలో మీకిచ్చిన గౌరవం అరుదైనది. మిమ్మల్ని చూసి ఎలా వుండాలని నేర్చుకోవాలని చూపాలో తెలీదు కానీ ఎలా వుండకూడదో చాలా నేర్చుకోవచ్చు. ఇంకేమన్నారూ? ఉద్యమంతో అంటీ ముట్టనట్లుంటున్నానా? ఆవకాయేం కాదూ? ఈ మధ్యనే కదా నా వ్యక్తిగత జీవితం గురించీ, కుటుంబం గురించి కూడా మీతో చెప్పాను. అప్పుడప్పుడయినా ఉద్యోగాలు చేయకుండా ఉద్యమం చేయడం సాధ్యం కాదని చెప్పాను. అయినా, ఎప్పుడంటే అప్పుడు మీతో కలిసి పన్జేయడం కోసం ఎక్కడికంటే అక్కడికి వచ్చాను. రాజమండ్రి, వైజాగ్, దోరకుంట, హైద్రాబాద్ అలా వచ్చినవే. నా పరిస్థితి అయినప్పుడల్లా సహకరించదు. నన్నడిగితే మీలా ఉద్వేగాల్ని అదుపులో పెట్టుకోలేనివారే ఉద్యమాల్నుంచి తప్పుకుని ఉద్యోగాలు చేసుకుంటే మంచిది.

పాతవన్నీ గుర్తుపెట్టుకుని దబాయించడం సరికాదంటారా? గుర్తు పెట్టుకునేలా చేసిన 'శాడిజాన్ని' అడగండా ప్రశ్న. ఇక ముగిస్తాను. మీ అంత తర్కం నాకు తెలీదు. తెలుసుకోవాలనీ లేదు. మీలా నేను మాటకారిని కాను, కావాలనీ అనుకోవడమూ లేదు. నాకేమీ తెలీదని నిరూపించడమే మీ 'కామెంట్ల' పరమార్ధమైతే, సత్యాన్వేషణ పేరుతో ఎదుటివారి భావాల్ని తక్కువ చేయడమే మీ ప్రమాణ విద్య లక్ష్యమైతే అందుకు అనవసరంగా మీ సమయాన్నీ, శ్రమనీ వృధా చేసుకోనక్కర్లేదు. అవన్నీ తప్పులతడకంటూ మీకు తృప్తినిచ్చే విధంగా ఒప్పుకుంటాను. అయితే, నా దృష్టిలో అదసలు సమస్యే కాదు. సమస్యల్లా మన మేధస్సు సాంఘిక పురోగతికి దోహద పడుతుందా లేక తిరోగమనానికి తోడ్పడుతుందా అన్నదే. ఎంతో కొంత ప్రజాహితం కోసం పాటుపడడానికి సిద్ధమైన మన స్వభావాలు అక్కడక్కడా అజ్ఞాతంలో వున్నవారికి స్నేహ హస్తం అందించి, భావి తరాలకు వైజ్ఞానిక మార్గదర్శకత్వం వహిస్తూ కార్యకర్తలుగా వారి ఆచరణకి నిర్దిష్టమయిన నిబద్ధతగల అర్ధవంత ప్రేరణగా ఉండాలి కానీ, అసహ్యించుకునే నియంతృత్వ రూపాలుగానో, తప్పించుకునే వ్యక్తిత్వ స్వరూపాలుగానో ఉండకూడదనేదే అంతిమంగా మీకు నేనందించే ఆత్మీయ నివేదన. మరిక ఉంటాను. సెలవ్!

"Without free speech no search for truth is possible. no discovery of truth is useful"

– Charles Bradlaugh